కిషన్‌చందర్ రచనలు–1
రూ॥ 200/-
పేజీలు: 220
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్), హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ, హిమాయత్‌నగర్ (హైదరాబాద్), హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

జర్నలిస్టులను వేధిస్తున్న ప్రభుత్వ యంత్రాంగం
పిఎం కిసాన్ సమ్మాన్ పథకం కొందరికేనా?
లోపలి పేజీల్లో

సంపుటి 27, సంచిక: 332 | శుక్రవారం | 23-05-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00

# బిజెపితో బిఆర్ఎస్ పొత్తు అనుకుంటున్నరు



- బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌కు ఎమ్మెల్సీ కవిత లేఖ
- బహిరంగ సభలో మరికొందరితో మాట్లాడించాల్సి ఉండే
- కొంతమందికే మీతో కలిసే అవకాశం
- ప్లీనరీ పెట్టండి..కార్యకర్తల అభిప్రాయాలు వినండి
- బిఆర్ఎస్ సభ తర్వాత మే 2న లేఖ రాసిన కవిత
- అమెరికా నుంచి వచ్చే ముందు వైరల్



ప్రజాపక్షం/హైదరాబాద్

గత నెల జరిగిన బిఆర్ఎస్ బహిరంగ సభలో బిజెపి గురించి కెసిఆర్ రెండు నిమిషాలే మాట్లాడడంతో భవిష్యత్తులో ఆ పార్టీతో పొత్తుపెట్టుకుంటారనే ఊహాగానాలు మొదలయ్యాయని బిఆర్ఎస్ ఎంఎల్‌సి కె.కవిత అన్నారు. పార్టీలో కొందరికే కెసిఆర్‌ను కలిసే అవకాశం లభిస్తున్నదని నాయకులు బాధపడుతున్నారని, ప్రతి ఒక్కరినీ కలవాలని, అలాగే ఎల్కతుర్తి సభలో ఇతర నాయకులకు కూడా మాట్లాడే అవకాశం ఇస్తే బాగుండేదని అన్నారు. ఇప్పటికైనా పార్టీ ప్లీనరీ పెట్టి క్యాడర్ అభిప్రాయాలు వినాలని

తరువాయి 2లో

## రెండో స్థానం కోసం బిఆర్ఎస్‌లో పోరాటం



ఎంఎల్‌సి కవిత రాసిన లేఖ విషయంలో కాంగ్రెస్ పార్టీ ప్రమేయంలేదు. ఆ లేఖ బిఆర్ఎస్ పార్టీ అంతర్గత రాజకీయ సంక్షోభమై ఉండవచ్చు. దానిపై కవిత లేదా బిఆర్ఎస్ నాయకులే వివరణ ఇవ్వాలి. కొన్ని రోజుల నుండి కవిత వివిధ వేదికలపై చేస్తున్న ప్రకటనలకు ప్రతిరూపంగా లేఖలోని అంశాలు కనిపిస్తున్నాయి. వరంగల్ సభ బిఆర్ఎస్‌లోని కుటుంబ నాయకుల మధ్య అంతరాన్ని పెంచి, పార్టీలో రెండో స్థానం కోసం పోరాటం మొదలైంది.

**– కాంగ్రెస్ ఎమ్మెల్సీ డాక్టర్ అద్దంకి దయాకర్**

# మళ్లీ ఎన్‌కౌంటర్

- ఐదుగురు మావోయిస్టులు మృతి
- కొనసాగుతున్న ఎదురు కాల్పులు
- సరిహద్దుల్లో హై ఎలర్ట్

ప్రజాపక్షం/భద్రాచలం

ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి తుపాకుల మోత మోగింది. భద్రతా బలగాలు మావోయిస్టుల నడుమ గురువారం చోటు చేసుకున్న ఎదురు కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. సుకుమా, బీజాపూర్ జిల్లాల సరిహద్దు తుమ్రేన్, పిడియా అటవీ ప్రాంతంలో చోటు చేసుకున్న ఈ ఘటనలో ఇరు వర్గాల వారు కూడా గాయాలపాలైనట్లు తెలుస్తోంది. బుధవారం నాటి ఎన్‌కౌంటర్ తర్వాత రెట్టింపు ఉత్సాహంతో ఉన్న కోబ్రా, డిఆర్‌జి, కేంద్ర బలగాలు ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో పెద్దయెత్తున కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఇంద్రావతి, అబూజ్మడ్, మూడు జిల్లాల సరిహద్దుల్లో మోహరించిన బలగాలు

తరువాయి 2లో



నంబాల ఎన్‌కౌంటర్‌పై భిన్నస్వరాలు 05

# ట్రంప్ నోట మళ్లీ అదేమాట



కాల్పుల విరమణ ఘనత నాదేనని వ్యాఖ్య

## పెదవి విప్పని మోదీ

ఈ వ్యవహారమేంటో తేల్చండి : మళ్ళీ నిలదీసిన కాంగ్రెస్



**న్యూఢిల్లీ:** 'ఆపరేషన్ సిందూర్', అనంతర ఘటనలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దాయాదిదేశంతో వారసత్వంగా వస్తున్న ఘర్షణను మూడోజోక్యం లేకుండా పరిష్కరించుకోవాలన్న భారత్ ఆలోచనకు గండిపడటమే కాదు, బాహుబలి నాయకులుగా ప్రకటించుకున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఇద్దరూ కాల్పుల విరమణ ఘనతను తమ వ్యక్తిగత ఖాతాలో వేసుకుని ప్రపంచవ్యాప్తంగా ఎవరి ప్రచారం వారు చేసుకుంటున్నారు. ట్రంప్‌జోక్యాన్ని, ఆయన ప్రచారాన్ని మోదీ నిర్ద్వంద్వంగా ఖండించకుండా మౌనం పాటిస్తున్నారు. దక్షిణాఫ్రికా అధ్యక్షుడి అమెరికా పర్యటన సందర్భంగా మరోసారి ట్రంప్ ఆపరేషన్ సిందూర్‌ను ప్రస్తావించి తన ఘనత చెప్పుకోవడంతో ఈ విషయాన్ని కాంగ్రెస్ మళ్ళీ గట్టిగా నిలదీసింది. ఎవరూ వెనక్కి తగ్గకుండా ఆపరేషన్ సిందూర్ ద్వారా లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తున్నారనీ, కానీ భారత సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత సంగతేమిటని, మోదీ మౌనానికి అర్థం ఏమిటని ప్రశ్నించింది.

భారత తటస్థవైఖరిని మోదీ గంగలో కలిపేశారని, ఆపరేషన్ సిందూర్, అనంతర చర్యలు, మధ్యవర్తిత్వ విజయంపేరుతో ట్రంప్ దక్షిణాసియాలో పెత్తనం చేయడానికి పునాదులు వేసుకున్నారని వామపక్షాలుసహా ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాగానీ సమాధానం చెప్పకుండా బహుళపక్ష బృందాల పేరుతో కేంద్ర ప్రభుత్వం తన ప్రచారానికే పెద్దపీట వేసింది. బాహుబలి నాయకులిద్దరూ గొప్పలు చెప్పుకోవడం వరకే ఈ సమస్య పరిమితమవుతుందా? లేక తదనంతరం దేశానికి విపరీత సమస్యలు పుట్టుకొస్తాయా? అని ప్రతిపక్షాలు ఆందోళన చెందుతుంటే బిజెపి మౌనం పాటిస్తోంది. భారత్–పాకిస్థాన్‌లమధ్య రెండోదశలో అణుయుద్ధమే జరిగి ఉండేదని, అంతవరకూ వెళ్ళకుండా 'వాణిజ్యాన్ని అస్త్రంగా ప్రయోగించి తన మధ్యవర్తిత్వం ద్వారా ప్రాథమిక దశలోనే దానిని అడ్డుకున్నానని మే 10వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు సోషల్ మీడియా ద్వారా ట్రంప్ ప్రారంభించిన ప్రచారం అనంతంగా కొనసాగుతూనే ఉంది. "ఇది తన జీవితంలో సాధించిన అత్యంత ఘనవిజయం" అని ట్రంప్ తన వ్యక్తిగతఖాతాలో వేసుకుంటే మోదీ కూడా 'ఆపరేషన్ సిందూర్' కాక చల్లారిపోకుండా విడతలవారీగా రోజుకో కొత్త విషయాన్ని ఒక్కొక్కరితో చెప్పిస్తూ ప్రచారం చేసుకుంటున్నారు. ఇక బహుళపక్ష బృందాల ప్రపంచ ప్రచార ఘనత గురించి దేశంలో భారీ ప్రచారానికి బిజెపి సిద్ధమైంది. ఈ వ్యవహారం ఏమిటో లెక్క తేల్చాలని కాంగ్రెస్‌పార్టీ ప్రశ్నించింది. "ఆపరేషన్ సిందూర్‌ను భారత్ ఆపేసెందుకు వాణిజ్యాన్ని ఆయుధంగా ఉపయోగించానని ట్రంప్ చెబుతున్నారు. ప్రధానమంత్రి మోదీ దానిని ఒక్కసారి కూడా తిరస్కరించడంలేదు, ఈ మౌనానికి అర్థం ఏమిటి? దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సైరిల్ రామఫోసా బుధవారంనాడు వైట్‌హౌస్‌లోని ఓవల్ కార్యాలయంలో చర్చలకు వెళ్ళినప్పుడు కూడా ట్రంప్ ఆయన దగ్గర భారత్–పాకిస్థాన్ విషయాన్ని ప్రస్తావించారు. 'మీరు చూడండి, ఆ సమస్య మొత్తాన్ని మేం పరిష్కరించాం, వాణిజ్యం ద్వారా దానిని పరిష్కరించాననే నేను అనుకుంటున్నా, భారత్–పాకిస్థాన్ రెండు దేశాలతో భారీ ఎత్తున వాణిజ్యం చేస్తోంది' అని ట్రంప్ చెప్పారు" అని కాంగ్రెస్ మీడియా,ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేరా ఎక్స్ వేదికగా తన పోస్టింగ్‌లో పేర్కొన్నారు.

"కొంతమంది యుద్ధం చేయడాన్ని చివరి అవకాశంగా భావిస్తారు, కానీ ఈ యుద్ధం మొదలైతే పరిస్థితి అధ్వాన్నంగా మారుతుంది, మరింత పెద్దదవుతుంది, మరింత లోతుగా దేశాలకు విస్తరిస్తుంది, మనం వాళ్ళతో మాట్లాడాం, మీకూ తెలుసు, మనమే పరిష్కరించామని చెప్పుకోవడం నాకు ఇష్టంలేదు, రెండు రోజుల తర్వాత ఏదైనా జరగొచ్చు, అప్పుడు అది ట్రంప్ తప్పు అంటారు, కానీ భారత్, పాకిస్థాన్ దేశాలలో అద్భుతమైన నాయకత్వం, అర్థం చేసుకునే నాయకత్వం ఉంది, ఇది నిజంగా చాలా మంచి విషయం, మోదీ నా మిత్రుడు" అని ట్రంప్ చెప్పినప్పుడు దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రామఫోసా

తరువాయి 2లో



# ఎదురుకాల్పులపై తక్షణమే న్యాయ విచారణ

పది వామపక్షాల డిమాండ్ – హైదరాబాద్‌లో నిరసన

ప్రజాపక్ష /హైదరాబాద్

కగార్ ఆపరేషన్‌ను తక్షణమే నిలిపివేసి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, ఎన్‌కౌంటర్లపై తక్షణమే సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని వామపక్ష పార్టీల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఛత్తీస్ ఘడ్‌లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు పలువురుమావోయిస్టుల ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ, సిపిఐ(ఎంఎల్ )మాస్ లైన్, ఎంసిపిఐ(యు), సిపిఐ(ఎంఎల్) లిబరేషన్, సిపిఐ(ఎంఎల్), ఫార్వర్డ్ బ్లాక్, ఆర్‌ఎస్‌పి 10 వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ ఆర్‌టిసి క్రాస్ రోడ్ వద్ద నిరసన ప్రదర్శన

తరువాయి 2లో

## వారసత్వ కట్టడాలను కాపాడుకుంటూ
# పాతనగరాన్ని అభివృద్ధి చేసుకుందాం

- రూ.19,579 కోట్లతో మెట్రో రైల్ విస్తరణకు కేంద్రానికి ప్రతిపాదనలు
- హైదరాబాద్ మహానగరానికి రూ.7400 కోట్లతో గోదావరి నదీ జలాలు
- రూ.3840 కోట్లతో 39 ఎస్‌టిపిలు నిర్మాణం
- పాత నగరం అభివృద్ధి పురోగతిపై సమీక్ష సమావేశంలో డిప్యూటీ సిఎం మల్లుభట్టి విక్రమార్క

ప్రజాపక్షం /హైదరాబాద్



మహానగరాన్ని ప్రపంచ నగరంగా తీర్చిదిద్దడానికి ఎన్ని నిధులైన వెచ్చించడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో గురువారం పాతనగరం అభివృద్ధి, పురోగతి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి సలహా మేరకు ఓల్ సిటీ అభివృద్ధిపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు నిర్వహించిన ఈ సమావేశానికి హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ పార్లమెంటు పరిధిలోని ఎంఎల్‌ఏలు హాజరయ్యారు. హైదరాబాద్ పార్లమెంటు పరిధిలోని చార్మినార్, మలక్ పేట్, కార్వాన్, యాకుత్ పురా, చంద్రయాణ్ గుట్ట, బహదూర్‌పుర, నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పురోగతి పనులపై ఒక్కొక్కటిగా సమీక్షించారు. వాటి పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ హైదరాబాద్ పాత నగరంలో ఉన్న వారసత్వ నిర్మాణాలను కాపాడుకుంటూ పాత నగరాన్ని బాగా అభివృద్ధి చేసుకుందామని చెప్పారు.హైదరాబాద్ నగర అభివృద్ధికి గత బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించామని, ఇంత పెద్ద ఎత్తున నిధులు కేటాయించిన చరిత్ర ముందెన్నడు లేదన్నారు. హైదరాబాద్ మహానగర అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుని ముందుకు వెళుతుందని, అందులో భాగంగానే మూసీ పునర్జీవం, మెట్రో రైల్ విస్తరణ, పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, విద్యా సంస్థలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీలు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, విద్యాశాఖ సెక్రెటరీ యోగితారాణా, ఎంఎయుడి సెక్రెటరీ ఇలంబర్తి, వాటర్ బోర్డు ఎండి అశోక్ రెడ్డి, ఆర్‌టిసి ఎండి సజ్జనార్, ఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ ఫారుఖీ, మైనార్టీ వెల్ఫేర్ సెక్రెటరీ యాస్మిన్ భాష తదితరులు పాల్గొన్నారు.

**తాగునీటి కోసం గోదావరి నదీ జలాలు**

హైదరాబాద్ నగరవాసులకు కృష్ణా, గోదావరి నది జలాల ద్వారా తాగునీరు అందించింది ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వమేనని, గత పది సంవత్సరాలు అధికారంలో ఉన్న పాలకులు అదనంగా ఒక్క ఎంఎల్డి నీటిని హైదరాబాదుకు

తరువాయి 2లో



వాషింగ్టన్ డిసిలో ఇజ్రాయెల్
# 'దౌత్యవేత్తల జంట' కాల్చివేత

నేతన్యాహూ దిగ్భ్రాంతి
కస్టడీలో అనుమానాస్పద నిందితుడు

**వాషింగ్టన్ :** అమెరికాలో ఇజ్రాయెల్ 'దౌత్యవేత్తల జంట' హత్యకు గురయ్యారు. ఇజ్రాయెల్ దౌత్యకార్యాలయంలో పనిచేస్తున్న వీరిద్దరూ త్వరలో భార్యభర్తలు కాబోతున్నారు. కాల్పులకు పాల్పడిన ఉగ్రవాది, 30 ఏళ్ళు వయసుగల ఎలియాస్ రోడ్రిగ్జ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని చికాగోకు చెందిన యువకుడుగా గుర్తించారు. ఊహించని ఈ కాల్పుల ఘటనతో ఆ దేశ ప్రధానమంత్రి బెంజిమన్ నేతన్యాహూ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. తన హృదయం ముక్కలైపోయిందని ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ అన్నారు. ఈ క్లిష్టకాలంలో వారి కుటుంబాలకు అండగా నిలబడతామన్నారు. అమెరికా,బ్రిటన్ సహా పలు యూరప్ దేశాలు ఈ చర్యను ఖండించాయి. ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అధికారులు రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టారు. వాషింగ్టన్ డి.సిలోని యూదుల పురావస్తు ప్రదర్శనశాల వద్ద ఈ ఘటన జరిగిందని అధికారులు చెప్పారు. యారోన్ లిస్చిన్స్కీ, సారా లిన్ మిల్గ్రిమ్‌లు కాల్పుల్లో మరణించినట్లు ఇజ్రాయెల్ విదేశాంగమంత్రిత్వ శాఖ ప్రకటించింది. యువ దౌత్యవేత్త లిస్చిన్స్కీ ఒక ఉంగరాన్ని గత వారం కొనుగోలు చేశారు. వచ్చేవారంలో

తరువాయి 2లో

తాగునీటి అవసరాలకు
# రాష్ట్రానికి 10 టిఎంసిలు, ఆంధ్రకు 4 టిఎంసిలు

నీటిని కేటాయించిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు

ప్రజాపక్షం/హైదరాబాద్

వేసవి కాలం నేపథ్యంలో తాగునీటి అవసరాల దృష్ట్యా శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాలకు 14.26 టిఎంసిల నీటిని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు కేటాయించింది. ఇందులో భాగంగా తెలంగాణ 10.26 టిఎంసిలు, ఆంధ్రప్రదేశ్‌కు 4 టిఎంసిల నీటిని కేటాయించింది. ఈమేరకు కృష్ణానదీ యాజమాన్య బోర్డు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే శ్రీశైలంలో 800 అడుగులు, నాగార్జున సాగర్‌లో 505 అడుగుల నీటి మట్టం వరకు మాత్రమే నీటిని వినియోగించుకోవాలని సూచించింది. ప్రస్తుతం శ్రీశైలంలో

తరువాయి 2లో


# దేశవ్యాప్తంగా 103 'అమృత్ భారత్ స్టేషన్లు'

వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ



**బికనీర్:** దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాల్లోని 86జిల్లాల్లో అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా ఆధునీకరించిన 103 రైల్వేస్టేషన్లను ప్రధాని నరేంద్ర మోదీ రాజస్థాన్‌లోని బికనీర్‌లో జెండా ఊపి వర్చువల్‌గా ప్రారంభించి జాతికి అంకితమిచ్చారు. తెలంగాణలో బేగంపేట, కరీంనగర్, వరంగల్, ఆంధ్రప్రదేశ్‌లో సూళ్లూరుపేట రైల్వే స్టేషన్లు ఉన్నాయి. యూపీలో 19, గుజరాత్‌లో 18, మహారాష్ట్రలో 15, రాజస్థాన్‌లో 8 అమృత్ భారత్ స్టేషన్లు ఉన్నాయి. అనంతరం రాజస్థాన్‌లో రూ.26వేల కోట్లతో చేపట్టనున్న వేర్వేరు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులను తుదముట్టించామని అన్నారు. ఈ విషయంలో త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ పట్ల దేశ ప్రజలంతా గర్వపడుతున్నారని, భారత దళాలు పన్నిన వ్యూహాలకు శత్రువులు ఉక్కిరిబిక్కిరి అయ్యారని పేర్కొన్నారు. పహల్గాం ఘటనకు జవాబుగా 22 నిమిషాల్లోనే ఉగ్రవాదులను మట్టుబెట్టామని తెలిపారు. పాక్‌ను భారత దళాలు మోకాళ్ల మీద

తరువాయి 12లో



## తెలంగాణకు రైల్వే కనెక్టివిటీ పెంచాలి

కేంద్రాన్ని కోరిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ అభివృద్ధిలో మౌలిక వసతుల కల్పన కీలకపాత్ర పోషిస్తుందని, రాష్ట్ర అభివృద్ధికి రవాణా మార్గాలతో పాటు రైల్ కనెక్టివిటీని పెంచడంతో అభివృద్ధి పరుగులు పెడుతున్నదని రాష్ట్ర రోడ్లుభవనాల మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి అన్నారు. దేశవ్యాప్తంగా ఆధునీకరించిన 103 రైల్వే స్టేషన్లను ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం వర్చువల్ గా

తరువాయి 12లో

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎ-1 నిందితుడు
# ప్రభాకర్‌రావుకు దారులన్నీ బంద్


- అమెరికా నుంచి స్వదేశానికి రావాల్సిందేనని కోర్టు ఆదేశం
- బిఆర్ఎస్ నేతల్లో గుబులు

ప్రజాపక్షం/హైదరాబాద్




రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎ1 నిందితుడు స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబి) మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు మెడకు ఉచ్చు బిగుస్తోంది. అరెస్టు నుంచి తప్పించుకునేందుకు అయన ముందు ఉన్న దారులన్నీ మూసుకుపోయాయి. నూటికి నూరుశాతం ఆయన అమెరికా నుంచి హైదరాబాద్‌కు రావాల్సిందే, కోర్టులో హాజరుకావాల్సిందే. ఈ నేపథ్యంలో బిఆర్ఎస్ అగ్ర నేతల్లో గుబులు మొదలైంది. ప్రభాకరరావు

తరువాయి 12లో



# ప్రపంచం WORLD NEWS

## ఉక్రేన్–రష్యా చర్చలకు అమెరికా ప్రతినిధిబృందం



**న్యూయార్క్ :** ఉక్రేన్–రష్యా మధ్య రెండో విడత శాంతి చర్చలు వాటికన్‌సిటీ కేంద్రంగా జూన్ నెలలో జరిగే అవకాశం ఉందని అమెరికా మీడియా ప్రకటించింది. ఐతే కొత్త విశేషం ఏమిటంటే ఈసారి చర్చల్లో అమెరికా ప్రతినిధిబృందం కూడా పాల్గొనే అవకాశం ఉందని ఆ దేశ మీడియా ప్రముఖంగా ప్రస్తావించింది. అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో ఈ బృందానికి నాయకత్వం వహిస్తారు. ఇస్తాంబుల్‌లో 16న జరిగిన చర్చలు విఫలమైన తర్వాత అమెరికా–రష్యా అధ్యక్షులు ట్రంప్, పుతిన్ 19వ తేదీన దాదాపు రెం డు గంటలుపైగా టెలిఫోన్ సంభాషణ చేశారు. ఇస్తాంబుల్‌లో చర్చలు విఫలమైన తర్వాత రోమన్ క్యాథలిక్స్ మత గురువు పోప్ లియో–14 స్వయంగా ఒక ప్రకటన చేస్తూ, ఒక తటస్థకేం ద్రంగా వాటి కన్‌సిటీని ఉపయోగించుకుని రెండు దేశాలు శాంతి చర్చల ఒప్పందం చేసు కోవాలని ప్రతిపాదించారు. ఆయన పోప్ బాధ్యతలు చేపట్టినప్ప టినుండీ ఉక్రేన్, గాజాలలో మారణహోమంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ వచ్చారు. చివరకు ట్రంప్ఒత్తిడి తోడవ్వడంతో పుతిన్ అంగీకరించినట్లు భావిస్తున్నారు.

# యూదు వ్యతిరేక విద్వేషానికి అంతం పలకాలి

లండన్ : వాషింగ్టన్ డి సిలో 'ఇజ్రాయెల్ దౌత్యవేత్తలజంట'ను హత్యచేయడాన్ని అమెరికా సహా పలు దేశాలు వ్యతిరేకించాయి. బ్రిటన్,ఫ్రాన్స్ దేశాలు తీవ్రంగా ఖండించాయి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన సొంత ట్రూత్ సోషల్ మీడియా వేదికపై ఒక ప్రకటన చేస్తూ, ఈ హత్యలను అత్యంత ఘోరమైనవన్నారు. ఇది యూదు వ్యతిరేక విద్వేషంతో చేసిన హత్యలే అంటూ ఆజ్యంపోసే విధంగా విమర్శలు చేశారు. ఈ విద్వేషానికి ఇక అంతం పలకాలన్నారు. గాజాలో వేలాదిమంది అమాయకులైన పాలస్తీనియన్లను దాడుల్లో ఇజ్రాయెల్ హతమార్చడాన్ని ఆయన ప్రస్తావించలేదు. విద్వేషానికీ, రాడికలిజానికి అమెరికాలో ఎక్కడా తావులేదన్నారు. బ్రిటన్ విదేశాంగమంత్రి డేవిడ్ లమ్మీ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఇద్దరు దౌత్యవేత్తలను కాల్చిచంపిన ఘటనతో తాను తీవ్ర భయాందోళన చెందానన్నారు. దీనిని అత్యంత భయంకర ఘటనగా, యూదు వ్యతిరేక నేరంగా అభివర్ణించారు. ఫ్రాన్స్ విదేశాంగమంత్రి జీన్ నోయల్ బారోట్ కూడా దౌత్యవేత్తల హత్యను ఖండించారు. దీనిని యూదు వ్యతిరేక అనాగరిక చర్యగా పేర్కొన్నారు. ఇలాంటి చర్యలను ఏ దేశామూ సహించబోదని అన్నారు. జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ కాల్పుల ఘటనను ఒక నీచమైన చర్యగా పేర్కొన్నారు. ఈ హత్యను తీవ్ర పదజాలంతో ఆయన ఖండిస్తూ, ప్రస్తుతం యూదు వ్యతిరేకత వ్యాపించి ఉందని మనం భావించాల్సి వస్తోందన్నారు. ఇటలీ విదేశాంగమంత్రి ఆంటోనీ తజానీ ఈ చర్యను తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ఇజ్రాయెల్‌కు ఇటలీ దేశం అండగా నిలబడుతుందన్నారు. యూరోపియన్ యూనియన్ విదేశాంగ విధానాధిపతి కాజా కల్లాస్ మాట్లాడుతూ, మన సమాజాలలో ఎక్కడా ఉగ్రవాదానికీ, యూదు వ్యతిరేక విద్వేషానికి తావు లేదని అన్నారు. ఐరిష్ ప్రధాన మంత్రి మైఖేల్ మార్టిన్ ఈ చర్యను ఖండించారు.

**ప్రపంచవ్యాప్తంగా భద్రత కట్టుదిట్టం**

ప్రపంచవ్యాప్తంగా ఇజ్రాయెల్ దౌత్యకార్యాలయాలవద్ద భద్రతను కట్టుదిట్టం చేస్తామని ఆ దేశ ప్రధానమంత్రి నేతన్యాహూ ప్రకటించారు. తమ దౌత్యసిబ్బందికి కూడా భద్రతను మరింత పెంచుతామన్నారు. వాషింగ్టన్‌లో అత్యంత సమీపం నుండి తమ ఇద్దరు దౌత్య సిబ్బందిని ఉగ్రవాది కాల్చిచంపడం ఆందోళన కలిగిస్తోందన్నారు. అమెరికా ప్రభుత్వంపైన తమకు పూర్తి నమ్మకం ఉందని, తగినవిధంగా విచారణ చేసి శిక్షలు అమలు చేస్తారన్నారు. యూదు వ్యతిరేక విద్వేషానికి తాము భయంకరమైన మూల్యం చెల్లిస్తున్నామన్నారు. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా విద్వేషాన్ని పురిగొల్పుతున్నారన్నారు.

# బ్రిటన్,ఫ్రాన్స్,కెనడాపై ఇజ్రాయెల్‌మంత్రి ఆగ్రహం

**టెల్‌అవీవ్ :** బ్రిటన్,ఫ్రాన్స్,కెనడా దేశాలూ మూడూ ఉగ్రవాదశక్తులకు సరికొత్త జవజీవాలను అందించాయని, వారి యూదు వ్యతిరేక ప్రకటనలవల్లనే ఉగ్రవాదులు రెచ్చిపోయారనీ ఇజ్రాయెల్ డయాస్పోరా వ్యవహారాలమంత్రి అమిఛాయ్ చిక్లీ విమర్శించారు. బుజ్జగింపు ధోరణులు, ద్వంద్వ ప్రమాణాలు, కీలక సందర్భాలలో మౌనం పాటించడం వంటి పద్ధతుల ద్వారా యూరప్ దేశాల నాయకులు యూదు వ్యతిరేక విద్వేషానికి వంతపాడుతున్నారని విమర్శించారు. ఈ మూడు దేశాల నాయకులు నైతిక విలువల పరిధులు పాటించడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఇందుకు బాధ్యులైన యూరప్ దేశాల నాయకులను ఈ ఘటనకు బాధ్యులను చేస్తామని అన్నారు. వాషింగ్టన్ డి.సిలో గురువారంనాడు ఇద్దరు ఇజ్రాయెలీ యువ ''దౌత్యవేత్తలజంట'' కాల్పుల్లో మరణించిన ఘటనపై చిక్లీ తీవ్రంగా స్పందించారు. యూరప్ దేశాల యూదు వ్యతిరేక ప్రచారమే దీనికి కారణమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటన జరగడానికి 48గంటల ముందు మంగళవారం బ్రిటన్, ఫ్రాన్స్, కెనడా దేశాల నాయకులు కీర్‌స్టార్‌మర్, ఇమ్మాన్యుయేల్ మేక్రాన్, మార్క్ కార్నీలు ఒక ఉమ్మడి ప్రకటన చేస్తూ, తక్షణం ఇజ్రాయెల్ యుద్ధ విస్తరణ చర్యలు నిలిపివేయాలని, లేకపోతే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఇజ్రాయెల్‌తో వాణిజ్య ఒప్పందాన్ని కూడా నిలిపివేశారు. కొత్త ఆంక్షలు తెర మీదకు తెచ్చారు. ఈ ఏడాది మార్చి రెండో తేదీ నుండి గాజాలోకి అంతర్జాతీయ సహాయాన్ని వెళ్ళనీయకుండా ఇజ్రాయెల్ సైన్యం ఆంక్షలు అమలు చేస్తున్నది. ఈ ఆంక్షలవల్ల 20 లక్షల మంది పాలస్తీనా ప్రజలు ఆకలితో అలమటించిపోతున్నారు. 48 గంటల్లో ఆహారం అందకపోతే గాజాలో 14 వేలమంది పసిబిడ్డలు మరణించే ప్రమాదం ఉందని ఐక్యరాజ్యసమితి మానవతావ్యవహారాల విభాగం కూడా హెచ్చరించింది. మానవతా సహాయంపై ఆంక్షలను ఎత్తివేయకపోతే ఇజ్రాయెల్‌పై నిర్మాణాత్మక చర్యలు తీసుకుంటామని బ్రిటన్,ఫ్రాన్స్, కెనడా హెచ్చరించాయి. ఇద్దరు దౌత్య సిబ్బంది కాల్చివేత అనంతరం ఈ ప్రకటనలను ఇజ్రాయెల్ తనకు అనుకూలంగా మలచుకుంటున్నది.

## వెనక్కి తగ్గట్లే (మొదటి పేజీ తరువాయి)

స్పందిస్తూ, 'మనిద్దరికీ మోదీ ఉమ్మడి మిత్రుడు' అన్నారు. ''ఆయన గొప్ప మనిషి, నేను ఫోన్‌చేసి మాట్లాడా'' అని ట్రంప్ చెప్పారు. ఈ విధంగా ట్రంప్–మోడీ ఇద్దరూ వ్యక్తిగత ప్రచారం ద్వారా ప్రయోజనం పొందుతున్నారని కాంగ్రెస్ విమర్శించింది. భారత్–పాకిస్థాన్ దేశాలమధ్య ఉద్రిక్తతలను సడలించి యుద్ధాన్ని నివారించానని ప్రపంచవ్యాప్తంగా అనేక వార్తాసంస్థలకు, మీడియా సంస్థలకు, అంతర్జాతీయ ఏజన్సీలకు ఎడతెగని ఇంటర్వ్యూలిస్తూ ప్రచారం చేసుకుంటున్నారు. మధ్యప్రాచ్యంలో నాలుగు రోజుల పర్యటనలో కూడా ట్రంప్ ఈ విషయాన్ని బాగా వాడుకున్నారు.

**ట్రంప్ పదే పదే ఏం మాట్లాడినా.. మోదీ నోరు ఎత్తడంలేదు**

ట్రంప్ పదే పదే తన ఘనత గురించి ప్రచారం చేస్తున్నాగానీ మోదీ భయంకరమైన నిశ్శబ్దం ఎందుకు పాటిస్తున్నారని కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి, ఆ పార్టీ కమ్యూనికేషన్ల విభాగం ఇన్‌ఛార్జి జైరామ్ రమేశ్ ఎక్స్ వేదికగా నిలదీశారు. భారత్–పాకిస్థాన్‌లు ద్వైపాక్షికంగానే కాల్పుల విరమణ అవగాహనకు వచ్చాయని, ఎవరి జోక్యం లేదని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ చెబుతున్నారు. మరోవైపు ట్రంప్ ఒకవైపు తనపాటికి తాను భారత్–పాక్ వ్యవహారాన్ని తానే మధ్యవర్తిత్వంతో చక్కబెట్టానంటున్నారు, ట్రంప్ ప్రకటనలను మోదీ ఖండించడంలేదు, ఎందుకీ భయంకరమైన నిశ్శబ్దాన్ని మోదీ పాటిస్తున్నారు అని ప్రశ్నించారు. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రామఫోసాతో చర్చల సందర్భంగా భారత్–పాకిస్థాన్‌లను వాణిజ్యాన్ని ఉపయోగించి యుద్ధవిరమణ చేయించానని మరోసారి ట్రంప్ చెప్పడంతో కాంగ్రెస్ మండిపడింది. భారత్–పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఘనత తనదేనని పదకొండు రోజుల్లో ట్రంప్ ఎనిమిదిసార్లు గొప్పలు చెప్పుకున్నారని, రెండు దేశాల ప్రధానమంత్రులను ఒకేగాటనకట్టిన ట్రంప్, ఇటు మోదీని, అటు షెహబాజ్ షరీఫ్‌ను సమానంగా ప్రశంసిస్తున్నారని, వాణిజ్యాన్ని అస్త్రంగా ఉపయోగించానని కూడా పదే పదే చెబుతున్నారనీ దీనికి బదులు చెప్పాలని మోదీని జైరామ్ రమేశ్ డిమాండ్ చేశారు.

''మోదీ మనకు ప్రధానమంత్రేగానీ, డోనాల్డ్ భాయ్‌కి మంచి మిత్రుడు, ట్రంప్ పదే పదే ఏం చెప్పినాగానీ మోదీ పూర్తి మౌనం పాటిస్తున్నారు. విదేశాంగమంత్రి కూడా చాలా నిశ్శబ్దాన్ని పాటిస్తున్నారు, మరోవైపు అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో అధ్యక్షుడు ట్రంప్ ఏం చెప్పినా మద్దతు ఇస్తున్నారు'' అని జైరామ్ రమేశ్ పేర్కొన్నారు.

## 'దౌత్యవేత్తల జంట' కాల్చివేత

(మొదటి పేజీ తరువాయి)

జెరూసలెంలో సారా మిల్గ్రిమ్‌కు ప్రపోజ్ చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ దశలో అమెరికా యూదు కమిటీ ప్రత్యేకించి యూదు యువతీయువకులకోసం ఒక కాక్‌టైట్ సాయంత్రాన్ని నిర్వహించింది. ఇజ్రాయెల్ దౌత్యకార్యాలయ సిబ్బంది కూడా ఈ ఈవెంట్‌లో పాల్గొన్నారు. భారత కాలమానం ప్రకారం గురువారం ఉదయం 6.30 గంటలకు (బుధవారం సాయంత్రం) ఈ కార్యక్రమానికి హాజరవుతుండగా వారిని అత్యంత సమీపం నుండి కాల్చి చంపారు. గాజాలో ప్రజలకు సహాయం చేసే ఉద్దేశంతో యూదు మ్యూజియంలో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కమిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ టెడ్ డచ్ చెప్పారు. ''ఈ ఘటన తీవ్ర ఆవేదన కలిగిస్తోంది, వారి ప్రియమైన కుటుంబసభ్యులకు, ఇతర బంధువులు, స్నేహితులకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాం'' అని టెడ్ డచ్ సోషల్ మీడియాలో రాశారు. ప్రపంచవ్యాప్తగా యూదుల హక్కులను పరిరక్షించడంకోసం ఈ యూదు కమిటీ వేదికను ఏర్పాటు చేశారు. ఈ మతిలేని దారుణ హింసాకాండతో తాము దిగ్భ్రాంతి చెందుతున్నామని యూదు మ్యూజియం నిర్వాహకులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేశారు. ఆ ఇద్దరి మృతికి హృదయపూర్వక సానుభూతి, సంతాపం ప్రకటించారు. ''పాలస్తినాకు విముక్తి కలిగించాలి'' అని నిందితుడు నినాదాలు చేసినట్లు ఇజ్రాయెల్ పేర్కొంది.

## ఆంధ్రకు 4 టిఎంసిలు

(మొదటి పేజీ తరువాయి)

8.422 టిఎంసిలు, నాగార్జున సాగర్‌లో 21.215 టిఎంసిలు మొత్తం 21.215 టిఎంసిల నీరు అందుబాటులో ఉంది. అయితే ఇందులో నీటిసరఫరా, ఆవిరిలో 4.243 టిఎంసి (20 శాతం) పోను మిగిలిన 16.972 టిఎంసిల్లో తాగు నీటి అవసరాలకు గాను తెలంగాణకు 10.26 టిఎంసిలు, ఆంధ్రప్రదేశ్‌కు 4 టిఎంసిలు నీటిని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు కేటాయించింది. దీంతో గురువారం నుంచి నాగార్జున సాగర్ కుడి కాల్వ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు రోజుకు 5,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

## పొత్తు అనుకుంటున్నరు

(మొదటి పేజీ తరువాయి)

కోరారు. బహిరంగసభలో వక్ఫ్ చట్టం, బిసి రిజర్వేషన్‌లు, ఎస్‌సి వర్గీకరణ అంశాలపై మాట్లాడకపోవడం, పాత నాయకులకే ఇన్‌ఛార్జ్ ఇవ్వకపోవడాన్ని ఆమె లేనెత్తారు. ఈ మేరకు బిఆర్‌ఎస్ అధ్యక్షులు కె.చంద్రశేఖర్‌రావుకు కవిత ఈ నెల 2న రాసిన ఆరు పేజీల లేఖ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇటీవల పార్టీ వ్యవహారాలపై అసంతృప్తి వ్యక్తం చేసిన కవిత తన కుమారుని గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి హాజరై అమెరికా నుంచి తిరిగి వచ్చేందుకు ఒక రోజు ముందే ఈ లేఖ వెలుగులోకి రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆరు పేజీల లేఖలో 'పాజిటివ్, నెగిటివ్' ఫీడ్ బ్యాక్ అని అంశాల వారీగా ప్రస్తావించారు. లేఖలో ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి.

**బిజెపికి హెల్ప్ చేసామని అనుకుంటున్నరు**

''బిజెపి మీద మీరు కేవలం రెండు నిమిషాలు మాత్రమే మాట్లాడడంతో చాలా మంది ఫ్యూచర్‌లో పొత్తుపెట్టుకుంటారనే (బిజెపితో) స్పెక్యూలేషన్ మొదలు పెట్టారు..పర్సనల్‌గా నాకు కూడా ఇంకా బలంగా మాట్లాడాలని ఉండే.. నేను సఫర్ అయ్యా ను కదా..?.. అందుకే కావొచ్చు. ఇంకొంచెం మీరు బిజెపిని టార్గెట్ చేయాల్సిందేమో.. డాడీ...ఎంఎల్‌సి ఎలక్షన్‌లో మనం పోటీ చేయకుండా బిజెపికి హెల్ప్ చేశామనే మెసేజ్ ఎక్స్‌ప్రెస్ బలంగా వెళ్లింది'' అని బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, కెసిఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

**కొందరినే కలుస్తున్నరు...**

చాలా మంది జెడ్‌పిటిసి, జెడ్‌పి ఛైర్మన్లు, ఎంఎల్‌ఎ స్థాయి నాయకులకు కెసిఆర్‌ను కలువలేకపోతున్నామని బాధపడుతున్నారని, ఎంపిక చేసిన నాయకులకు మాత్రమే కెసిఆర్‌ను కలిసేందుకు వీలవుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయని, ప్రతి ఒక్కరినీ కలువాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ పట్ల విశ్వసం కోల్పోయిందని, కాంగ్రెస్‌కు బిజెపి ప్రత్యామ్నాయం అవుతుందనే ఆలోచన పార్టీ శ్రేణులు ఆలోచిస్తున్నారని కవిత చెప్పారు.

**ప్రసంగం బాగుంది.. కానీ...**

వరంగల్ సభలో కెసిఆర్ వేదికపైకి వచ్చే ముందు సీనియర్ నాయకులు,2001 నుంచి పార్టీలో ఉన్న వారితో మాట్లాడిస్తే బాగుండేదని కవిత అభిప్రాయపడ్డారు. సభలో నిర్వహించిన 'ధూంధాం' కార్యకర్తలను ఆకట్టుకోవడంలో విఫలమైందన్నారు. తాజా రాజకీయ పరిణామాలపై మార్గనిర్దేశం చేస్తారని అందరూ భావించారని, ఇప్పటికైనా ఒకటి,రెండు ప్లీనరీ పెట్టి, పార్టీ శ్రేణుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని, మార్గదర్శకాలు ఇవ్వాలని సూచించారు. ఈ విషయాన్ని కొంచెం సీరియస్‌గా తీసుకోవాలని ఆ లేఖలో పేర్కొంది. ఉర్దూలో మాట్లాడకపోవటం, వరంగల్ సభలో ఎస్‌సి వర్గీకరణ, వక్ఫ్ చట్టం గురించి మాట్లాడలేదని, బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అంశాన్ని విస్మరించారని ఆ లేఖలో కవిత పేర్కొన్నారు. ఇంత పెద్ద మీటింగ్‌ను మళ్లీ పాత ఇన్‌చార్జ్‌లకు ఇవ్వడంతో వాళ్ల పాత పద్ధతిలోనే తెలంగాణ ఉద్యమకారులకు సదుపాయాలు కల్పించలేదని కొన్ని నియోజకవర్గాల్లో చర్చ జరిగిందని ఆ లేఖలో కవిత స్పష్టం చేశారు. పాత ఇన్‌చార్జ్‌లకే స్థానిక సంస్థల బి ఫాములు ఇస్తారని కొందరు నాయకులు చెప్పుకుంటున్నారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలను పాత ఇన్‌చార్జ్‌లకు అప్పజెప్పడంతో తెలంగాణ ఉద్యమకారులకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని, వరంగల్ సభలో ఇంకొంచెం పంచ్ ఆశించారని వివరించారు. వరంగల్ సభ మొత్తంగా పార్టీ శ్రేణులు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. ఆపరేషన్ కగార్‌ను వ్యతిరేకించడం , పహల్గం మృతులకు మౌనం పాటించడం, సిఎం రేవంత్ రెడ్డి పేరు తీసుకోకుండా మాట్లాడడం అందరికీ నచ్చిందన్నారు. కెసిఆర్ ప్రసంగంలో పోలీసులకు ఇచ్చిన వార్నింగ్ కూడా పార్టీ శ్రేణులకు నచ్చిందని కవిత ప్రశంసించారు. కాగా వరంగల్ సభ, కెసిఆర్ ప్రసంగం, బిజెపిపై బిఆర్‌ఎస్ వ్యవహార శైలిపైన కవిత తన అభిప్రాయాన్ని, క్షేత్రస్థాయికి చెందిన పరిస్థితులను తెలియజేశారు.

## న్యాయ విచారణ

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ, ఎస్.వీరయ్య సిపిఐ (ఎం), వేములపల్లి వెంకట్రామయ్య (సిపిఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ), కె.జి.రాంచందర్(మాస్ లైన్), గాదగోని రవి(ఎంసిపిఐ), ప్రసాదన్నసిపిఐ(ఎంఎల్), జానకిరాములు(ఆర్ఎస్‌పి), సిహెచ్. మురహరి( ఎస్‌యుసిఐ ) ప్రసాద్( పార్వర్డ్ బ్లాక్ ) పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ మాట్లాడుతూ మావోస్టుల ఎన్‌కౌంటర్లపై సుప్రీం కోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించి వాస్తవ, అవాస్తవాలపై శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకవైపు పౌర హక్కుల నాయకులపై, మరోవైపు మావోయిస్టులపై హత్యకాండను కొనసాగిస్తున్నారని, ఈ ప్రజా స్వామ్యం దేశంలో కొనసాగుతున్నది ప్రజా పాలన ? లేక హిట్లర్ పాలనా ? అని ప్రశ్నించారు. దేశ ప్రజలరా పాలకుల అక్రమాలపై ప్రశ్నించే గొంతికలుగా ఉన్న మావోయిస్టులను ఇప్పుడు పొట్టన పెట్టుకుంటున్నట్లుగానే రేపు బిజెపి హిందూ మతోన్మాదులకు ఓటు వేయకపోతే కాల్చి మనం అంతం చేసే దారుణమైన రాజకీయ పరిస్థితి కూడ రావచ్చన్నారు. అందుకే మావోస్టులను పొట్టన పెట్టుకుంటున్న కిరాతకాన్ని అడ్డుకోవడానికి ఈ దుర్మార్గని ప్రశ్నించడానికి ప్రజలంతా ముందుకు రావాలని పశ్య పద్మ విజ్ఞప్తి చేశారు. ఎస్.వీరయ్య మాట్లాడుతూఅటవిలోని ఖనిజ సంపదను, భూమిని కార్పోరేట్ శక్తులకు దోచిపెట్టేందుకే బిజెపి ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను ఎన్‌కౌంటర్లపేరుతో అతి కిరాతకంగా కాల్చి చంపుతోందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కేంద్ర బలగాలను అడ్డం పెట్టుకుని ఓ సంస్థను పూర్తిగా నిర్మూలించడంలో విజయవంతం కావోచ్చుమో గాని, మౌలిక సమస్యలను పరిష్కరించనంత కాలంలో ఇలాంటివి సంస్థలు 100ల సంఖ్య ఉద్భవించడమే కాకుండా వేల సంఖ్యలు ఉద్యమకారులు పుట్టుకువస్తారని హెచ్చరించారు. వేములపల్లి వెంకట్రామయ్య తదితరులు మాట్లాడుతూ తాము శాంతిచర్చలకు సిద్దమని, 6 నెలల పాటు కాల్పుల విరమణను పాటిస్తున్నామని ప్రకటించినప్పటికి కేంద్ర ప్రభుత్వం మాత్రం రాజ్యాగానికి, ప్రజాస్వామ్యానికి విరుద్దంగా మావోస్టులను వేటాడి వెంటాడి కాల్చి చంపుతున్నారని, ఈ దమన కాండనుతక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ సమితి సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి.స్టాలిన్, నగర సమితి సభ్యులు చెట్టుకింది శ్రీనివాస్, అనిల్‌కుమార్, ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె. ధర్మేంద్ర, కార్య నిర్వహక అధ్యక్షులు ఎన్. శ్రీకాంత్, రాష్ట్రసమితి సభ్యులు సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**మందుపాతర పేలి..డిఆర్‌జి జవాన్ మృతి**

ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పోలీస్‌కు చెందిన డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డు (డిఆర్‌జి) జవాన్ మావోయిస్టులు నాటిన మందుపాతర పేలి మృతిచెందారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లాలో మావోయిస్టులు వెళుతుండగాఈ సంఘటన జరిగిందనిఅధికారులు చెప్పారు.ఈ ఘటన బుధవారం అబూజ్‌మడ్ ఏరియాలోని దట్టమైన అటవీ ప్రాంతంలో బుధవారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. భద్రతా బలగాలు మేజర్ ఎన్‌కౌంటర్ తర్వాత తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకున్నదని ఒక సీనియర్ పోలీస్ అధికారి చెప్పారు. నిషేధిత సిపిఐ (మావోయిస్టు) ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజ్ (70) సహా దాదాపు 27మంది మావోయిస్టులు భద్రతా బలగాల ఎదురుకాల్పుల్లో మృత్యువాతకు గురయ్యారు. తిరిగివస్తున్న సమయంలో బీజాపూర్ డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డు (డిజిఆర్)కు చెందిన జవాన్ రమేష్ హేమ్లా అక్కడ నాటబడిన మందుపాతర (ఐఇడి) మీద కాలుపడటంతో ఒత్తిడికి గురయ్యి పేలడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయాన్ని ఒక అధికారి చెప్పారు. తొలుత బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో డిఆర్‌జి సభ్యుడు ఖోత్లురామ్ కొర్రమ్ మరణించాడు. నారాయణ్‌పూర్ ప్రాంతం ఒర్చ్చా పోలీస్ స్టేషన్‌లోని భట్ బేడాకు చెందిన నివాసి కొర్రమ్ అని అధికారులు తెలియజేశారు.

**ఎన్‌కౌంటర్ అమానవీయం : సిపిఐ(ఎం) పొలి–ట్‌బ్యూరో ...**

ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో సిపిఐ మావోయిస్ట్ ప్రధానకార్యదర్శి నంబాల కేశవరావు సహా 27మంది మృతిచెందడాన్ని సిపిఐ(ఎం) గురువారం తీవ్రంగా ఖండించింది. సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో గురువారం ఇక్కడ ఒక ప్రకటన విడుదల చేసింది. చర్చలు జరపాలని మావోయిస్టుల నుంచి పదే పదే విజ్ఞప్తులు వచ్చినప్పటికీ కేంద్రం, బిజెపి నేతృత్వంలోని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం పెడచెవిన పెట్టడాన్ని ఆక్షేపించింది. కేంద్ర ప్రభుత్వం, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం వినాశకర విధానాలను అనుసరిస్తున్నాయని సిపిఐ(ఎం) మండిపడింది. కేంద్రం డెడ్‌లైన్ విధించడం, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి చర్చలు జరపాల్సిన అవసరం లేదని ప్రకటన చేయడం ఫాసిస్టు ఆలోచనా ధోరణిని ప్రతిబింబిస్తున్నదని ధ్వజమెత్తింది. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా మానవ ప్రాణాలను బలిగొనడం అమావనవీయ చర్య అని ఆరోపించింది. వామపక్షాలు సహా అనేక రాజకీయ పార్టీలు, పౌరులు ఇప్పటికైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాల్పులు విరమించి మావోయిస్టులతో చర్చలు జరపాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడం శోచనీయమని సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో ఆక్షేపించింది.

## అభివృద్ధి చేసుకుందాం

(మొదటి పేజీ తరువాయి)

తీసుకురాలేదని డిప్యూటీ సిఎం చెప్పారు. రానున్న ఐదు సంవత్సరాలకు హైదరాబాదు నగర వాసులకుసరిపోను మంచినీటిని సరఫరా చేయడానికి రూ.7400 కోట్ల రూపాయలతో గోదావరి ఫేజ్ 2, ఫేజ్ 3 ద్వారా 20 టీఎంసీల గోదావరి నీళ్లను తీసుకురానున్నామని చెప్పారు. ఇందులో ఐదు టిఎంసిలు మూసీ పునర్జీవం కోసం,15 టిఎంసిలు హైదరాబాద్ నగర ప్రజల తాగునీటికి వాడుతామని వెల్లడించారు. హైదరాబాద్ నగరంలో 2014 ముందు ఆనాటి ప్రభుత్వాలు 25 ఎస్‌టిపిలు నిర్మాణం చేయగా, 10సంవత్సరాల కాలంలో గత పాలకులు కేవలం 20 ఎస్‌టిపిల నిర్మాణం చేపట్టారని, ప్రజా ప్రభుత్వం ఈ ఒక్క సంవత్సరంలోనే రూ.3840 కోట్లతో 39 ఎస్‌టిపిల నిర్మాణం చేస్తున్నామని వెల్లడించారు. చంద్రయాణగుట్ట నియోజకవర్గంలోని నిజాంకాలం నాటి 156 కిలోమీటర్ల పొడవున్న మురుగునీటి వ్యవస్థను పూర్తిగా రూ.301 కోట్లతో ఆధునికరిస్తున్న పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు.

**నగరంలో మెట్రో రైల్ విస్తరణ...**రూ. 2714 వందల కోట్లతో ఎంజిబిఎస్ నుంచి చంద్రయాణ గుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మేర మెట్రో రైల్ విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి పంపించామని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. మెట్రో రైల్ ఏర్పాటు కోసం రోడ్డు విస్తరణ పనులు పాత నగరంలో శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. రూ.19,579 కోట్లతో జెడిఎస్ నుంచి మేడ్చల్, జెడిఎస్ నుంచి షామీర్‌పేట్, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో రైల్ విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపించామన్నారు. పాతనగరంలో ఇప్పటివరకు 42 విద్యుత్తు సబ్ స్టేషన్ లు ఉండగా ఈ సంవత్సరం అదనంగా 18 సబ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అదనంగా ఫీడర్స్ ను బిగించి ఓవర్ లోడ్ సమస్యను అధిగమించి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేశామని వెల్లడించారు. పాత బస్తీలో ఇప్పటి వరకు 25% అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ పూర్తయిందని మిగతా బ్యాలెన్స్ పనులకు ప్రతిపాదనలను అధికారులు సిద్ధం చేస్తున్నారని వెల్లడించారు. హైదరాబాద్ మహా నగరంలో ఇండ్లపై నుంచి ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్తు తీగలను సరిచేయాలని ఆదేశించారు. యాకుత్పురాలో 50 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి కావలసిన స్థలానికి తక్షణమే ఎన్వోసి ఇవ్వాలని జిహెచ్ఎంసి కమిషనర్ ను ఆదేశించారు. చార్మినార్ పాదాచారుల ప్రాజెక్టు దాదాపుగా పూర్తయిందని పెండింగ్‌లో ఉన్న చిన్న చిన్న పనులను త్వరలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు చెప్పారు. సిఎం రేవంత్‌రెడ్డి ఈప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని ఈసందర్భంగా అధికారులకు గుర్తు చేశా రు. మీ అసెంబ్లీ నియోజకవర్గంలో అంబేద్కర్ నా లేడ్జీ సెంటర్ ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను గుర్తించాలని హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలకు సూచించారు. పాతనగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**అగ్ని ప్రమాదాలు పునారావృతం కాకుండా పకడ్బందీ చర్యలు...** ఓల్ సిటీ, గుల్జర్ హౌస్ సమీపంలో అగ్ని ప్రమాదం జరిగి ఇటీవల 17 మంది చనిపోవడం చాలా బాధాకరం. ఇది ప్రమాదమే అయినప్పటికీ భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునారావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోకపోతే చరిత్ర క్షమించదని డిప్యూటీ సిఎం అన్నారు. హైదరాబాదులో అగ్నిప్రమాదాల నివారణకు ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమిటీ వేశారని, ఆ నివేదిక వచ్చిన తర్వాత ప్రభుత్వ నిర్ణయం తీసుకుని చేపట్టే సంస్కరణలకు ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలన్నారు. అగ్నిప్రమాదాల నివారణకు ప్రభుత్వం చేపట్టే సంస్కరణలకు దార్శనీకతతో నాయకులు ప్రజలను ఒప్పించి అగ్నిప్రమాద నివారణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలకు సహకరించాలన్నారు.

## మళ్లీ ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

ఆ ప్రాంతాన్ని పూర్తిగా ఆ ఆదీనంలోనికి తీసుకున్నాయి. ఈ క్రమంలో మావోయిస్టులు తారసపడటంతో ఇరు వర్గాల మధ్య రెండు గంటలకు పైగా ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు అక్కడికక్కడి మృతి చెందారు. మృతదేహాలతో పాటు భారీగా ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని కూడా స్వాదీనం చేసుకున్నారు. ఎదురుకాల్పుల ఘటనలో మావోయిస్టులు గాయాలపాలై అడవుల్లోనికి జారుకునే అవకాశం ఉండటంతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. అడదడపా కాల్పుల మోత మోగుతూనే ఉంది. మృతుల సంఖ్యతో పెరిగే అవకాశం ఉన్నట్లు పోలీస్ వర్గాలు భావిస్తున్నాయి.

**సరిహద్దుల్లో హై ఎలర్ట్**

వరుస ఘటనలతో పాటు మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు మృతితో ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా రాష్ట్రాలతో పాటు మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లో హై ఎలర్ట్ కొనసాగుతోంది. అన్ని ప్రాంతాలను తమ ఆదీనంలోనికి తీసుకున్న బలగాలు ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలిస్తున్నారు. వాహన తనిఖీల్లో భాగంగా మావోయిస్టులు తలదాచుకునేందుకు వీలైన స్థావరాలపై కూడా నిఘా పెంచారు. ఛత్తీస్‌గఢ్ దండకారణ్యాన్ని చుట్టుముట్టిన బలగాలు నాలుగువైపుల నుండి కూంబింగ్ ముమ్మరం చేశాయి.

**మావోయిస్టుల కథ ముగిసినట్లే**

ఛత్తీస్‌గఢ్ అడవుల్లో మావోయిస్టుల కథ దాదాపుగా ముగిసినట్లే అని ఆ రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులు పేర్కొంటున్నాయి. మావోయిస్టు అగ్రనేత, సిద్ధాంతకర్త కేశవరావును అడవుల్లో మట్టుపెట్టడం బలగాల ఘన విజయంగా పేర్కొన్నారు. ఇక బస్తర్ క్షేత్రంలో మావోయిస్టుల ఉనికిని వచ్చే ఏడాది మార్చి ఆఖరి నాటికి సమూలంగా లేకుండా చేస్తామని చెప్పుకొచ్చారు.

# మావోయిస్టుల మృతదేహాలు గుర్తింపు

- ప్రత్యేక ఆర్మీ హెలీకాప్టర్‌లో నారాయణ్‌పూర్ తరలింపు
- వాతావరణ ప్రతికూల పరిస్థితుల్లో తరలింపు ఆలస్యం
- ఇప్పటికే నంబాలతో సహా పలువురి గుర్తింపు
- పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించే అవకాశం
- ఎన్‌కౌంటర్‌పై వ్యక్తమవుతున్న అనుమానాలు
- జవాన్ల ఆనందోత్సాహాలు



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఛత్తీస్‌గఢ్‌లో బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో మృతిచెందిన మావోయిస్టు కేంద్రప్రధానకార్యదర్శి నంబాలకేశవరావు అలియాస్ బసవరాజ్ మృతదేహంతో సహా 27 మృతదేహాలను గురువారం ప్రత్యేక ఆర్మీ హెలీకాప్టర్‌లో నారాయణ్‌పూర్ పోలీస్ క్యాంపునకు తరలించారు. బుధవారం సాయంత్రమే మృతదేహాలను స్వాధీనం చేసుకున్నప్పటికీ వాతావరణ ప్రతికూల పరిస్థితులు కారణంగా తరలింపులో జాప్యం జరిగింది. 27 మందిలో ఇప్పటికే నంబాల కేశవరావుతో సహా మావోయిస్టు పార్టీ జంగ్ పత్రిక ఎడిటోరియల్ ఇంచార్జ్ సజ్జా వెంకట నాగేశ్వరరావు పాటు 25 మందిని గుర్తించారు. కాగా కొందరి కుటుంబీకుల వివరాలు తెలియాల్సి ఉంది. మృతుల్లో సుమారు 12 మంది మహిళలు ఉన్నారు. మృతదేహాల పోస్టుమార్టం తర్వాత బంధువులకు అప్పగించే అవకాశం ఉంది, శ్రీకాకుళం జిల్లా జయన్నపేట గ్రామానికి చెందిన నంబాల కేశవరావు కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. వారి కుటుంబం అంతా వైజాగ్‌లో స్థిరపడటంతో అక్కడకి వెళ్లి విషయాన్ని పోలీసులు తెలపడంతో ఫొటో ఆధారంగా మృతదేహాన్ని గుర్తించిన వారు నంబాల మృతదేహాన్ని స్వాదీనం చేసుకునేందుకు ఛత్తీస్‌గఢ్ వెళ్లినట్లు తెలుస్తోంది. దాదాపు అర్ధశతాబ్ధపు అజ్ఞాతంలో అనేక సంచలనాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలించిన మెరుపుదాడుల వ్యూహకర్త ఊపిరి తాను నమ్మిన సిద్ధాంతం నడుమే ఆగింది. భద్రతా బలగాల చేతిలో చనిపోయిన రెండో మావోయిస్టు రథసారధిగా కేశవరావు చరిత్రకు ఎక్కాడు. పశ్చిమబెంగాల్‌లో పోలీసులు నిర్భంధంలో మృతిచెందిన చార్‌మంజుదార్ మొదటి వాడు కాగా బుధవారం భద్రతా బలగాల చేతిలో మృతి చెందిన నంబాల రెండవ వ్యక్తి.


### ఎన్‌కౌంటర్‌పై పలు అనుమానాలు ...

బుధవారం చోటు చేసుకున్న ఎదురు కాల్పులపై ప్రజాసంఘాల, విప్లవ పార్టీలు, మేధావులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మావోయిస్టు కేంద్ర కమిటీకి చెందిన సభ్యులు రహస్య సమావేశం నిర్వహిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు మెరుపుదాడి చేసిన భద్రతా బలగాలు 27 మందిని హతమార్చాయి. కాగా కేంద్ర కార్యదర్శి కేశవరావును చేరుకోవాలంటే కనీసం మూడంచెల భద్రతను దాటుకుంటూ వెల్లాల్సి ఉంటుంది. వారం ముందు నుండే చుట్టుముట్టిన బలగాలు బుధవారం మట్టుపెట్టే పేరులో విషప్రయోగం చేశారా, పట్టుకుని కాల్చి చంపారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది ముమ్మాటికీ బూటకపు ఎన్‌కౌంటర్ అంటున్నారు. మావోయిస్టులను, వామపక్ష భావాజాలాన్ని అంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌తో పేరుతో హత్యలు చేస్తోందని, ఇప్పటికైనా శాంతిచర్చలు జరపాలని, మృతదేహాలు కుళ్లిపోకునండానే గుర్తింపు ప్రక్రియ చేపట్టి వారివారి కుటుంబాలకు అప్పగించాలని మేధావులు, ప్రజాస్వామిక వాదులు, విప్లవోధ్యమ సానుభూతిపరులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



### జవాన్ల కేరింతలు...

మావోయిస్టుల మృతదేహాల ముందు జవాన్లు ఆనందంతో కేరింతలు కొట్టారు. మావోయిస్టులు సిద్ధాంతకర్త, రూపకర్తను మట్టుపెట్టడంతో గొప్పవిజయాన్ని సాధించినట్లు అయ్యిందని కేంద్ర ప్రభుత్వం ప్రశంసించడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. మావోయిస్టుల మృతదేహాలను తరలించే క్రమంలో మృతదేహాల ముందు తూపాకులు పైకెత్తి కేరింతలు కొట్టారు. కాగా దీనిపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.





# జనరల్
STATE & REGIONAL NEWS

## పివి స్మారక అవార్డు ప్రదానోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** మాజీ ప్రధాని, ఆర్థిక సంస్కర్త దివంగత పి.వి.నరసింహారావు దేశానికి చేసిన సేవలు, కార్యక్రమాలు, విధానాలను ప్రతి ఒక్కరికీ తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని పలువురు వక్తలు పేర్కొన్నారు. పి.వి.నరసింహారావు రావు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పి.వి.జయంతి సందర్భంగా జూన్ 28న న్యూఢిల్లీలోని జరిగే పి.వి.నరసింహారావు మెమోరియల్ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమ పోస్టర్‌ను, యూట్యూబ్ చానల్‌ను గురువారం నాంపల్లిలోని సురవరం ప్రతాప రెడ్డి ఆడిటోరియంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పి.వి.నరసింహారావు సోదరుడు పి.వి.మనోహర్‌రావు, రాజ్యసభ సభ్యులు సురేశ్ రెడ్డి, మాజీ డిజిపి హెచ్.జె.దొర, సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తి, ఆర్‌టిఐ మాజీ కమిషనర్ విజయ్‌బాబు విచ్చేశారు. ఈ సందర్భంగా పి.వి.చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది శ్రీకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

### నంబాల కేశవరావు బూటకపు ఎన్‌కౌంటర్‌పై
## సుప్రీం కోర్ట్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలి

బస్తర్ అడవుల్లో కేంద్ర పారా మిలిటరీని వెనక్కి పిలవాలి

కగార్ ఆపరేషన్ వెంటనే నిలిపివేయాలి

ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక డిమాండ్



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం రోజున మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రధాన కార్యదర్శి నంబాల కేశవ రావు బూటకపు ఎన్‌కౌంటర్‌ను నిరసిస్తూ, బూటకపు ఎన్‌కౌంటర్‌పై సుప్రీం కోర్ట్ సిట్టింగ్ జడ్జ్‌తో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాధన కుమార స్వామి మాట్లాడుతూ రాజ్యాంగంలో జీవించే హక్కు పొందుపరిచి ఉన్నప్పటికీ భారత ప్రభుత్వం, దండకారణ్యంతో పాటు చత్తీస్‌గఢ్ అడవుల్లో కేంద్ర పారా మిలిటరీ బలగాలు, డిఆర్‌జి, బలగాలు అడవిలో శోధన ఆపరేషన్ కగార్‌తో ఎన్‌కౌంటర్‌లతో అడవుల్లో జీవించే ఆదివాసిలను మావోయిస్టుల పేర ఎన్‌కౌంటర్ చేయడం జీవించే హక్కు కాలరాయడమేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వమే 2026 మార్చి నాటికి మావోయిస్టు విముక్తి భారత్ పేరుతో ఎన్‌కౌంటర్లను ప్రోత్సహిస్తూ రాజ్యాంగ ప్రజాస్వామ్య హక్కులను స్వేచ్ఛగా జీవించే హక్కును కాలరాస్తుందని, నారాయణపూర్ అడవుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు 27 మంది చనిపోవడం ఎన్‌కౌంటర్‌పై పలు అనుమానాలు వ్యక్త అవుతున్నాయని అన్నారు.

2024 జనవరి 1 నుండి ఇప్పటివరకూ 525 మందిని ఎన్‌కౌంటర్‌లతో హత్య చేయడం హేయమైన చర్య అని ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని, మావోయిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శి నంబాల కేశవరావు బూటకపు ఎన్ కౌంటర్ సుప్రీం కోర్ట్ సిట్టింగ్ జడ్జ్‌చే న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్ర కోకన్వీనర్ మార్వాడీ సుదర్శన్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ ముడిమడుగుల మల్లన్న, పౌరహక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు బొంకూరి లక్ష్మణ్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని, మావోయిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శి నంబాల కేశవరావు బూటకపు ఎన్ కౌంటర్ సుప్రీం కోర్ట్ సిట్టింగ్ జడ్జ్‌చే న్యాయవిచారణ జరిపించాలని, ఆదివాసీ ప్రాంతాల్లో సైనిక క్యాంపులను ఎత్తివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలసాని రాజయ్య, బొడ్డుపల్లి రవి, రెడ్డిరాజుల సంపత్, నారా వినోద్, పుల్ల సుచరిత, ఎరుకల రాజన్న, గుమ్మడి కొమురయ్య, ప్రధాన కార్యదర్శి, గాండ్ల మల్లేశం,రామిళ్ల బాపు, బండారి రాజలింగు, శ్రీపతి రాజగోపాల్, బండి శంకర్, మంచినీళ్ళ లింగన్నపాల్గొన్నారు.

## కార్పొరేట్ మిత్రుల కోసమే నక్సల్స్ హత్య : నారాయణ



**హైదరాబాద్ :** ఛత్తీస్‌గఢ్‌లో నక్సలైట్ల సామూహిక హత్యలను సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ తీవ్రంగా ఖండించారు. పాకిస్థాన్ ప్రేరేపిత కరడుగట్టిన ఉగ్రవాదులతో చర్చలకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని, కానీ మార్క్సిజం–లెనినిజం పట్ల నిబద్ధతతో, సామాజిక న్యాయం, సామాజిక మార్పు కోసం తమ ప్రాణాలను పణంగా పెడుతున్న నక్సలైట్లతో చర్చించడానికి సిద్ధంగా లేదని ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు. అతి తక్కువ సమయంలో నక్సలైట్ ఉద్యమాన్ని నిర్మూలిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తరచుగా చెబుతుంటారని అన్నారు. సిపిఐ నక్సలైట్‌ల ఆలోచనలకు మద్దతు ఇవ్వదని, అయితే అణచివేత ద్వారా నక్సలైట్ కార్యకర్తలను నిర్మూలించడం వల్ల నక్సలైట్ ఉద్యమాన్ని అణచివేయలేరని అన్నారు. మోదీ, అమిత్ షా నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం నక్సలైట్ల సామూహిక హత్యలపై సంతోషంగా ఉందని, ఇది వారి కార్పొరేట్ మిత్రులను సంతృప్తిపరచడానికి తప్ప మరొకటి కాదన్నారు. ఒకరు అమరుడైతే వందలాది మంది నక్సలైట్లు ఉద్భవిసారని, అందుకే నక్సలైట్లతో చర్చలు మంచి ఫలితాలను ఇస్తాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే హత్యలను నిలిపివేసి, పౌర హక్కులు, మానవ హక్కుల సంఘాల ద్వారా వారితో చర్చలు ప్రారంభించాలని సిపిఐ కోరుతోందని నారాయణ అన్నారు.

## మారుమూల గ్రామాలకు సైతం గెలుపు ఫలాలు

పల్లెల ప్రగతికి ప్రత్యేక ప్రణాళిక

పోడుపట్టాల సమస్యలపై దృష్టి

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మారుమూలగ్రామల, గిరిజన గుంపులు, తండాల మరింత అభివృద్ధి చేసిచూపెడతామని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు హామీ ఇచ్చారు. గురువారం పాల్వంచ మండల పరిధిలోని వివిధ గ్రామపంచాయతీల్లో రూ.157.5 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ పల్లెల్లో ప్రగతి కోసం ప్రత్యేక ప్రణాళికలు రచించి అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో తనపై అపారమైన నమ్మకంతో ఓటేసి గెలిపించారని, అలాంటి ప్రజలకు మౌలిక సమస్యల పరిష్కారం చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. కొత్తగూడెం నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుకుందామని, అందుకు అధికారులు, ప్రజల సహాయ సహకారాలు అవసరమన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దారా ప్రసాద్, ఎంపిడిఒ విజయ భాస్కర్‌రెడ్డి, పంచాయితీరాజ్ డిఇ రామకృష్ణ, ఎలక్ట్రికల్ ఎడిఇ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, కాంగ్రెస్ నాయకులు ఎర్రంశెట్టి ముత్తయ్య, బరపటి వాసు, సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు, పట్టణ కార్యదర్శి అడుసుమల్లి సాయిబాబా, కాంగ్రెస్ మండలాధ్యక్షులు కొండా వెంకన్న, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, గుండాల నాగరాజు, నాయకులు శ్రీనివాసరావు, వెంకన్న, వీరమోహన్, గిరి, రాంబాబు, వెంకట్రావు, జకరయ్య, శ్రీను,రంజిత్, చెన్నయ్యతో పాటు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



## రఘుపాల్ కుటుంబ సభ్యులను పరామర్శించిన చాడ వెంకటరెడ్డి

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** సిపిఐ (ఎం)సీనియర్ నాయకులు శాంతి సంఘీభావ సంఘం జాతీయ సలహా కమిటీ సభ్యులు, రాష్ట్ర అధ్యక్ష వర్గ సభ్యులు రఘుపాల్ మరణం వామపక్షా ఉద్యమాలకే కాకుండా శాంతి పోరాటాలకు కూడ తీరని లోటని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. రఘుపాల్ కుటుంబ సభ్యులను గురువారం చాడ వెంకటరెడ్డి, ఐప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్, హైదరాబాదు నగర ప్రధాన కార్యదర్శి రామరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా రఘుపాల్ చిత్రపటానికి చాడ వెంకటరెడ్డి నివాళులర్పించారు. అనంతరం రఘుపాల్ సతీమణి భారతిని పరామర్శించి ధైర్యం చెప్పారు. రఘుపాల్ సిపిఐ(ఎం)లో క్రమశిక్షణ కలిగిన నాయకుడని, శాంతి సంఘంలోను వివిధ బాధ్యతలు నిర్వహించారన్నారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వియత్నాం, చైనాలకు పర్యటించి వచ్చిన సందర్భంగా రఘుపాల్‌తో కూడిన ప్రతినిధి వర్గాన్ని కలుసుకున్నామని, ఆ సందర్భంగా వారికి సన్మానం కూడా చేయడం జరిగిందని చాడ వెంకటరెడ్డి గుర్తుచేసుకున్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ధాన్యం కొనుగోలు విషయంలో, కలెక్టర్లు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్ఒపి) ఖచ్చితంగా అనుసరించాలని, అనూహ్య వర్షాల వల్ల ధాన్యానికి నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిఎస్ ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అన్నారు. రాష్ట్రంలో సరిపడిన పరిమాణంలో డిఎపి, కాంప్లెక్సులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సిఎస్ తెలియజేశారు. నకిలీ పత్తి విత్తనాల ముప్పును అరికట్టేందుకు జిల్లా స్థాయి, మండల స్థాయి, టాస్క్ ఫోర్స్ సమావేశాలు వెంటనే నిర్వహించాలని సిఎస్ ఆదేశించారు. నకిలీ విత్తనాల విక్రయం, సరఫరాకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా ఇన్చార్జ్ మంత్రులతో కలసి మీడియా సమావేశాలు నిర్వహించి భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రభుత్వ యంత్రాంగం చేపట్టిన ముందు జాగ్రత్త చర్యల వివరాలను ప్రజలకు తెలియచేయాలని కలెక్టర్లకు సూచించారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు గురువారం జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీ వర్షపాతం కారణంగా జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రీమాన్సూన్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ధాన్యం, పత్తి కొనుగోలు, పంట నష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు, ఇతర వ్యవసాయ కార్యకలాపాలపై సమీక్షించారు. అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో అల్పపీడనం కారాణంగా రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులను రెవెన్యూ (డిజాస్టర్ మేనేజ్‌మెంట్) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ కలెక్టర్లకు వివరించారు. రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్నారు. సివిల్ సప్లైస్ ముఖ్య కార్యదర్శి డి.ఎస్.చౌహాన్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపీ, వాటర్స్ వర్క్స్ ఎండి అశోక్ రెడ్డి, అధికారులు టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

## 12 గురుకుల ఇంటర్ కళాశాలల మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని 12 సాంఘిక సంక్షేమ గురుకుల ఇంటర్ కళాశాలలను ఎత్తివేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలనిఅఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఎఐఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయం తో 11జిల్లాల్లో దాదాపు వందలాది మంది పేద విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరం అవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ప్రకటించిన ఇంటర్ ఫలితాలో జెఇఇ, ఎప్‌సెట్ ఫలితాల్లో గురుకుల ఇంటర్ విద్యార్థులు ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలతో పోటీ పడిమరి మంచి ర్యాంకులు, మార్కులు సాధించారని అలాంటప్పుడు విద్యార్థులు లేరనే సాకుతో కళాశాలలను మూసివేయడం కన్నా కళాశాలలను అభివృధి చేసి నిధులు కేటాయించి మరింత బలోపేతం చేయాలని కోరారు. తల్లిదండ్రుల ఆశనుఅసరాగా చేసుకుని ప్రైవేట్ కార్పొరేట్ జూనియర్ కళాశాలలు లక్షల రూపాయల ఫీజుల దోపిడీ చేస్తున్నాయని, వీటిని నియంత్రిచాలంటే గురుకుల కళాశాలలో సరైన వసతులు కల్పించి నాణ్యమైన ఆహార భోజనాన్ని అందిస్తే విద్యార్థుల సంఖ్య మరింత పెరుగుతుందని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా విద్యాశాఖను పర్యవేక్షిస్తున్నేపథ్యంలో ప్రభుత్వ విద్యను మరింత ప్రోత్సహించాల్సింది పోయి నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారని, ఇది సరైంది కాదన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు



**ప్రజాపక్షం/చిగురుమామిడి :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని, రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. గురువారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశానికి రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంస్థాగతంగా కాంగ్రెస్ పార్టీ గ్రామగ్రామాన పునర్వ్యవస్థీకరిస్తూ మండల సమావేశాలు జరుగుతున్నట్లు చెప్పారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజాసంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లి మరింత కష్టపడాలని, తాను అసెంబ్లీ ఎన్నికల కన్నా మరింత ఎక్కువ కష్టపడతానని చెప్పారు. ఏమైనా గ్రూపు రాజకీయాలు ఉంటే వాటిని పక్కన పెట్టి కలిసికట్టుగా అన్ని స్థానాల్లో గెలిచేలా ముందుకు వెళ్లాలని చెప్పారు. గ్రామస్థాయిలో కార్యకర్తల్లో నాయకుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపేందుకు మూడు సంవత్సరాల పైన పనిచేసిన వారికి ప్రమోషన్ వస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపిటిసి, జడ్పిటిసి అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని, అందుకు పార్టీ కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని చెప్పారు. హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, మాజీ జడ్పిటిసి గీకురు రవీందర్, ఐరెడ్డి సత్యనారాయణ రెడ్డి, డైరెక్టర్లు కుతుబుద్దీన్, కూతురు రవీందర్ రెడ్డి, బారతి దేవి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయిని వేణుగోపాల్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అందెమేకల పరశురాములు, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు మహమ్మద్ షాబుద్దీన్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు కాంతాల మహిపాల్‌రెడ్డి, మహిళా మండలి అధ్యక్షురాలు పోలు స్వప్న, నాయకులు దాసరి ప్రవీణ్ కుమార్ నేత, వంగర మల్లేశం, కాటం సంపత్ రెడ్డి, మహ్మద్ బాబు మియా, అందె సురేష్, జిల్లెల రమేష్, బోయిని నరేష్, పలు గ్రామాల గ్రామశాఖల అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఎపి సైనిక్ స్కూళ్లలో రాష్ట్ర విద్యార్థులకు 'స్థానికత' కల్పించాలి

తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు

'క్రాంతి కీన్ ఫౌండేషన్' విజ్ఞప్తి

**ప్రజాపక్షం/ ఖైరతాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో కొత్త సైనిక్ పాఠశాలలు ఏర్పడేంతవరకూ ఎపి సైనిక్ స్కూళ్లలో రాష్ట్ర విద్యార్థులకు స్థానికత కోటా కొనసాగించాలని క్రాంతి కీన్ ఫౌండేషన్ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసింది. ఎపి ప్రభుత్వ నిర్ణయంతో సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష రాసిన 20వేల మంది తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని, దీనిపై జోక్యంచేసుకొని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఫౌండేషన్ వ్యవస్థాపకులు క్రాంతి, ప్రధానకార్యదర్శి లావణ్య, కార్యదర్శి కల్యాణి మీడియాతో మాట్లాడారు. అన్ని రాష్ట్రాల్లో సైనిక్ స్కూళ్లు ఉన్నాయని. తెలంగాణ లో ఒక్కటి కూడా లేకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా తెలంగాణలో కనీసం మూడు సైనిక్ స్కూళ్లు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రులు బండి సంజయ్‌కు, కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ఫారం-6 (ప్రాథమిక ప్రకటన)
(తెలంగాణ సవరణ చట్టం 2016లోని చాప్టర్ III ఎ లోని 10 ఎ అనుసరించి)
(చట్టంలోని సెక్షన్-11 క్రింద దీనిలో 10ఎ మినహాయింపు కలదు)
(నిబంధన 6/12 చూడుము)
తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (భూసేకరణ) శాఖ

గెజిట్ నెం. 18/2025/..... తేది: 20.05.2025
జిల్లా కలెక్టర్ యాదాద్రి భువనగిరి ఫైల్ నెం.G/2295/2025 తేది:16.05.2025
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(LA) యాదాద్రి భువనగిరి ఫైల్ నెం.A/20/2025 తేది:13.05.2025

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి ఆదేశానుసారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (యం) మండలం కూరేళ్ళ గ్రామములో విస్తీర్ణం ఎ.3.05¼ గుంటల భూమి ప్రజా ప్రయోజనార్థం బునాదిగాని కాలువ నిర్మాణములో భాగముగా దిగువ చూపిన భూమి అవసరమైయున్నదని భావించినందున సదరు భూసేకరణ ప్రకటన జారీచేయనైనది.

ప్రభుత్వము ఉత్తర్వుల నెం.108 I&CAD (LA.R&R/A2) Department Dt:31.10.2017 ద్వారా బునాదిగాని కాలువ కొరకు భూసేకరణ నష్టపరిహారం మరియు పునరుపాది కల్పన (పారదర్శకత మరియు న్యాయబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు) చట్టం– 2013 లోని చాప్టర్-II (సామాజిక ప్రభావ లెక్కింపు అధ్యయనం) మరియు చాప్టర్-III (ఆహార భద్రత పరిరక్షణ) వర్తింపు నుండి మినహాయింపు ఇవ్వనైనది.

ఇట్టి పునరావాసం మరియు పునరుపాది కల్పనకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) యాదాద్రి భువనగిరి గారిని కార్యనిర్వాహకునిగా (అడ్మినిస్ట్రేటర్)గా నియమించనైనది.

కావున, పైన తెలిపిన బునాదిగాని కాలువ నిర్మాణ నిమిత్తం యాదాద్రి భువనగిరి జిల్లా, ఆత్మకూర్ (యం) మండలం కూరేళ్ళ గ్రామములో విస్తీర్ణం ఎ.3.05¼ గుంటల భూమి యొక్క వివరములు ఈ దిగువ చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచేయనైనది.

జిల్లా: యాదాద్రి భువనగిరి మండలం: ఆత్మకూర్(యం) గ్రామం:కూరేళ్ళ

| సర్వే నెం./ భూమి స్వభావం విస్తీర్ణం(ఎ.గుం) | పట్టాదారు పేరు మరియు తండ్రి / భర్త పేరు | అనుభవదారు పేరు మరియు తండ్రి / భర్త పేరు | విస్తీర్ణం (ఎ.గుం ) | చెట్లు / కట్టడములు |
|---|---|---|---|---|
| 267 ఖుష్కి/ పట్టా 0.03 | వనం నర్సింహా తండ్రి పెరుమాళ్ళు | వనం నర్సింహా తండ్రి పెరుమాళ్ళు | 0.02 | |
| | వనం ఎల్లయ్య తండ్రి హనుమంతు | ఎరుకల నర్సింహా | 0.01 | – |
| | వనం నర్సయ్య తండ్రి ముత్తయ్య | | | |
| | వనం బాలయ్య తండ్రి హనుమంతు | | | |
| | వనం వెంకటేశ్వర్లు తండ్రి అంజయ్య | | | |
| | వనం వెంకన్న తండ్రి యాదయ్య | | | |
| | వనంధనమ్మ భర్త బాలయ్య | | | |
| | గుండా బాలాజీ తండ్రి అంజయ్య | | | |
| | వనం బాలయ్య తండ్రి నర్సయ్య | | | |
| | వనం సోమయ్య తండ్రి మల్లయ్య | | | |
| | వనం మధు తండ్రి కిష్టయ్య | | | |
| ప్రభుత్వ భూమి 0.00½ | హద్దిరాస్తా | | 0.00½ | – |
| 285 ఖుష్కి/ పట్టా 0.02¼ | పల్లె మహేశ్ గౌడ్ తండ్రి సత్యనారాయణ గౌడ్ | పల్లె మహేశ్ గౌడ్ తండ్రి సత్యనారాయణ గౌడ్ | 0.02 | – |
| | కమ్మగాని శ్రీనివాస్‌గౌడ్ తండ్రి చంద్రయ్య | కమ్మగాని శ్రీనివాస్‌గౌడ్ తండ్రి చంద్రయ్య | 0.00¼ | – |
| 286 ఖుష్కి/ పట్టా 0.11 | కమ్మగాని శ్రీనివాస్‌గౌడ్ తండ్రి చంద్రయ్య | కమ్మగాని శ్రీనివాస్‌గౌడ్ తండ్రి చంద్రయ్య | 0.09 | – |
| | సామ క్రిష్టారెడ్డి తండ్రి వీరారెడ్డి | పల్లె మహేశ్ గౌడ్ తండ్రి సత్యనారాయణగౌడ్ | 0.02 | – |
| | బండి పవన్ కుమార్ తండ్రి యర్రయ్య | | | |
| 288 ఖుష్కి/ పట్టా 0.01 | శాబొద్దీన్ తండ్రి అల్లిపాల్ | ఉప్పలయ్య | 0.01 | – |
| | ఎండి. షాజహాన్ తండ్రి శాబొద్దీన్ | | | – |
| | పూస బాలకృష్ణ తండ్రి సత్తయ్య | | | – |
| 289 ఖుష్కి/ పట్టా 0.25¼ | ఖయ్యూమ్ తండ్రి సైదులు | ఖయ్యూమ్ తండ్రి సైదులు | 0.25¼ | – |
| | మహమ్మద్ హబీబ్ మియా తండ్రి సైదులు మియా | మహమ్మద్ హబీబ్ మియా తండ్రి సైదులు మియా | | – |
| | ఏనుగు పద్మ భర్త జగన్‌రెడ్డి | ఏనుగు పద్మ భర్త జగన్‌రెడ్డి | | – |
| | మహమ్మద్ అబ్బాస్ తండ్రి ఖాజా మియా | మహమ్మద్ అబ్బాస్ తండ్రి ఖాజా మియా | | – |
| | మహమ్మద్ భషీర్ తండ్రి అబ్దుల్ | మహమ్మద్ భషీర్ తండ్రి అబ్దుల్ | | – |
| | మహమ్మద్ జహంగీర్ తండ్రి అబ్దుల్ | మహమ్మద్ జహంగీర్ తండ్రి అబ్దుల్ | | – |
| | మహమ్మద్ సాధిక్ తండ్రి అబ్దుల్ | మహమ్మద్ సాధిక్ తండ్రి అబ్దుల్ | | – |
| | వాకిటి అంజిరెడ్డి తండ్రి యెల్లారెడ్డి | వాకిటి అంజిరెడ్డి తండ్రి యెల్లారెడ్డి | | – |
| | జిల్లాల స్వర్ణలతా భర్త బాస్కర్ రెడ్డి | జిల్లాల స్వర్ణలతా భర్త బాస్కర్ రెడ్డి | | – |
| | ఎండి. ఖాజామియా తండ్రి అలీసాబ్ | ఎండి. ఖాజామియా తండ్రి అలీసాబ్ | | – |
| 303 ఖుష్కి/ పట్టా 0.09 | ఖయ్యూమ్ తండ్రి సైదులు | ఖయ్యూమ్ తండ్రి సైదులు | 0.09 | – |
| | మహమ్మద్ హబీబ్ మియా తండ్రి సైదులు మీయా | మహమ్మద్ హబీబ్ మియా తండ్రి సైదులు మీయా | | – |
| | రశీద్ మియా తండ్రి సైదులు | రశీద్ మియా తండ్రి సైదులు | | – |
| | ఎండి. రశీద్ మియా తండ్రి అలీసాబ్ | ఎండి. రశీద్ మియా తండ్రి అలీసాబ్ | | – |
| | ఎండి. నాసర్ మియా తండ్రి అలీసాబ్ | ఎండి. నాసర్ మియా తండ్రి అలీసాబ్ | | – |
| | మహమ్మద్ యాకూబ్‌మియా తండ్రి నర్సర్ మియా | మహమ్మద్ యాకూబ్‌మియా తండ్రి నర్సర్ మియా | | – |
| | మహమ్మద్ గాలిఫ్ తండ్రి యాకూబ్ అలీ | మహమ్మద్ గాలిఫ్ తండ్రి యాకూబ్ అలీ | | – |
| | క్రర కవిత భర్త రామక్రిష్టా రెడ్డి | క్రర కవిత భర్త రామక్రిష్టా రెడ్డి | | – |
| 304 ఖుష్కి/ పట్టా 0.04 | ముసారంతోట అనిల్ కుమార్ తండ్రి శ్రీనివాస్ | ముసారంతోట అనిల్ కుమార్ తండ్రి శ్రీనివాస్ | 0.02 | – |
| | ఎం డి. యాకూబ్ అలీ తండ్రి అలీసాబ్ & ఎండి. నజర్ మియా తండ్రి అలీసాబ్ | ఎం డి. యాకూబ్ అలీ తండ్రి అలీసాబ్ & ఎండి. నజర్ మియా తండ్రి అలీసాబ్ | 0.02 | – |
| 305 ఖుష్కి/ లావుణి పట్టా 0.07 | జినుకుల యాదమ్మ భర్త ఇస్తారి | జినుకుల మల్లేష్ | 0.07 | – |
| | మాలి గోవర్ధన్‌రెడ్డి తండ్రి రాంరెడ్డి | జినుకుల లింగయ్య తండ్రి ఇస్తారి | | |
| | మాలి నర్సిరెడ్డి తండ్రి రాంరెడ్డి | జినుకుల నర్సింహా తండ్రి ఇస్తారి | | |
| | మాలి రాములమ్మ భర్త గోపాల్ రెడ్డి | జింకల సోమయ్య తండ్రి ఎల్లయ్య | | |
| | మాలి రాజీ రెడ్డి తండ్రి వెంకట రాంరెడ్డి | బిల్లపాటి మౌనిక తండ్రి మాలి సంపత్‌రెడ్డి | | |
| | జినుకుల రామయ్య తండ్రి పుల్లయ్య | | | |
| | మాలి లింగా రెడ్డి తండ్రి రాంరెడ్డి | | | |
| | సర్రమ్‌ల ఆనంద్ ద్వారా మల్లయ్య | | | |
| | జినుకుల నర్సయ్య తండ్రి వీరయ్య | | | |
| | మాలి సుదర్శన్ రెడ్డి తండ్రి లక్ష్మా రెడ్డి | | | |
| | మాలి లింగా రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి | | | |
| | జినుకుల భారతమ్మ భర్త నర్సయ్య | | | |
| 306 ఖుష్కి/ పట్టా 0.02½ | జినుకుల సోమయ్య తండ్రి ఎల్లయ్య | జినుకుల సోమయ్య తండ్రి ఎల్లయ్య | 0.02½ | – |
| | జినుకుల అంజయ్య తండ్రి చిన్న ఎల్లయ్య | జినుకుల అంజయ్య తండ్రి చిన్న ఎల్లయ్య | | |
| | జినుకుల చిన్నలింగయ్య తండ్రి రామయ్య | జినుకుల చిన్నలింగయ్య తండ్రి రామయ్య | | |
| | జినుకుల మల్లమ్మ భర్త పెద్ద లింగయ్య | జినుకుల మల్లమ్మ భర్త పెద్ద లింగయ్య | | |
| | పబ్బతి వెంకట్‌రెడ్డి తండ్రి లింగా రెడ్డి | పబ్బతి వెంకట్‌రెడ్డి తండ్రి లింగా రెడ్డి | | |
| | జినుకుల లింగయ్య తండ్రి ఇస్తారి | జినుకుల లింగయ్య తండ్రి ఇస్తారి | | |
| | జినుకుల మల్లయ్య తండ్రి ఇస్తారి | జినుకుల మల్లయ్య తండ్రి ఇస్తారి | | |
| | జినుకుల దుర్గ భర్త మల్లయ్య | జినుకుల దుర్గ భర్త మల్లయ్య | | |
| | జినుకుల నర్సింహా తండ్రి ఇస్తారి | జినుకుల నర్సింహా తండ్రి ఇస్తారి | | |
| | కుశపాట్టి వశిష్ట కార్తికేయ తండ్రి భారతీ భూషణ్ | కుశపాట్టి వశిష్ట కార్తికేయ తండ్రి భారతీ భూషణ్ | | |
| | బాబు విక్రమాదిత్య నలకుర్తి తండ్రి పురుషోత్తమ | బాబు విక్రమాదిత్య నలకుర్తి తండ్రి పురుషోత్తమ | | |
| 309 ఖుష్కి/ పట్టా 0.17 | మహేశుని నరేశ్ తండ్రి సత్తయ్య | మహేశుని నరేశ్ తండ్రి సత్తయ్య | 0.17 | టేకు చెట్లు |
| | పేసరు శివ కుమార్ రెడ్డి తండ్రి శంకర్ రెడ్డి | యెంపాల బుచ్చిరెడ్డి తండ్రి సత్తిరెడ్డి | | |
| | గోమారి కల్పన భర్త పట్టాభి సీతారాంరెడ్డి | | | |
| | పెండ్యాల సునీత రెడ్డి తండ్రి ఆనంద్ రెడ్డి | గూడూరు బాల్‌రెడ్డి తండ్రి మంకారెడ్డి | | |
| | గూడూరు బాల్‌రెడ్డి మంకారెడ్డి | | | |
| 308 ఖుష్కి/ పట్టా 0.04 | దేవరపల్లి శేఖర్ రెడ్డి తండ్రి మల్లా రెడ్డి | మహేశుని నరేశ్ తండ్రి సత్తయ్య | 0.04 | రేకుల షెడ్ ఇల్లు (1) |
| | మహేశుని నరేశ్ తండ్రి సత్తయ్య | | | |
| | గోమారి కల్పన భర్త పట్టాభి సీతారాంరెడ్డి | యెంపాల బుచ్చిరెడ్డి తండ్రి సత్తిరెడ్డి | | |
| | గూడూరు బాల్ రెడ్డి తండ్రి మంకా రెడ్డి | | | – |
| | వంగేటి సవిత భర్త భాస్కర్‌రెడ్డి | గూడూరు బాల్‌రెడ్డి తండ్రి మంకారెడ్డి | | |
| | బోయపల్లి తిరుమాలత భర్త సత్తి రెడ్డి | | | |
| | దేవరపల్లి శ్రావణి భర్త శేఖర్‌రెడ్డి | | | |
| 311 ఖుష్కి/ పట్టా 0.23 | మహేశుని నరేశ్ తండ్రి సత్తయ్య | మహేశుని నరేశ్ తండ్రి సత్తయ్య | 0.23 | మామిడి చెట్లు |
| | యెంపాల బుచ్చిరెడ్డి తండ్రి సత్తిరెడ్డి | యెంపాల బుచ్చిరెడ్డి తండ్రి సత్తిరెడ్డి | | |
| | గూడూరు బాల్ రెడ్డి తండ్రి మంకారెడ్డి | గూడూరు బాల్ రెడ్డి తండ్రి మంకారెడ్డి | | |
| 315 ఖుష్కి/ పట్టా 0.11 | ఉడుతల జయరాములు తండ్రి రామయ్య | మహేశుని నరేశ్ తండ్రి సత్తయ్య | 0.03 | – |
| | ఉడుతల స్వామి తండ్రి రామయ్య | యెంపాల బుచ్చిరెడ్డి తండ్రి సత్తిరెడ్డి | | |
| | ఉడుతల సిద్ధిరాములు తండ్రి రామయ్య | గూడూరు బాల్ రెడ్డి తండ్రి మంకారెడ్డి | | |
| | దేవరపల్లి శేఖర్ రెడ్డి తండ్రి మల్లా రెడ్డి | వాంగేటి భాస్కరెడ్డి తండ్రి వాంగేటి సత్తిరెడ్డి | 0.08 | – |
| | బెజ్జంకి ప్రతాప్ రెడ్డి తండ్రి ఎల్లారెడ్డి | | | |
| | వంగేటి సవితా భర్త భాస్కర్‌రెడ్డి | | | |
| | బోయపల్లి తిరుమాలత తండ్రి సత్తిరెడ్డి | | | |
| 314 ఖుష్కి/ పట్టా 0.03 | రొండ్ల నర్సిరెడ్డి తండ్రి రాంరెడ్డి | పైళ్ళ జ్యోతి భర్త రవీందర్‌రెడ్డి | 0.03 | – |
| 318 ఖుష్కి/ పట్టా 0.01 | రొండ్ల నర్సిరెడ్డి తండ్రి రాంరెడ్డి | పైళ్ళ జ్యోతి భర్త రవీందర్‌రెడ్డి | 0.01 | – |
| | దేవరపల్లి శ్రీధర్‌రెడ్డి తండ్రి శంకర్‌రెడ్డి | | | |
| | దేవరపల్లి మహేందర్‌రెడ్డి తండ్రి శంకర్‌రెడ్డి | | | |
| | దేవరపల్లి శ్రీనివాస్‌రెడ్డి తండ్రి శంకర్‌రెడ్డి | | | |
| | గోమతి కల్పన భర్త పట్టాభి సీతారాంరెడ్డి | | | |
| | | మొత్తం: | 3.05¼ | |

భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్ట పరిహారాన్నిపొందే హక్కు ( తెలంగాణ సవరణ) చట్టం, 2016 (చట్టం 21/2017) ద్వారా సవరించబడిన భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్ట పరిహారాన్ని పొందే హక్కు 2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11 (1) యొక్క నిబంధనలను అనుసరించి సంబధిత వ్యక్తులు అందరికీ తెలియజేయుటకుగాను ఈ ప్రకటన జారీ చేయడమైనది.

భూమి యొక్క ప్లాన్, ఏదైనా పని దినము మరియు పని వేళలలో జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), ఆర్ అండ్ ఆర్, విభాగము–2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా వారి కార్యాలయములో తనిఖీ చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారు, ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), విభాగము–2, యాదాద్రి భువనగిరి జిల్లా గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించిన సెక్షన్ 12 ప్రకారం పై తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇతర పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి అనుమతి లేకుండా ఇట్టి ప్రకటన జారీచేసిన తేదీ నుండి నోటిఫికేషనులో ప్రకటించిన భూములకు సంబంధించి ఎవరూ ఎటువంటి లావాదేవీలు/తాకట్లు మొదలగు చర్యలు చేపట్టరాదు.

సదరు చట్టంలోని సెక్షన్ (15)అనుసరించి ప్రతిపాదిత భూసేకరణపై ఏవైనా అభ్యంతరాలుగానీ, ఆక్షేపణలుగానీ ఉన్నట్లయితే సేకరణలో ఉన్న భూమితో ఎలాంటి సంబంధం ఉన్న వ్యక్తులైనా, పరిహారం నిర్ణయం కొరకు జరిపే సంప్రదింపుల వల్ల ప్రభావితులయ్యే వారెవరైనా ఇట్టి ప్రకటన జారీచేసిన తేదీ నుండి 60 (అరవై) దినములలోపు జిల్లా కలెక్టరు/అధీకృత అధికారి గారికి వారి అభ్యంతరములు వ్రాత పూర్వకంగా తెలియజేయవచ్చును.

సం/- ప్రత్యేక ఉప కలెక్టరు(భూ.సే.) ఆర్ అండ్ ఆర్, విభాగము–2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా
సం/- అదనపు కలెక్టర్ యాదాద్రి భువనగిరి
సం/- జిల్లా కలెక్టర్ యాదాద్రి భువనగిరి

DIPR RO NO.138/LA/PP/Advt/Pub/2025-26



గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
గాజుల రామారం సర్కిల్-26
NIT No. & Date:05/DB/EE/GJRM/Circle–26/KPZ/GHMC/2025–26, తేదీ. 21.05.2025; పని పేరు: తుఫాను నీటి కాలువ నిర్మాణం, అంచనా మొత్తం: (రూ. లక్షల్లో) 30. ప్రారంభ తేదీ & సమయం: 22.05.2025 మధ్యాహ్నం 3 గంటలు, బిడ్ రసీదులకు చివరి తేదీ మరియు సమయం: 30.05.2025 మధ్యాహ్నం 3.30 గంటలు, ఇఇ పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గాజుల రామారం, సర్కిల్– 26, జిహెచ్ఎంసి: 9849906776; మరిన్ని వివరాలను e-procurement @www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
Sd/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గాజులరామారం సర్కిల్, జిహెచ్ఎంసి
DIPR R.O.No: 2312-PP/CL/ADVT/1/2025-26 Date: 22-05-2025



ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం
సర్కిల్ నెం.17, కె.జెడ్. జిహెచ్ఎంసి, ఖైరతాబాద్, హైదరాబాద్
ఈ– ప్రొక్యూర్మెంట్ నోటీసు నం. 08./EE/సర్కిల్–17/KZ/GHMC/2025–26, తేదీ: 22.05.2025
Nit No: 08/EE/Circle–17/KZ/GHMC/2025.26, పని పేరు : సివిల్ వర్క్స్ (03. నం.), అంచనా మొత్తం : రూ.74.00 లక్షలు; ప్రారంభ తేదీ/డౌన్లోడ్ ముగింపు తేదీ మరియు సమయం: వరుస నం. 01 నుండి 03, 23.05.2025 వరకు పనుల కోసం @ మధ్యాహ్నం 4.40 గం.ల నుండి 26.05.2025 వరకు మధ్యాహ్నం 4.40 గం.ల వరకు మాత్రమే; అధికారి పేరు మరియు చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్–17, జిహెచ్ఎంసి. మరిన్ని వివరాలను ఈ–ప్రొక్యూర్‌మెంట్ @https://www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు. ఈ. మెయిల్ చిరునామా: eec17.ghmc@gmail.com మొబైల్ నంబర్: 7337557246.
Sd/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్ –17, కె.జెడ్. జిహెచ్ఎంసి,
DIPR R.O.No: 2343-PP/CL/ADVT/1/2025-26 Date: 22-05-2025



దేవాదాయ–ధర్మాదాయ శాఖ
శ్రీ కనకదుర్గ దేవస్థానం [పెద్దమ్మగుడి]
కేశవాపురం – జగన్నాథపురం గ్రామము : పాల్వంచ మండలం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.
Rc.No.SKDD/34/2024 సీల్డ్ టెండర్ – కం – బహిరంగ వేలం ప్రకటన–2 తేది : 22–05–2025
తేదీ : 02.06.2025 సోమవారం రోజున ఉ.11.00గంటల నుండి దేవస్థాన ఆవరణ యందు సీల్డ్ టెండర్–కం–బహిరంగ వేలములు ఒక్కొక్కదానికి వేరువేరుగా నిర్వహించబడును. దేవస్థానమునకు బకాయి ఉన్నవారు మరియు కోర్టు కేసులు ఉన్నవారు వేలంపాటలో పాల్గొనుటకు అనర్హులు. వేలంపాటలో హిందువులు మాత్రమే పాల్గొనవలెను. పూర్తి వివరములకు దేవస్థాన కార్యాలయమునందు సంప్రదించగలరు. పెద్యాలు వివరములు (క్ర.సం.1): ఎ సి ఫంక్షన్ హాల్–1, డిపాజిట్ రూ.5,00,000/– లు, ఏసి ఫంక్షన్ హాల్–2, డిపాజిట్ రూ.5,00,000/–లు, (క్ర.సం.2) : కొత్త కాంప్లెక్స్‌లోని షాపు నెం.1,2,4, డిపాజిట్ రూ.50,000/– లు (ఒక్కంటికి), (క్ర. సం.1,2 కు): పాట కాలపరిమితి : స్వాధీనం చేసిన నాటి నుండి 3 సంవత్సరములు. (క్ర.సం.3): పాత కాంప్లెక్స్‌లోని షాపు నెం.2,4, షాపు నెం.2కు డిపాజిట్ రూ.1,00,000/– లు, షాపు నెం.4కు డిపాజిట్ రూ.50,000/– లు. (క్ర.సం.4) : తలనీలాలు ప్రోగుచేసుకొను హక్కు (క్ర. సం. 5 : చీరలు ప్రోగుచేసుకొను హక్కుకు క్ర.సం.4,5 కి డిపాజిట్ రూ.2,00,000/–లు (ఒక్కంటికి). (క్ర.సం.6) : దేవాలయ ప్రాంగణంలో పూలు, పూలదండలు అమ్ముకొను హక్కు (క్ర.సం.7) : దేవాలయ ప్రాంగణంలో ఫోటోలు తీసుకొను హక్కు క్ర. సం. 6,7కి డిపాజిట్ రూ.20,000/–లు (ఒక్కంటికి), (క్ర.సం.3,4,5,6,7) : పాట కాలపరిమితి ; స్వాధీనం చేసిన నాటి నుండి 11నెలలు. (క్ర.సం.8) : పాత షాపు నెం.1లోని బిల్లలు, బొమ్మలు etc.. అమ్మకం, (క్ర.సం.9) : దేవస్థానం తరపున ప్రోగుచేసిన చీరల అమ్మకం (క్ర.సం.8,9) డిపాజిట్ రూ.20,000/– లు.
Sd/- కార్యనిర్వహణాధికారి
DIPR R.O.No: 2291-PP/CL/ADVT/1/2025-26 Date: 22-05-2025

తెలుగు జాతీయ దినపత్రిక
ప్రజాపక్షం
PRAJAPAKSHAM
శుక్రవారం, మే 23

# సముచిత హెచ్చరిక

అఖిల భారత సర్వీసు అధికారుల ప్రవర్తనకు సంబంధించి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గట్టి హెచ్చరికనే జారీ చేసింది. సామూహిక సభలు, సమావేశాలలో తమ హోదాకు తగని విధంగా ఐఎఎస్, ఐపిఎస్, ఇతర కేంద్ర ప్రభుత్వ సర్వీసుల అధికారుల ప్రవర్తించడం, హావభావాలు ప్రదర్శించడం మర్యాద కాదని తెలిపింది. ఇకపై అలా చేసినట్లయితే చర్యలు తప్పవని ఒకింత కటువుగానే సర్వీసు నిబంధనలను ఉటంకిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఛీఫ్ సెక్రెటరీ రామకృష్ణారావు సర్క్యులర్ జారీ చేశారు. గిరిజన శాఖ ముఖ్య కార్యదర్శి శరత్ తీరు ఇటీవల వార్తల్లోకి ఎక్కింది. నాగర్ కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలం మాచారంలో జరిగిన ఇందిర సౌర గిరి జలవికాసం పథక ప్రారంభోత్సవ సభలో ఆయన ఒంగి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి కాలు మొక్కబోయారు. దీనిని గమనించిన సిఎం వెంటనే పక్కకు జరిగి శరత్‌ను వారించిన దృశ్యాలు మాధ్యమాలలో వైరలయ్యాయి. అంతకుముందు సీనియర్ ఐఎఎస్ అధికారి స్మితా సభర్వాల్ సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేసిన సందేశాలు దుమారాన్నే రేపాయి. గత ప్రభుత్వ ముఖ్యమంత్రి కార్యాలయంలో సుదీర్ఘకాలం పాటు పని చేసిన ఆ ఉన్నతాధికారిణి, వర్తమాన ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టే విధంగా దివ్యాంగులు, కంచె గచ్చిబౌలి భూముల గురించి తన 'ఎక్స్' ఖాతాలో అభిప్రాయాలను వెలిబుచ్చడం విదితమే. కంచె గచ్చిబౌలికి సంబంధించి 'ఎక్స్'లో చేసిన పోస్ట్‌పై పోలీసుల నోటీసు రావడంతో వివరణ ఇచ్చేందుకు వెళ్ళి, తాను షేర్ చేసిన పోస్టును రీషేర్ చేసిన 2వేల మందికి కూడా ఇలాగే నోటీసులు ఇస్తారా? అని అడగడంతో ప్రభుత్వానికి సవాలు ఎదురైంది. కొద్ది రోజులకే ఆమెను హైదరాబాద్ ఆతిథ్యమిస్తున్న 'మిస్ వరల్డ్' పోటీల ఏర్పాట్ల బాధ్యత నుంచి తప్పించింది రాష్ట్ర ప్రభుత్వం. ఇంతలోనే శరత్ వ్యవహారం తెరపైకి రావడంతో, గతంలో తలెత్తిన అంశాలను సైతం దృష్టిలో పెట్టుకొనే సిఎస్ అఖిల భారత సర్వీసుల అధికారులు సర్క్యులర్ జారీ చేయాల్సి వచ్చింది.అఖిల భారత సేవల ప్రవర్తనా నియమావళి,1968లోని 3(1) నిబంధనను ఉటంకిస్తూ సర్వీసులో ఉన్న అధికారి తగని పనులు ఎట్టి పరిస్థితులలో చేయకూడదని నిర్దేశించారు.

అధికారంలో ఉన్న వారిని ప్రభువులుగా భావించి, తమ హోదాను మరిచి ఉన్నతాధికారులు భక్తి ప్రపత్తులు చాటుకోవడం కొత్తేమి కాదు. గత ప్రభుత్వ కాలంలో నాటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావుకు పలువురు అధికారులు కాళ్ళు మొక్కారు. సిద్ధిపేట జిల్లా సమీకృత కలెక్టరేట్ భవన ప్రారంభోత్సవం సందర్భంగా కెసిఆర్‌కు నాటి కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి కాళ్ళకు వందనం చేశారు. తాజాగా వార్తల్లోకెక్కిన శరత్ అప్పట్లో కూడా కామారెడ్డి కలెక్టరేట్ కార్యాలయ ప్రారంభోత్సవంలో కెసిఆర్‌కు పాదాభివందనం చేయడాన్ని ప్రజలు మరిచిపోలేదు. కొవిడ్ సమయంలో ప్రజారోగ్యం, కుటుంబసంక్షేమ డైరెక్టర్‌గా వ్యవహరించిన డాక్టర్ జి.శ్రీనివాసరావు సైతం కాళ్ళు మొక్కిన అధికారుల జాబితాలోకి చేరారు. ఈ చర్యలు రాష్ట్రంలో సంచలనాన్ని రేపాయి. అధికారుల చర్యలను బిఆర్‌ఎస్ నాయకులు సమర్థించారు కూడా. నాడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు రేవంత్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, జీవన్ రెడ్డి తదితరులు తీవ్రంగా ఆక్షేపించారు. అంతే కాకుండా అధికారుల తీరుపై డిఒపిటికి సైతం ఫిర్యాదు చేసింది కాంగ్రెస్. అదే కన్‌ఫర్డ్ ఐఎఎస్ అధికారి వెంకట్రామ్‌రెడ్డిని ఎంఎల్‌సి చేసి పెద్దలసభకు పంపింది బిఆర్‌ఎస్.

ఎంతో కష్టించి, తపస్సులా చదవి, లక్షలాది మందిని దాటుకొని ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ తదితర ఉన్నత అఖిల భారత సర్వీసులకు ఎంపిక అవుతుంటారు. అలాగే రాష్ట్ర సర్వీసులలో గ్రూప్ 1 అధికారులు కూడా లక్షలమందితో పోటీపడి ఎంపికై, ప్రతిభ, సర్వీసుల ఆధారంగా కన్‌ఫర్డ్ ఐఎఎస్‌గా పదోన్నతి పొందుతారు. ప్రధానమంత్రులు, ముఖ్యమంత్రులు, మంత్రులు ఐదేళ్ళకొకసారి ప్రజల మెప్పు పొందితేనే అధికారం. కానీ, ఉన్నతాధికారులు మూడు, మూడున్నర దశాబ్దాలు కార్యనిర్వాహక వర్గంలో కొనసాగుతారు. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా ప్రజా ప్రతినిధులకు మార్గదర్శనం చేయడమే పరమావధి కావాలే తప్ప, తలవొంచాల్సిన పరిస్థితికి దిగజారొద్దు. అలా నిటారుగా నిలిచిన ఐఎఎస్ అధికారులలో అగ్రగణ్యుడు ఎస్.ఆర్.శంకరన్‌ను సమాజం ఇప్పటికీ స్మరించుకుంటూనే ఉంది. రాజకీయ ఒత్తిళ్ళకు తలొగ్గినా, ఊడిగం చేసినా, అవినీతిలో భాగస్వాములైనా ఏ గతి పడుతుందో ఇప్పటికే పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో పలువురు సీనియర్ అధికారులు జైళ్ళు, కోర్టుల చుట్టూ తిరుగుతుండడాన్ని చూస్తూనే ఉన్నాం. ఏదేమైనప్పటికీ సర్వీసులో చేరే సమయంలోని పాఠాలను సర్క్యులర్ రూపంలో రాష్ట్ర ప్రభుత్వం మరోమారు గుర్తు చేయడం సముచితమైనదే.

# జర్నలిస్టులను వేధిస్తున్న ప్రభుత్వ యంత్రాంగం



కృష్ణ ఝా

ఇటీవల ఒక నివేదికలో భారతదేశంలోని 28 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 427 మంది జర్నలిస్టులపై 423 క్రిమినల్ కేసులు నమోదైనట్లు వెల్లడైంది. 2012–2022 మధ్యకాలంలో నమోదైన 423 కేసులకు సంబంధించి సమగ్ర వివరాలు, విశ్లేషణ కూడా అందులో పేర్కొనబడింది. జర్నలిస్టులపై ఎక్కువగా ప్రయోగించిన నేరాలను పరిశీలించినట్లయితే, ఆ కేసులకు దారితీసిన వార్తలు, క్రిమినల్ న్యాయ వ్యవస్థతో జర్నలిస్టుల అనుభవాలను ఇది వెలుగులోకి తీసుకువస్తుంది. ఢిల్లీలోని నేషనల్ లా యూనివర్శిటీ, క్లూనీ ఫౌండేషన్ ఫర్ జస్టిస్‌కు చెందిన ట్రయల్ వాచ్ ఇనిషియేటివ్, కొలంబియా లా స్కూల్లోని హ్యూమన్ రైట్స్ ఇన్స్టిట్యూట్ సహకారంతో ఈ అధ్యయనం నిర్వహించబడింది.

మన దేశ రాజ్యాంగం మీడియా స్వేచ్ఛకు హామీ ఇస్తుంది. ప్రతీకారం తీర్చుకుంటారనే భయం లేకుండా జర్నలిస్టులు తమ పనిని చేసుకోగలిగే ప్రాముఖ్యతను సుప్రీంకోర్టు నొక్కి చెప్పింది. రక్షణలు ఉన్నప్పటికీ, జర్నలిస్టులు సర్వదా క్రిమినల్ చట్టాల ముప్పును ఎదుర్కొంటూనే ఉన్నారు. ప్రభుత్వ అధికారులపై వార్తలు రాసినందుకు అభియోగాలను ఎదుర్కోవలసి వస్తుంది. ఇలా రాయడం జర్నలిస్టుల ముఖ్య విధి. అధికార యంత్రాంగంలో నిజాయితీ లేకపోతే ఏ దేశం ముందుకు నడవదు. ఇది తరచుగా లోపిస్తున్నది. ఇలాంటి సమయంలో రిపోర్టర్‌లు తమ పాత్రను నిర్వర్తించాల్సి వస్తుంది. వారిని ఎదుర్కొనేందుకు స్వయంగా ప్రభుత్వ యంత్రాంగమే ఎన్నడూ సిద్ధంగా ఉండదు. కాబట్టి ఇది రిపోర్టర్‌లకు సవాలుగా మారింది. ఈ దిశగా ఏ చొరవ చేసినా జర్నలిస్టుల విధులకు, వారి జీవితాలకు, అలాగే సాధారణంగా భావప్రకటనా స్వేచ్ఛకు, ప్రత్యేకించి పత్రికా స్వేచ్ఛకు వినాశకరంగా పరిణమించింది.

ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా 48 మంది జర్నలిస్టులను ఇంటర్వ్యూ చేశారు. ఇది విస్తృత డేటాలోని

**అధ్యయనంకోసం ఎంపిక చేసిన జర్నలిస్టులలో కనీసం నలభైశాతం మంది జైళ్లలో ఉన్నారు. చిన్న నగరాలు, మారుమూల పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారు, నిజంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇందులో స్థానిక ప్రచురణల కోసం, హిందీ లేదా ఇతర స్థానిక భాషలలో రిపోర్టింగ్ చేసేవారు కూడా ఉన్నారు. కానీ, వారి కేసులపై జాతీయ లేదా అంతర్జాతీయ మీడియా పెద్దగా దృష్టి సారించలేదు.**

వివిధ వర్గాల జర్నలిస్టులను ప్రతిబింబిస్తుంది. ఈ ఇంటర్వ్యూల ఆధారంగా, ఈ నివేదిక వారి జీవితాల పై, వారి కుటుంబాలపై, వృత్తిపై అనివార్యమైన పరిణామాలను, ప్రభావాన్ని పరిశీలిస్తుంది.

ఈ సమాచారం ద్వారా వాస్తవాలను ప్రతిబింబించే సంకేతాలనిస్తోంది. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న భయానక పరిస్థితుల గురించి ఎక్కువగా తెలియజేస్తుంది. అధ్యయనంకోసం ఎంపిక చేసిన జర్నలిస్టులలో కనీసం నలభైశాతం మంది జైళ్లలో ఉన్నారు. చిన్న నగరాలు, మారుమూల పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారు, నిజంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇందులో స్థానిక ప్రచురణల కోసం, హిందీ లేదా ఇతర స్థానిక భాషలలో రిపోర్టింగ్ చేసేవారు కూడా ఉన్నారు. కానీ, వారి కేసులపై జాతీయ లేదా అంతర్జాతీయ మీడియా పెద్దగా దృష్టి సారించలేదు. సాధారణంగా ఆరోపణలు ఎదుర్కొన్న నేరాలలో చాలావరకు ఐదు సంవత్సరాల కంటే తక్కువ జైలు శిక్ష విధించబడే అవకాశం ఉన్నప్పటికీ, ఈ చట్టాల పదజాలం చాలా అస్పష్టంగా, విస్తృతంగా ఉన్నాయి. దీంతో వాటిని ప్రెస్‌కు వ్యతిరేకంగా సులువుగా అన్వయించబడుతూ, క్రిమినల్ న్యాయ వ్యవస్థలో చిక్కుకున్న జర్నలిస్టులను ఇబ్బందికి గురి చేస్తున్నాయి.

ముఖ్యంగా, నివేదికలోని డేటాలో దాదాపు ప్రతి కేసులో అనేక నేరాలు ఉన్నాయి. వాస్తవానికి, వాటిలోని 90 శాతం సంఘటనలలో దాదాపు ఒకటి కంటే ఎక్కువ నేరాలు ఉన్నాయి. సాధారణంగా జర్నలిస్ట్‌పై ఆరోపించిన 'నేరపూరిత' కార్యకలాపాలకు వర్తింపజేయవలసిన నేరాన్ని సంబంధిత అధికారులు జాగ్రత్తగా పరిగణించరు. కానీ వారిపై విస్తృత శ్రేణి నేరాలను మోపుతారు, తద్వారా మరింత భయంకరమైన ప్రభావాన్ని సృష్టిస్తారు. అంతేకాకుండా, జర్నలిస్టులపై ఆరోపణలు తరచుగా వారు రిపోర్టింగ్ చేసే సమయంలో వారి ప్రవర్తనకు సంబంధించినవి. ప్రసంగంలోని విషయం రిపోర్టింగ్ అలా వుంచితే 100 కంటే ఎక్కువ సంఘటనలలో చిత్రమైన వ్యూహం కనిపించింది. నిరసన కవరేజ్‌ను, అందులో పాల్గొనడం మధ్య తేడాను అధికారులు గుర్తించలేకపోయి ఉండవచ్చు అని డేటా సూచిస్తుంది.



డేటాసెట్‌లో వెలుగు చేసిన స్పష్టమైన చట్టపరమైన వేధింపులు విస్తృతంగానే కాకుండా లోతుగా కూడా ఉన్నాయి. క్రిమినల్ చర్యను ఎదుర్కొన్న 427 మంది జర్నలిస్టులలో, 60 మందిపై ఒకటి కంటే ఎక్కువ కేసులు నమోదు కాగా, 36 మంది జర్నలిస్టులు ఒకే సంఘటనలో అనేక కేసులను ఎదుర్కొన్నారు.

కేసు ప్రారంభం కావటంలోనే చాలా ఆలస్యం చోటు చేసుకుంటున్నట్లు నివేదిక పేర్కొంది. ఇది కేసులోని ప్రతి దశలో జరుగుతుంది. దీని ఫలితంగా భారతదేశంలోని జర్నలిస్టులకు కేసు 'ప్రక్రియనే శిక్ష'గా మారింది. కేసు స్థితిపై డేటా సేకరించబడిన 244 కేసులలో, 2023 అక్టోబర్ 30 నాటికి 65 శాతం కంటే ఎక్కువ కేసులు పూర్తి కాలేదు; వాస్తవానికి, ఈ కేసులలో 40 శాతం కేసులలో పోలీసులు తమ దర్యాప్తును కూడా పూర్తి చేయలేదు. కేవలం 16 కేసులు (6శాతం) మాత్రమే విచారణ పూర్తయ్యాయి. అవి శిక్ష లేదా నిర్దోషిగా విడుదలవ్వడంతో ముగిశాయి.

**క్రిమినల్ చర్యను ఎదుర్కొన్న 427 మంది జర్నలిస్టులలో, 60 మందిపై ఒకటి కంటే ఎక్కువ కేసులు నమోదు కాగా, 36 మంది జర్నలిస్టులు ఒకే సంఘటనలో అనేక కేసులను ఎదుర్కొన్నారు. కేసు ప్రారంభం కావటంలోనే చాలా ఆలస్యం చోటు చేసుకుంటున్నట్లు నివేదిక పేర్కొంది. ఇది కేసులోని ప్రతి దశలో జరుగుతుంది. దీని ఫలితంగా భారతదేశంలోని జర్నలిస్టులకు కేసు 'ప్రక్రియనే శిక్ష'గా మారింది.**

అయినప్పటికీ, కేసు నమోదు చేసిన కారణంగా జర్నలిస్టులు, వారి సన్నిహితులపై తీవ్ర ప్రభావాలు పడ్డాయి. అరెస్టు అయ్యే అవకాశం, పోలీసుల లేదా రాజకీయ నాయకుల బెదిరింపులు, అలాగే సామాజిక అపకీర్తి. జర్నలిస్టులు ఉద్యోగ అవకాశాలను కోల్పోయినట్లు, తమ చుట్టూ ఉన్నవారిచే ట్రోల్ చేయబడినట్లు, వెలివేయబడినట్లు నివేదికలో పేర్కొన్నారు. ఒక జర్నలిస్ట్ మాట్లాడుతూ, 'నా కుమార్తె పాఠశాలలో తీవ్రమైన వేధింపులను ఎదుర్కొంది. దాదాపు 2 సంవత్సరాలు వారు ఆమెను ఎగతాళి చేసి అవమానించేవారు.' అని చెప్పారు.

భారతదేశంలో జర్నలిస్టులపై కేసులు ఎప్పుడూ ఒకే విధంగా ఉండవు. ఉదాహరణకు పరువు నష్టం ఆరోపణలు. ఇవి ప్రభుత్వ అధికారులచే కాకుండా ప్రైవేటుగా విచారించబడతాయి. పెద్ద నగరాల్లోని జర్నలిస్టులకు, పరిశోధనాత్మక జర్నలిస్టులకు వ్యతిరేకంగా ఈ దావా వేయడం సర్వసాధారణం. ప్రభుత్వ ఉద్యోగులపై నేరాలు చిన్న పట్టణాల్లో సర్వసాధారణం. జర్నలిస్టుల క్షేత్రస్థాయి వార్తల సేకరణ కార్యకలాపాలకు సంబంధించి ఇవి మోపబడతాయి.

అంతేకాకుండా, ప్రజా భద్రతకు ఆటంకం కలిగిస్తున్నారనే నేరాలు జాతీయ స్థాయి జర్నలిస్టులకు, అలాగే డిజిటల్ మీడియా లేదా సోషల్ మీడియాకు వ్యతిరేకంగా ఉపయోగించబడతాయి. బహుశా వారికి భారీ సంఖ్యలో ఉండే ప్రేక్షకుల కారణంగా, వారు చెప్పినది 'వైరల్ కావచ్చనే ఆందోళన కారణంగా.

ఈ కేసులు జర్నలిస్టులు తమ కీలకమైన పనిని కొనసాగించే సామర్థ్యంపై తీవ్ర పరిణామాలను కలిగి ఉన్నాయి. ఒక జర్నలిస్ట్ ఇలా అన్నాడు:'నా అరెస్టు తరువాత నేను లేకపోవడంతో నా కుటుంబం తీవ్రంగా కలత చెందింది. ముఖ్యంగా నా చిన్న పిల్లలు చాలా ఆందోళన చెందారు.

ఇలాంటి కేసులు వ్యక్తులను మాత్రమే లక్ష్యంగా చేసుకోవు; అవి కుటుంబాలను విడదీస్తాయి. చివరికి, అవి మిమ్మల్ని కాళ్లపై పడి ప్రాధేయపడేలా చేస్తాయి.'

# పిఎం కిసాన్ సమ్మాన్ పథకం కొందరికేనా?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా సాయం అందిస్తున్నప్పటికీ ఆరు కాలం కష్టపడి పంట పండించిన రైతులకు పెట్టుబడి, సాగుకు అయ్యే ఖర్చు, శ్రమను తీసివేస్తే మిగిలేది చాలా తక్కువ. ఉంటే అతివృష్టి లేకుంటే అనావృష్టి, నకిలీ విత్తనాలు,ఎరువులు, గిట్టు బాటు ధర లేనపుడు పండించిన పంటను నిల్వ చేసుకునే వెసలుబాటు చిన్న, సన్నకారు రైతులకు లేకపోడం, దళారీ వ్యవస్థ మొదలైన కారణాల వల్ల రైతులకు వ్యవసాయం లాభసాటిగా ఉండడం లేదు. అందుకే వారి జీవనాధారం కోసం రుణాల ఊబిలో కూరుకుపోతున్నారు. ప్రభుత్వ బ్యాంకుల నుండి మొదలుకుని ఫైనాన్స్ కంపెనీల వరకు అధిక వడ్డీలకు రుణాలు తీసుకుని సకాలంలో తీర్చలేక ఏటా వేలాది మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతే రాజు అంటూ సంక్షేమ పథకాలెన్ని తెచ్చినా క్షేత్ర స్థాయి అమలులో లోపాల వల్ల రైతులకు జరగాల్సిన న్యాయం పూర్తిగా జరగట్లేదు.

కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం 2019 నుండి దేశంలో ఉన్న రైతులకు భూ కమతం, విస్తీర్ణంతో సంబంధం లేకుండా,వ్యవసాయ అవసరాల నిమిత్తం ఏడాదికి 6000 రూపాయల్నిమూడు విడతల్లో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా ఇవ్వడం ప్రారంభించింది. అయితే 2019 జనవరి 31 వరకు భూమి పట్టాదారు పాసు పుస్తకాలున్న రైతులకు మాత్రమే ఈ సాయం అందుతోంది.2019 నుండి ఇప్పటివరకు గత ఆరు ఏండ్లుగా వ్యవసాయ భూమి అమ్మకాలు, కొనుగోళ్లు జరిగిన వారికి, వారసత్వంగా యాజమాన్య హక్కులు బదిలీ అయ్యి కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు వచ్చిన వారెవరికీ పీఎం కిసాన్ సాయం అందట్లేదు. స్థానిక వ్యవసాయ శాఖ అధికారుల్ని రైతులు సంప్రదిస్తే పీఎం కిసాన్ సమ్మాన్ వెబ్ సైట్‌లో కటాఫ్ డేట్ 2019 జనవరి వరకు మాత్రమే ఉందని చెప్తున్నారని రైతులు వాపోతున్నారు. కటాఫ్ తేది తర్వాత భూమి యాజమాన్య హక్కులు బదిలీ అయిన వారికి ఎప్పుడు అవకాశం ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొని ఉంది.

తెలంగాణలో దాదాపు 90% ఉపాంత, చిన్న కమతాలున్న ఐదు ఎకరాల లోపు రైతులున్నారు. రాష్ట్ర సగటు భూ కమతం 0.89 హెక్టార్లు మాత్రమే అంటే దాదాపు రెండు ఎకరాలు..తెలంగాణలో 70 లక్షల మంది రైతులున్నారు, వీరిలో ఐదు ఎకరాల లోపు ఉన్న చిన్న,సన్నకారు రైతులు 63 లక్షల మంది ఉన్నారు. కుటుంబాన్ని యూనిట్ గా తీసుకున్నా దాదాపు 50 లక్షల మంది రైతులు లబ్ది పొందాలి. కానీ రాష్ట్రంలో పీఎం కిసాన్ సాయం అందే రైతుల సంఖ్య ఏటేటా తగ్గుతూ వస్తుంది. 2020 లో దాదాపు 36 లక్షల మంది రైతులు ఈ పథకంలో లబ్ధిదారులుగా ఉంటే 2025 నాటికి దాదాపు 31 లక్షలకు తగ్గింది. అంటే 5 లక్షల మంది రైతులకు సాయం అందకుండా పోతుంది. భూమి యాజమాన్య హక్కులు బదిలీ కావడం, కొత్తగా పట్టా పాసుపుస్తకాలు రావడం వల్ల వారికి ఈ సాయం అందట్లేదు. కటాఫ్ తేదీని పెంచుతారని పలుమార్లు వార్తలు వచ్చినా ఆరేళ్లుగా పెంచిన దాఖలాలు లేవు. రైతులందరికీ ప్రభుత్వ పథకాల అమలులో సౌలభ్యం కోసం విశిష్ట గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు ఈ మధ్యే కేంద్రం ప్రకటించింది. దీనికోసం రైతులు తమ వివరాల్ని స్థానిక వ్యవసాయ శాఖ అధికారుల సహకారంతో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. తెలంగాణలో ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాతైనా కటాఫ్ తేదీని పెంచి కొత్త రైతులకు అవకాశం కల్పించాలి. ఈ యేడాది జనవరి మొదట్లో పీఎం కిసాన్ సాయం పెంచుతున్నట్లు వార్తలు వచ్చాయి.కానీ బడ్జెట్లో దీని కోసం తగినన్ని నిధులు కేటాయించలేదు. ఏడాదికి 6000 రూపాయలు, అది మూడు విడతల్లో అంటే రైతుల అవసరాలు ఎలా తీరుతాయి?. ఇచ్చే ఈ సాయాన్ని కనీసం ఏడాదికి 12000 వరకు పెంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పథకమైన రైతు భరోసా సాయం కూడా ఇప్పటి వరకు మూడు ఎకరాల భూమి ఉన్న వారికి మాత్రమే వచ్చింది. ఇంకా లక్షలాది మంది రైతులు రైతు భరోసా కోసం ఎదురు చూస్తున్నారు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ సంక్షేమ పథకాల ద్వారా సాయం చేస్తేనే రైతులు నిశ్చింతగా వ్యవసాయం చేసుకోగలరు. పెద్ద, పెద్ద కార్పోరేట్ పారిశ్రామిక వేత్తలకు ఇచ్చే రాయితీలతో పోల్చితే రైతులకు చేసే సాయం చాలా స్వల్పం. కరోనా మహమ్మారి విలయ తాండవం చేసినపుడు, 2020–21 ఆర్థిక సంవత్సరంలో పారిశ్రామిక, సేవా రంగాల్లో తక్కువ వృద్ధిరేటు నమోదైంది. అప్పుడు భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలిచింది వ్యవసాయ రంగమే.. ఇప్పటికీ దేశ జనాభాలో సగం మంది వ్యవసాయం ద్వారా ఉపాధి పొందుతున్నారు. వీరి వల్లనే ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన మన దేశానికి సరిపడా ఆహార ధాన్యాలు అందుతున్నాయి. దీంతో పాటు బయటి దేశాలకు ఎగుమతి కూడా చేయగలుగుతున్నాం.. పంట పెట్టుబడి సాయం నుండి మొదలుకుని గిట్టుబాటు ధర వరకు ప్రభుత్వం రైతులకు అండగా ఉంటేనే మేలు జరుగుతుంది. ఎద్దు ఏడ్చిన ఎవుసం – రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదని ఒక నానుడి ఉంది, దేశానికి అన్నం పెట్టే రైతులు చేసే వ్యవసాయానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాయం చేస్తేనే దేశానికి శ్రేయోదాయకం.



డా.మంద అశోక్
ఉస్మానియా యూనివర్సిటీ
9959046599

గత తొమ్మిది సంవత్సరాలుగా యోగ డే పేరుతో మూడేళ్ల పిల్లల నుంచి మూడు కాళ్ళ ముసలి ముతక వరకు యోగా చేస్తూ సంవత్సరంలో ఒక వారం రోజుల హడావిడి చూస్తూనే ఉన్నాము. ఆంధ్రాలో జిల్లాల కలెక్టర్లు, అధికారులతో ఉదయాన్నే యోగ మ్యాట్, వాటర్ బాటిల్‌తో ఎక్కడో ఒక చోట దర్శనమిస్తున్న ఫోటోలు వార్త పత్రికలలో పుంఖాను పుంఖాలుగా వస్తున్నాయి. మరికొందరు పార్టీ కండువాలతో, పార్టీ రంగులతో కూడిన సూట్‌తో యోగ చేస్తున్నారు. యోగ చేసేది తక్కువ, ప్రచారం ఎక్కువ చేసి చూపుతున్నారు. మన దేశం కనిపెట్టిన యోగాకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతోందని సంతోషపడుతున్నారు. మనిషి చేయగలిగే అత్యుత్తమ వ్యాయామాల్లో యోగా ప్రథమ స్థానాన్ని సంపాదించుకుని ప్రపంచం మొత్తం మనవైపు చూస్తున్నదని భ్రమలు కల్పిస్తున్నారు. దేశంలో సిద్ధ సమాధి యోగ, వివేకానంద యోగ, శ్రీ శ్రీ యోగ, పతంజలి యోగ, సద్గురు యోగ, రాందేవ్ బాబా యోగ, ఆరెస్సెస్ యోగ, కరసేవకుల యోగ, ఇలా చెప్పుకుంటూ పోతే కొన్ని వేల రకాల యోగాలు దేశంలో వెలిశాయి. యోగా నేర్చుకోవాలనుకునే వారికి కొన్ని నిర్దిష్టమైన మార్గదర్శకాలు ఉండాలని గురూజీలు సెలవిస్తున్నారు. యోగ అసలు అర్థం ఐక్యత, ఆధునిక శాస్త్రం, ఈ మొత్తం ఉనికి ఒకే శక్తి అని రుజువు చేస్తోంది. కానీ మీరు దాన్ని ఆ విధంగా అనుభూతి చెందడం లేదు. మీరు ఒక ప్రత్యేక జీవి అన్న ఈ భ్రమని మీరు ఛేదిస్తూ, ఇంకా ఉనికి యొక్క ఏకత్వాన్ని అనుభూతి చెందితే, అదే యోగ. తొంభయ్ సంవత్సరాల క్రిందట జాతి పిత మహాత్మా గాంధీ ఆరోగ్యం, ఆహారం, వ్యాయామం, ధ్యానం పై ఒక నిర్దిష్టమైన అవగాహనతో ముందుకెళ్లారు. 'అందరూ విలువను బంగారంలో,

## గాంధీ ఆరోగ్య జీవన విధానం ఉత్తమోత్తమం

వెండిలోనూ వెతుక్కుంటారు. కానీ అసలైన విలువ అనేది మన ఆరోగ్యం లోనే ఉంటుంది. అందుకే ఆరోగ్యమే మహాభాగ్యం' అని అంటారాయన. ఆధునిక కాలం లో అనేక విపరీతాలకు ఆలవాలమైన మన జీవనశైలి సరైన పంథాలో వెళ్లాలంటే ఆ మహనీయుని మాటలు మనకు ఆచరణయోగ్యం గా ఉండాలి. ఈ రోజు మహాత్మాగాంధీ గురించి ప్రపంచమంతా తెలుసు. అహింస, సహాయ నిరాకరణోద్యమం లాంటి విషయాల్లో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, మార్టిన్ లూథ ర్ కింగ్, నెల్సన్ మండేలా, బరాక్ ఒబామా లాంటి ఎందరో మేధావులకు ప్రేరణగా నిలిచిన గాంధీ జీవితంలో ఆరోగ్య పరిరక్షణ అంటే ఏమిటి? మంచి ఆరోగ్య అలవాట్లు పెంచుకోవడమెలా? లాంటి విషయాల మీద కూడా పలు ప్రస్తావనలు ఉన్నాయి. భారత స్వాతంత్ర్య సమరం సాగుతున్న సమయంలో మహాత్మాగాంధీ అనేకసార్లు నిరాహార దీక్షను పాటించారు. దాదాపు 17 సార్లు ఉపవాసాన్ని ఒక వ్రతం గా స్వీకరించారు. అత్యధికంగా 21 రోజులు కేవలం తక్కువ మోతాదులో ద్రవాలను మాత్రమే తీసుకుని నిరాహార దీక్ష చేశారు. తన అహింస సిద్ధాంతాల్లో భాగంగా ఈ అంశం గురించి పేర్కొన్నారు. పలువురు ఆయుర్వేద వైద్య నిపుణులు కూడా సరైన విధానం ద్వారా ఉపవాసం చేస్తే ఆరోగ్యానికి మంచిది అని పేర్కొనడం జరిగింది. విపరీతమైన యాంత్రిక జీవన విధానంలో శారీరక శ్రమ తక్కువయ్యింది, మానసిక ఒత్తిడి ఎక్కువయ్యింది. మంచి ఆరోగ్య, ఆహార అలవాట్లతో పాటు శారీరక శ్రమతో కూడిన వ్యాయామం ఉంటే ఉత్తమం. కేవలం ప్రచార ఆర్భాటంకోసం చేసే ఏ కార్యక్రమం మనుగడ సాగించలేదు.

డా.ఎం.సురేష్‌బాబు

# జ్ఞానజ్యోతి డాక్టర్ జయంత్ నార్లికర్

మే 20, 2025న మన మధ్య నుంచి ఒక గొప్ప తార రాలిపోయింది. ఆయనే డాక్టర్ జయంత్ నార్లికర్ గారు. విశ్వం గురించి మనం తెలుసుకునేందుకు దారి చూపిన గొప్ప శాస్త్రవేత్త ఆయన. కేవలం శాస్త్రవేత్తలకే కాదు, సామాన్య ప్రజలకు కూడా ఆకాశంలోని రహస్యాలను ఎంతో సులభంగా అర్థమయ్యేలా చెప్పిన వ్యక్తి నార్లికర్ గారు. ఆయన ఒక పరిశోధకుడు మాత్రమే కాదు, సైన్స్‌ను అందరికీ చేరువ చేసిన గొప్ప గురువు.



**ఆయన జీవితం-ప్రశ్నల నుంచి సిద్ధాంతాల వరకు:**

1938లో డాక్టర్ నార్లికర్ పండితుల కుటుంబంలో పుట్టారు. ఆయన తండ్రి గణిత శాస్త్రవేత్త, తల్లి సంస్కృత పండితురాలు. చిన్నప్పటి నుంచే ఆయనకు చదువు మీద, ముఖ్యంగా సైన్స్ మీద చాలా ఆసక్తి ఉండేది. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో బిఎస్సీ పూర్తిచేసిన తర్వాత నార్లికర్ కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయానికి వెళ్లి, ప్రఖ్యాత ఖగోళశాస్త్రవేత్త ఫ్రెడ్ హోయిల్ శిష్యుడిగా పనిచేశారు. 1963లో పిహెచ్.డి. పూర్తి చేసి, తర్వాత 1976లో ఎస్.సి.డి. పొందా రు. హోయిల్‌తో కలిసి ఆయన అభివృద్ధి చేసిన హోయిల్‌నార్లికర్ సిద్ధాంతం గురుత్వాకర్షణను వివరిస్తూ, ఆర్మేనియన్ శాస్త్రవేత్త మాక్ సిద్ధాంతానికి ఆధారంగా ఉండే భిన్న దృక్పథాన్ని ప్రతిపాదించింది. అప్పటికి చాలా మంది ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతాన్ని నమ్మేవారు. అలాగే విశ్వం ఒక పెద్ద పేలుడు (బిగ్‌బ్యాంగ్) తో మొదలైందని భావించేవారు. కానీ నార్లికర్ గారు, హోయిల్ గారు ఈ అభిప్రాయాలకు ఒక ప్రత్యామ్నాయం గా ఈ సిద్ధాంతం ఉంది. 'స్థిర స్థితి సిద్ధాంతం (స్టేడీ స్టేట్ థియరీ)'ను ప్రవేశపెట్టారు. ఈ సిద్ధాంతం ప్రకారం విశ్వం ప్రారంభం లేదా ముగింపులేని స్థితిలో ఎప్పటికప్పుడు కొత్త పదార్థం ఏర్పడుతూ స్థిరంగా పెరుగుతూనే ఉంటుంది. కాబట్టి, అది ఎప్పుడూ ఒకేలా కనిపిస్తుందని చెప్పారు. ఉదాహరణకు ఒక గుండ్రటి బెలూన్ ను ఊదుతున్నప్పుడు అది పెద్దదవుతుంది. కానీ ఈ సిద్ధాంతం ప్రకారం బెలూన్ పెద్దదవుతున్నా దాని ఉపరితలంపై కొత్త మచ్చలు ఎప్పుడూ పుడుతూనే ఉంటాయి, కాబట్టి దూరం నుంచి చూస్తే అది ఎప్పుడూ ఒకేలా కనిపిస్తుందన్నమాట.

**భారతదేశానికి తిరిగి రాక – సైన్స్‌కు కొత్త దారి :**

కేంబ్రిడ్జ్‌లో గొప్ప పేరు తెచ్చుకున్నాక 1972 లో డాక్టర్ నార్లికర్ భారతదేశానికి తిరిగి వచ్చారు. మన దేశంలో సైన్స్ పరిశోధనలను అభివృద్ధి చేయాలనే బలమైన కోరిక ఆయనకు ఉండేది. ముంబైలోని టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌లో ఖగోళ భౌతిక శాస్త్ర విభాగాన్ని పర్యవేక్షించారు. అయితే ఆయన చేసిన గొప్ప పనులలో ముఖ్యమైనది ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్(ఐయుసిఎఎ) అనే సంస్థను పుణేలో 1988లో స్థాపించడం. ఉదాహరణకు ఒక స్కూల్‌లో సైన్స్ ల్యాబ్‌లు, మంచి టీచర్లు లేకపోతే పిల్లలు సైన్స్ నేర్చుకోలేరు కదా. అలాగే, మన దేశంలో ఖగోళ శాస్త్ర పరిశోధనలకు ఒక మంచి కేంద్రం కావాలని నార్లికర్ గారు భావించారు. ఆయన మొదటి డైరెక్టర్‌గా ఎంతో కష్టపడి ఐయుసిఎఎను నిర్మించారు. ఇప్పుడు ఇది ఖగోళ శాస్త్రం, ఖగోళ భౌతిక శాస్త్రంలో ప్రపంచ స్థాయి పరిశోధనా కేంద్రంగా ఉంది. ఎంతోమంది యువ శాస్త్రవేత్తలకు ఇది ఒక గొప్ప వేదిక. ఈ సంస్థ ఆయన దార్శనికతకు, కష్టానికి ఒక సజీవ సాక్ష్యం. ఆకాశ రహస్యాలను అందరికీ పంచిన సరళమైన మాటలు పరిశోధనలు, సంస్థల స్థాపనతో పాటు, డాక్టర్ నార్లికర్ గారు మన దేశంలో సైన్స్‌ను సామాన్య ప్రజలకు దగ్గర చేసిన వ్యక్తిగా ఎంతో పేరు పొందారు. సైన్స్ జ్ఞానం కేవలం ల్యాబ్‌లకే పరిమితం కాకూడదని ఆయన గట్టిగా నమ్మేవారు. అందుకే, ఆయన ఇంగ్లీష్‌లో, మరాఠీలో ఎన్నో పుస్తకాలు రాశారు. అవి ఖగోళ శాస్త్రం గురించి చెప్పే పాఠ్యపుస్తకాలైనా, నవలలై నా, చిన్న కథలైనా, సైన్స్ ఫిక్షన్ అయినా, చాలా సులభంగా అర్థమయ్యేలా ఉండేవి. ఉదాహరణ కు బ్లాక్ హోల్స్ అంటే ఏమిటి, విశ్వం ఎలా విస్తరిస్తోంది, గురుత్వాకర్షణ శక్తి వంటి చాలా కష్టమైన విషయాలను కూడా ఆయన ఎంతో సరళం గా వివరించేవారు. ఒక ఉదాహరణ చెప్పాలంటే, ఒక బంతిని పైకి విసిరితే కింద పడుతుంది కదా, అది గురుత్వాకర్షణ శక్తి. విశ్వంలో నక్షత్రాలు, గ్రహాలు ఎలా తిరుగుతాయో నార్లికర్ గారు ఇలాంటి సరళమైన ఉదాహరణలతో వివరించేవారు. ఆయన పుస్తకాలు చదివిన పిల్లలు, పెద్ద లు ఆకాశం వైపు ఆశ్చర్యంతో చూసేవారు. టీవీలలో కూడా ఆయన తరచుగా కనిపించి, సైన్స్ గురించి మాట్లాడేవారు. ఇలా ఆయన సైన్స్‌ను ఒక సాధారణ చర్చనీయాంశంగా మార్చారు.

**మూఢనమ్మకాలపై శాస్త్రీయ యుద్ధం:**

డాక్టర్ నార్లికర్ గారు శాస్త్రీయ ఆలోచనలను బలంగా సమర్థించేవారు. మూఢనమ్మకాలు, అశాస్త్రీయ విషయాలను ఆయన ఎప్పుడూ తీవ్రం గా ఖండించేవారు. సూర్యగ్రహణం వచ్చినప్పుడు చాలామంది అది అశుభమని, బయటకు రాకూడదని నమ్మేవారు. కానీ నార్లికర్ గారు అలాంటి మూఢనమ్మకాలను పారద్రోలడానికి, బహిరంగంగా అందరి ముందే భోజనం చేశారు. ఒక వేళ గ్రహణం వల్ల నిజంగా ఏదైనా ప్రమాదం ఉంటే, శాస్త్రవేత్తలు అందరినీ హెచ్చరిస్తారు కానీ, అనవసరంగా భయపెట్టరు కదా. సైన్స్ ఎలా ఆలోచించాలో, నిజం ఏమిటో ఆయన ఇలా ప్రజలకు చేతల్లో చూపించారు. సైన్స్‌ను ప్రజల్లో కి తీసుకెళ్లినందుకు ఆయన పరితపించే వారు. అంధవిశ్వాసాల్ని ఎదుర్కొనడంలో నార్లికర్ ముందుండేవారు. దేశ రాజ్యాంగంలోని విజ్ఞానవృత్తిని అభివృద్ధి చేయాలి అన్న నిబంధనకు జీవనుదాహరణగా నిలిచారు.

**పురస్కారాలు – గౌరవాలు:**

ఖగోళ శాస్త్రంలో అపూర్వ సేవలందించిన ప్రొఫెసర్ జయంత్ విష్ణు నార్లికర్ కు దేశీ, అంతర్జాతీయ స్థాయిల్లో ఎన్నో పురస్కారాలు, గౌరవా లు లభించాయి. 1965లో పద్మభూషణ్, 2004 లో పద్మవిభూషణ్ పురస్కారాలు అందజేయబడ్డాయి. అలాగే అంతర్జాతీయ గౌరవాలు అయిన

ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫిజిక్స్ మెంబర్‌షిప్, యునెస్కో వారిచే ప్రజలకు శాస్త్రాన్ని అర్థమయ్యే లా చేయడంలో విశిష్ట కృషికి ఇచ్చే అంతర్జాతీయ అవార్డు కలింగా పురస్కారం 1996లో వరించాయి. 2014లో సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. అలాగే ఇతర గౌరవాలలైన న్యూ యార్క్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ మెంబర్‌షిప్, భారత సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ అధ్యక్ష త్వం, భారత జాతీయ విజ్ఞాన అకాడమీ, ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, మాస్‌చుసెట్స్ టెక్నాలజీ ఇన్స్టిట్యూట్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థల నుంచి గౌరవ సభ్యత్వాలు లభించాయి.

**ఆయన ఓ స్ఫూర్తి:**

నార్లికర్ భౌతికంగా ఈ లోకాన్ని వీడినా, ఆయన ఆలోచనల ప్రభావం మాత్రం శాశ్వతం. డాక్టర్ జయంత్ నార్లికర్ సైన్స్ అంటే కేవలం సూత్రాలు, సిద్ధాంతాలు మాత్రమే కాదని నిరూపించారు. అది తెలుసుకోవాలనే ఆసక్తి, లోతుగా ఆలోచించడం, సంస్థలను నిర్మించడం అందరికీ జ్ఞానాన్ని పంచాలనే తపన అని ఆయన మనకు నేర్పారు. ఖగోళ శాస్త్రంలో ఆయన చూపిన విశ్లేషణ, తత్వంలో ఆయన నిగూఢత, సమాజానికి అందించిన విజ్ఞాన సేవలు, ఇవన్నీ భారత విజ్ఞా న పునాది రాళ్లుగా మారాయి. విశ్వం ఎంత విస్తృతమైనా, మనం ఎంత చిన్నవారైనా, ఆ విస్తృతిని అర్థం చేసుకోవాలన్న తపన మనిషిలో ఉండాలి అనే సందేశం ఆయన జీవితం ఇచ్చిన గొప్ప బోధ. ఆయన వదిలి వెళ్లిన వారసత్వం, ఆయన అధ్యయనం చేసిన నక్షత్రాల వలె, ఎప్పటికీ ప్రకాశిస్తూనే ఉంటుంది. ఆయన లేని లోటు ఉన్నా, ఆయన రగిల్చిన సైన్స్ స్ఫూర్తి మన దేశంలో ఎప్పటికీ వెలుగుతూనే ఉంటుంది.



జనక మోహన రావు దుంగ
8247045230

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## మే 28నుంచి పశ్చిమబెంగాల్ తీరప్రాంతాలలో భారీవర్షాలు

**కోల్‌కతా :** బంగళాఖాతంలో అల్పపీడనం కారణంగా పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాలలో మే 28నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని గురువారం భారత వాతావరణ శాఖ(ఐఎండి) ముందస్తు అంచనా తెలిపింది. బంగాళా ఖాతంలో తేమ వాతావరణంతో ప్రవేశించిన బలమైన ఈదురుగాలులు, ఉరుములు మెరుపుల కారణంగా పశ్చిమబెంగాల్‌లోని కొన్ని జిల్లాలలో భారీవర్షాలు కురుస్తాయని ఐఎండి వెల్లడించింది. మే 27నాటికి పశ్చిమ బంగాళాఖాతం ఆనుకుని ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, ఆ తర్వాత రాబోయే రెండు రోజులలో మరింత గుర్తించబడేలా రూపాంతరం చెందుతుందన్నారు. 'దీని ప్రభావంతో మే 28న పశ్చిమబెంగాల్ తీరప్రాంతాలలో తేలికపాటి వర్షాలు మొదలు భారీ వర్షాలు కురియవచ్చు' అని ఐఎండి తెలిపింది. ఈ ప్రాంతాలలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని వివరించింది.

# ఆపరేషన్ సిందూర్ ఆగదు

ఉగ్రవాదులను వేటాడతాం

భారత విదేశాంగ మంత్రి జైశంకర్



**న్యూఢిల్లీ :** ఉగ్రవాదులు పాకిస్తాన్‌లో ఎక్కడ ఉన్నా వేటాడే వరకూ 'ఆపరేషన్ సిందూర్' కొనసాగుతుందని, దానిని నిలిపివేసే ప్రసక్తే లేదని భారత విదేశాంగ మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. ఆమ్‌స్టర్‌డామ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, పహల్గామ్ ఉగ్రదాడి ఏప్రిల్ 22న జరిగిందని గుర్తుచేశారు. ఆ తర్వాత పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై మే 7న దాడులు చేశామని ఆయన అన్నారు. కాల్పుల విరమణ అంశాన్ని ప్రస్తావించారు. ప్రస్తుతానికి ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ అమలవుతున్నదని చెప్పారు. ఐక్యరాజ్య సమితి విడుదల చేసే ఉగ్రవాద స్థావరాలపైనే దాడులు జరిపినట్టు పునరుద్ఘాటించారు. ఉగ్రవాదానికి కొమ్ముకాస్తున్న పాకిస్తాన్ తన వైఖరి మార్చుకోవాల్సి ఉంటుందని అన్నారు. పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ మతపరమైన విద్వేషాన్ని రెచ్చగొట్టేలా ప్రకటనలు చేస్తున్నరని జైశంకర్ ఆరోపించారు. పహల్గావ్ దాడికి పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' (టిఆర్‌ఎఫ్) బాధ్యత వహిస్తున్నట్టు ప్రకటించిందని, ఈ దాడికి పాల్పడిన వారిని భారత్ ఇప్పటికే గుర్తించిందని అన్నారు. వారికి లష్కరే తయిబాతో సంబంధాలు ఉన్నాయని ప్రాథమిక సమాచారం ఉన్నట్టు పేర్కొన్నారు. భారత్, పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణకు తానే మధ్యవర్తిత్వం వహించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే చేస్తున్న ప్రకటనలు, చేసుకుంటున్న ప్రచారంపై అడిగిన ప్రశ్నకు జైశంకర్ నేరుగా సమాధానం ఇవ్వలేదు. ఈ అంశంపై అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్, విదేశాంగ మంత్రి రూబియో భారత్‌ను సంప్రదించగా నేరుగా పాకిస్థాన్ నేరుగా తమతో మాట్లాడాలని తేల్చి చెప్పామని జైశంకర్ అన్నారు. ఆ తర్వాత భారత్, పాక్‌లు డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డిజిఎంఒ)ల స్థాయిలో చర్చలు జరిపి, కాల్పుల విరమణను అమల్లోకి తెచ్చాయన్నారు. సరిహద్దుల్లో కాల్పులు, సైనిక చర్యలను ఆపే ప్రతిపాదనను పాకిస్తాన్ భారత్ ముందు ఉంచిందని అన్నారు. భారత్ అంగీకారం తెలిపిందని వివరించారు.

# జ్యోతి మల్హోత్రా నుంచి కీలక సమాచారం!



న్యూఢిల్లీ: యూట్యూమర్ జ్యోతి మల్హోత్ర నుంచి పలు అంశాలపై జాతీయ నిఘా విభాగం (ఎన్ఐఎ) అధికారులు కీలక సమాచారాన్ని రాబట్టినట్టు సమాచారం. పాకిస్తాన్ ఇంటెలిజెన్స్ అధికారులతో జ్యోతికి సంబంధాలున్నాయని ఎన్ఐఎ ఆరోపిస్తున్నది. ఇప్పటికే ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకోగా, హిసార్ జిల్లా కోర్టు ఆమె కస్టడీని పొడగించింది. అంతకు ముందు ఐదు రోజులపాటు జ్యోతిని ఎన్ఐఎ అధికారులు ప్రశ్నించారు. తనకు పాకిస్తాన్ ఇంటెలిజెన్స్ అధికారులతో సంబంధాలున్నాయని ఆమె అంగీకరించినట్టు తెలుస్తోంది. జాతీయ మీడియాలో వస్తున్న వార్తలను అనుసరించి, పహల్గావ్ ఉగ్రవాద దాడి తర్వాత, భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన సమాచారాన్ని కూడా పాకిస్తాన్‌కు ఆమె చేరవేసిందని ఎన్ఐఎ విచారణలో తేలింది. దాడి అనంతరం భారత్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకోగా, ఢిల్లీలోని పాకిస్తాన్ హైకమిషన్ సిబ్బంది ఎషాన్ ఉల్ రహీమ్ అలియాస్ డానిష్‌తో సంప్రదింపులు జరుపుతునే ఉన్నారని పోలీసులు ప్రకటించారు. జ్యోతిని తమ సంస్థ తరఫున ఒక గొప్ప ఏజెంటుగా తీర్చిదిద్దడానికి పాకిస్తాన్ నిఘా సంస్థ ప్రయత్నిస్తున్నదని పేర్కొన్నారు. జ్యోతి ఒడిశాలోని పూరి ఆలయంతో పాటు, ప్రపంచ ప్రఖ్యాత కోణార్క్ ఆలయాన్ని కూడా సందర్శించింది. ఈ విషయాన్ని పూరి క్రైమ్ బ్రాంచ్ ఐజి సార్థక్ సడంగి ప్రకటించారు. ఒడిశాకు చెందిన యూట్యూబర్ ప్రియాంక సహబి విచారించగా, జ్యోతి పర్యటన వివరాలు తెలిశాయని ఆయన పేర్కొన్నారు. జ్యోతిని పూరి, చిలికా, కోణార్క్‌కు తీసుకెళ్లానని ప్రియాంక ఒప్పుకుందని ఐజి వెల్లడించారు. ఈ పర్యటన వెనుక ఉద్దేశం ఏమిటనే కోణంలో దర్యాప్తు జరుపుతున్నట్టు తెలిపారు. ఇలావుంటే, పోలీసుల కనసన్నల్లో ఉన్న ప్రయాంకను పూరి నగరం విడిచి బయటకు వెళ్లొద్దని ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రియాంక, జ్యోతి తిరిగిన ప్రదేశాల్లోని సిసిటివి ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. అనుమానాస్పద అంశాలు ఏవైనా ఉన్నాయేమోనని గమనిస్తున్నారు.

# రాష్ట్రానికి వాన గండం



ఉరుములు, మెరుపులతో

భారీ నుంచి అతి భారీవర్షాలు

అరేబియా సముద్రంలో అల్పపీడనం

పలు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ

చేసిన వాతావరణ కేంద్రం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రాగల ఐదురోజులు భారీ నుంచి అతి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. తూర్పు మధ్య అరేబియా సముద్రం, దక్షిణ కొంకణ్ గోవా తీర ప్రాంత సమీపంలో అల్పపీడనం ఏర్పడిందని తెలిపారు. ఈ అల్పపీడనం ఉత్తర దిశగా కదులుతూ, రాగల 36 గంటల్లో మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందన్నారు. ఈనెల 27న పశ్చిమ మధ్య సమీప ఉత్తర బంగాళాఖాతం ప్రాంతంలో మరో అల్పపీడన ప్రాంతం ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఇది తదుపరి రెండు రోజుల్లో మరింత బలపడే సూచనలు ఉన్నాయని చెప్పారు. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ నుంచి అతి భారీవర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందన్నారు. రాబోయే రెండురోజుల్లో కేరళను నైరుతి రుతుపవనాలు తాకుతాయని, ప్రస్తుతం కేరళ, తమిళనాడు, కర్నాటకలో నైరుతి రుతుపవనాలు ముందుకు సాగేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయన్నారు. దీంతో రాగల మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు తక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉందని చెప్పారు.

### జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్..

గురువారం కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉరుములు, మెరుపులు, గంటకు 5060 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపారు. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేశామన్నారు. ఆదిలాబాద్, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని చెప్పారు. కరీంనగర్, పెద్దపల్లి, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లోనూ వర్షాలు కురుస్తాయన్నారు. శుక్రవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్, భూపాలపల్లి, కొత్తగూడెం, ములుగు, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురుస్తాయన్నారు. శనివారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, నల్లగొండ, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయన్నారు. ఆది, సోమవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని చెప్పారు. జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు.

## సిరాజ్, సమీర్‌లకు వారం రోజుల పోలీసు కస్టడీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పేలుళ్లకు కుట్ర చేసిన కేసులో పోలీసులు దూకుడు పెంచారు. మరింతగా విచారించేందుకు కోర్టు నుంచి అనుమతి తీసుకున్నారు. ఈ కేసులో అరెస్టు అయిన నిందితులు సిరాజ్, సమీర్‌లను ఏడు రోజుల పోలీసు కస్టడీకి అనుమతిస్తూ విజయనగర్ కోర్టు గురువారం ఆదేశించింది. దీంతో విశాఖపట్నం జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న సిరాజ్, సమీర్‌లను విజయనగరం పోలీసులతో పాటు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) అధికారులు కూడా విచారించనున్నారు. విశాఖ సెంట్రల్ జైలు నుంచి సిరాజ్, సమీర్‌లను శుక్రవారం విజయనగరం తరలించనున్నారు. ఇక వీరిని కస్టడీకి కోరిన నేపథ్యంలో థర్డ్ డిగ్రీ ప్రయోగించొద్దని కోర్టు ఆదేశించింది. అంతేకాదు నిందితులకు వైద్యపరీక్షలు చేసి విచారించాలని సూచించింది. కస్టడీ ముగిసిన తర్వాత కోర్టులో ప్రవేశపెట్టాలని ఆదేశించింది. దీంతో పేలుళ్ల కుట్రకేసులో కస్టడీ విచారణ కీలకంగా మారనుంది. పోలీసు కస్టడీలో ఉగ్ర కోణంకు సంబంధించి మరిన్ని వివరాలు బయటపడే అవకాశాలు ఉన్నాయి.

నటుడు సల్మాన్‌ఖాన్ నివాసంలోకి చొరబాటు యత్నం...

## ఓ వ్యక్తి, మహిళ అరెస్ట్

**ముంబయి :** గడచిన రెండు రోజుల్లో ప్రముఖ బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ ఇంట్లోకి చొరబడ్డారన్న ఆరోపణలపై ఒక వ్యక్తిని, మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ విషయాన్ని గురువారం అధికారులు వెల్లడించారు. మంగళవారం, బుధవారం నాడు జరిగిన ఈ ఘటనలకు సంబంధించిన ఫిర్యాదులపై రెండు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేసినట్లు బాంద్రా పోలీసులు తెలిపారు. బాంద్రా (వెస్ట్)లో సల్మాన్‌ఖాన్ నివసించే గెలాక్సీ అపార్ట్‌మెంట్‌లోకి మంగళవారం చొరబడ్డ వ్యక్తిని జితేందర్ సింగ్ (23)గా గుర్తించామని ఒక పోలీస్ అధికారి చెప్పారు. మంగళవారం ఉదయం జితేందర్‌సింగ్ సల్మాన్‌ఖాన్ నివసించే పరిసర ప్రాంతంలో తచ్చాడుతున్నది గమనించి పోలీసులచే మోహరించబడ్డ సల్మాన్‌ఖాన్ సెక్యూరిటీ అతడిని అక్కడ నుంచి వెళ్లిపోవాలని హెచ్చరించారు. ఆగ్రహంతో ఊగిపోయిన జితేందర్‌సింగ్ తన మొబైల్ ఫోన్‌ను నేల మీదకు విసిరికొట్టాడని అధికారి చెప్పారు. అదేరోజు అదేభవనంలో నివసిస్తున్న వ్యక్తికి చెందిన కారులో గెలాక్సీ అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించాడు. మళ్లీ పోలీసులు అతడిని నిలిపివేశారు. ఈ సారి వారు అతడిని బాంద్రా పోలీసులకు అప్పగించినట్లు అధికారి చెప్పారు.విచారణ సమయంలో జితేందర్‌సింగ్ తాను నటుడు సల్మాన్‌ఖాన్‌ను కలవాలని అనుకున్నట్లు చెప్పాడు. తాను లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు ఆ భవనంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారని చెప్పాడని తెలియజేశారు. సింగ్ గెలాక్సీ అపార్ట్‌మెంట్స్ నివాసి కారును అంత త్వరగా ఎలా పొందాడని వారికి వెంటనే స్పష్టం కాలేదు. మరో సంఘటనలో బుధవారం నాడు ఒక మహిళ సల్మాన్‌ఖాన్ ఫ్లాట్‌లోకి చేరుకోగలిగిందని అధికారి చెప్పారు. జితేందర్‌సింగ్, ఆ మహిళపై ట్రెస్‌పాసింగ్ కేసును నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలియజేశారు.

ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయ్యమూర్తితో

# న్యాయ విచారణ జరిపించాలి

కేంద్ర ప్రభుత్వం స్పందిచకపోతే

సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే

కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు పలువురు మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో న్యాయ విచారణ జరిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒక వేళ కేంద్ర ప్రభుత్వం ముందుకు రాకపోతే సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా స్వీకరించి న్యాయ విచారణకు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌పై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయని, ఈ వయసులో ఆయన అడవిలో ఉన్నారా? లేదా తీసుకెళ్లి అక్కడ మట్టుపెట్టారా అనే కథనాలు వస్తున్నాయన్నారు. దీంతోపాటు గత కొంతకాలంగా జరుగుతున్న మావోయిస్టుల, ఆదివాసీల ఎన్‌కౌంటర్లపై కూడా విచారణలో చేర్చాలని, ఆపరేషన్ కగార్ మొదలైన నాటి నుండి ఇప్పటివరకు జరిగిన సంఘటలను విచారణ అంశంలో చేర్చాలని కోరారు. బుధవారం జరిగిన ఘటనపై ప్రధాని మోడీ, కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షా శత్రుదేశంపై విజయం సాధించిన రీతిలో స్పందించడం విచారకరమని ఆయన పేర్కొన్నారు. స్థానిక ప్రజల హక్కులు, వనరుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్న వారిని ఏకపక్షంగా ఎన్‌కౌంటర్ చేయడం సమంజసం కాదని ఆయన పేర్కొన్నారు. 2026 మార్చి 31 వరకు నక్సలైట్లను అంతమొందిస్తామని లక్ష్యంగా పెట్టుకుని మరీ ఎన్‌కౌంటర్లు చేస్తుండడం, మరో వైపు తాము శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటిస్తున్నప్పటికీ పట్టించుకోకపోవడం ద్వారా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఎన్‌కౌంటర్లకు పాల్పడుతున్న విషయం స్పష్టమవుతుందన్నారు. ఇది ప్రజాస్వామిక హక్కులకు విఘాతం కలిగించే అంశమని, వీటన్నింటినీ పరిగణలోకి తీసుకుని సుప్రీంకోర్టు న్యాయ విచారణ చేపట్టాలని సాంబశివరావు తెలిపారు.

## ధాన్యం కొనుగోళ్లపై బిఆర్‌ఎస్ అసత్యప్రచారం

ఇప్పటీ వరకు రికార్డు స్థాయిలో 60.6 లక్షల మెట్రిక్ టన్నుల

కొనుగోలు : మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి బిఆర్‌ఎస్ పూర్తిగా అసత్యప్రచారనికి పూనుకుని ప్రజల్లో గందరగోళం సృష్టిస్తుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డిఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రబీ సీజన్ లో గురువారం సాయంత్రం వరకు రాష్ట్ర వ్యాప్తంగా 60.6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని ఆయన తెలిపారు. అదే బిఆర్‌ఎస్ హాయంలో 2023–24 రబీ సీజన్‌లో ఇదే సమాయానికి (మే 22 నాటికి) కేవలం 36.6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోళ్లు చేశారని వెల్లడించారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత 2023 24 రబీ సీజన్‌లో ఈ సమాయానికి 39.91 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, ఈ ఏడాది ఇప్పటీవరకు రికార్డు స్థాయిలో 60.61లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తి చేశామని తెలిపారు. నిర్ధేశించుకున్న లక్ష్యంలో ఇకా కేవలం 10లక్షల మెట్రిక్ మేర ధాన్యం మాత్రమే మిగిలిందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. బిఆర్‌ఎస్ చేస్తున్నది తప్పుడు ప్రచారానికి ఈ గణాంకాలే నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. చివరి గింజ వరకు ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్లకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

కేరళలో నిషేధిత

సిపిఐ (మావోయిస్టు) నేతలు ఇద్దరిపై

## ఎన్ఐఎ చార్జిషీట్ దాఖలు

సాయుధ విభాగంలో యువతను నియమించారని

2022లో కేసు నమోదు

**న్యూఢిల్లీ :** కేరళలో 2022లో నిషేధిత ఉగ్రవాద సంస్థ సిపిఐ (మావోయిస్టు)సాయుధ విభాగంలోకి యువత నియామకం కేసుకు సంబంధించి మరో ఇద్దరు నిందితులపై 'ది నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ' (ఎన్ఐఎ) చార్జిషీట్ దాఖలు చేసింది. గురువారం విడుదల చేసిన ఒక అధికారిక ప్రకటన ఈ విషయాన్ని వెల్లడించింది. ఆర్.రాఘవేంద్రన్ అలియాస్ రాఘవేంద్ర, బి.కృష్ణమూర్తి అలియాస్ విజయ్ అలియాస్ బాబన్నలపై ఎర్నాకుళంలోని ఎన్ఐఎ ప్రత్యేక కోర్టులో ఈ అనుబంధ చార్జిషీట్‌ను దాఖలు చేసినట్లు ఆ ప్రకటన వెల్లడించింది. 2022లో నిషేధిత సిపిఐ (మావోయిస్టు) దాని సాయుధ విభాగం పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పిఎల్‌జిఎ)లోకి యువతను నియమించడానికి సంబంధించిన ఈ కేసును ఎన్ఐఎ సుమోటో కింద రిజిస్టర్డ్ చేసి చార్జిషీట్ దాఖలు చేసింది. దేశాన్ని అస్థిరపర్చాలన్న ఉద్దేశంతో ఈ మావోయిస్టు ఉగ్రవాద సంస్థ తదుపరి కార్యకలాపాల నిర్వహణ కోసం శిబిరాలను నిర్వహించడంలో నిమగ్నమైందని జాతీయ దర్యాప్తు సంస్థ (నియా) విడుదల చేసిన ప్రకటన తెలియజేసింది. సిపిఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ సభ్యుడు కృష్ణమూర్తి పశ్చిమ కనుమలలోని అటవీ ప్రాంతంలో ఆయుధాల వినియోగం, సైద్ధాంతిక శిక్షణ ఇచ్చి వారిని దేశానికి వ్యతిరేకంగా వేతన యుద్ధంలో నిమగ్నం చేశాడని ఎన్ఐఎ తెలియజేసింది. కర్ణాటకలోని చిక్‌మగుళూర్ జిల్లాకు చెందిన కృష్ణమూర్తి కబానీ దళం స్క్వాడ్‌లోకి చేరాడు. ఈ నిషేధిత సంస్థలోని అజ్ఞాత దళాలకు శిక్షణ ఇచ్చేందుకు ఉగ్రవాద శిబిరాలను నిర్వహించాడని కృష్ణమూర్తిపై నియా అభియోగం మోపింది. తమిళనాడులోని వెల్లూరుకు చెందిన రాఘవేంద్రన్ కూడా ఈ ఉగ్రవాద శిబిరాలను నిర్వహించడంలో నిమగ్నమయ్యాడని ఎన్ఐఎ పేర్కొంది.

## ఎంపిడిఒల బదిలీలకు ప్రభుత్వం ఆమోదం

## త్వరలోనే బదిలీల ప్రక్రియ...

**ప్రజాపక్షం/హైదరాబాద్:** లోక్‌సభ ఎన్నికల సమయంలో బదిలీ అయిన ఎంపిడిఒలకు ఊరట లభించింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఫిబ్రవరి 2024లో బదిలీ అయిన 350కి పైగా ఎంపిడిఒల బదిలీలు చేపట్టాలని పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ నిర్ణయించింది. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత తమను తిరిగి బదిలీ చేయాలని పలుమార్లు ఎంపిడిఒలు మంత్రి ధనసరి అనసూయ సీతక్కకు వినతిపత్రం అందజేశారు. దీనిపైన మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో ఎంపిడిఒల బదిలీ దస్త్రంపైన మంత్రి సీతక్క గురువారం సంతకం చేశారు. అయితే ఎంపిడిఒలను వారి సొంత నియోజకవర్గాలకు కాకుండా ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాలని మంత్రి సీతక్క నిర్ణయించారు.

# నంబాల ఎన్‌కౌంటర్‌పై భిన్నస్వరాలు





మావోయిస్టు జాతీయ కార్యదర్శి రేసులో పలువురు

భావజాల అంతం సాధ్యమేనా ?

**ప్రజాపక్షం/ఖమ్మం :** సంచలనం కలిగించిన భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరావు ఎన్‌కౌంటర్‌పై భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. ఆపరేషన్ కగార్‌లో పెద్దసంఖ్యలో మావోయిస్టులు మృతిచెందగా బుధవారం నంబాల కేశవరావు సహా 27 మంది మరణించారు. గురువారం మరో ఐదుగురు మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో చనిపోయారని ఛత్తీస్‌ఘఢ్ పోలీసులు వెల్లడించారు. 75 సంవత్సరాల నంబాల కేశవరావు పార్టీ ప్రధానకార్యదర్శిగా మూడంచెల భద్రత మధ్య పార్టీ కార్యకలాపాలు నిర్వహిస్తుంటాడని సమాచారం. కర్రెగుట్టల్లో సాయుధ బలగాల ఆపరేషన్ సందర్భంలో మావోయిస్టులు ఇక్కడే ఉన్నారని పదే పదే ప్రకటించిన పోలీసులు కర్రెగుట్టల్లో మావోయిస్టులను పట్టుకోలేకపోయారు. ఈ నేపథ్యంలోనే నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ జరిగింది. వాస్తవానికి 75 సంవత్సరాల నంబాల కేశవరావు ఈ ఎన్‌కౌంటర్‌లో చిక్కి ప్రాణాలు కోల్పోయాడంటే నమ్మే పరిస్థితి లేదు. తీవ్రమైన షుగర్ వ్యాధితో బాధపడుతున్న కేశవరావు ఒడిశాలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. అత్యంత రహస్యంగా చికిత్స పొందుతున్న కేశవరావు సమాచారాన్ని ఇన్‌ఫార్మర్ ద్వారా పొందిన పోలీసులు అత్యంత పకడ్బందీగా మంగళవారం అదుపులోకి తీసుకున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. యుద్ధనీతిలో అరితేరి 55సంవత్సరాల పాటు సాయుధ పోరాటంలో పాల్గొని దానికి నాయకత్వం వహించిన కేశవరావు పోలీస్ బలగాలకు ఇంత సునాయాసంగా చిక్కారన్నది నమ్మశక్యం కావడం లేదని పలువురు వ్యాఖ్యనిస్తున్నారు. మంగళవారం అదుపులోకి తీసుకుని బుధవారం కాల్చి చంపినట్లు మావోయిస్టు సానుభూతిపరులు, ప్రజాసంఘాల బాధ్యులు, ప్రజాతంత్ర వాదులు ఆరోపిస్తున్నారు. నంబాల మృతదేహంపై తుపాకీ తూటాల జాడలు లేవని హింసించి చంపి ఉండవచ్చునని ఆరోపిస్తున్నారు. కేశవరావు వయోభారం రీత్యా క్షేత్రస్థాయిలో సాయుధ పోరాటంలో లేడని ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని ఆరోపణల నేపథ్యంలో ఆయన సోదరుడికి మృతదేహాన్ని అప్పగించారు. దేశంలోనే సంచలనం సృష్టించిన ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పత్రిక జంగ్ ఎడిటోరియల్ బాధ్యులు వెంకటనాగేశ్వరరావు కూడా మృతిచెందినట్లు సమాచారం రావడం మరింత అనుమానాలకు తావిస్తుంది. వెంకట నాగేశ్వరరావుది ఆంధ్రప్రదేశ్‌లోని చీరాల. ఆయన సాయుధ బలగాల్లో పని చేయడని సమాచారం. ఇదిలా ఉండగా ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన వారి మృతదేహాలను ప్రత్యేక సైనిక హెలికాప్టర్‌లో నారాయణపూర్ తరలించారు. మృతదేహాలను పరిశీలించిన అమరవీరుల బంధుమిత్రుల సంఘం బాధ్యులు మావోయిస్టులపై విషప్రయోగం జరిగిందని, దాని కారణంగానే మరణించారు తప్పా ఎన్‌కౌంటర్‌లో కాదని ఆరోపించారు. మొత్తంగా వామపక్ష ప్రజాతంత్ర శక్తులు ఈ ఎన్‌కౌంటర్‌పై విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నాయి.

### మళ్లీ గణపతికే పగ్గాలా....?

మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు మృతిచెందిన తర్వాత ఇక మావోయిస్టు పార్టీ మనుగడ సాధ్యం కాదన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో కేంద్ర కమిటీ బాధ్యతలను తిరిగి గణపతికే అప్పగించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. గణపతి గతంలో పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. గణపతితో పాటు మల్లోజుల వేణుగోపాల్, పశ్చిమబెంగాల్‌కు చెందిన రాజన్ తదితరుల పేర్లు వినవస్తున్నాయి. మావోయిస్టు పార్టీ ఎన్నడు లేనివిధంగా ఒక సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటుంది. సంఖ్యాబలం రీత్యా బలహీనపడటమే కాకుండా సైద్ధాంతికంగా ప్రజలను ఆకర్షించే స్థాయిని క్రమేపి కోల్పోతుంది. ఒకప్పుడు దండకారుణ్యంలో ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని నడిపిన మావోయిస్టులు ఇప్పుడు పార్టీ మనుగడ కోసం వెంపర్లాడుతున్నారు. ఆ పార్టీ చరిత్రలో ఎన్నడులేని విధంగా శాంతి చర్చల కోసం నాలుగుసార్లు లేఖలను విడుదల చేశారు. ఈ స్థితిలో పార్టీ పునర్ నిర్మాణం తిరిగి సాయుధ పోరాటం కొనసాగింపు సహా పలు సవాళ్ల నేపథ్యంలో నూతన సారధ్య బాధ్యతలను ఎవరు స్వీకరిస్తారన్నది సర్వత్రా చర్చనీయాంశమైంది.

### భావజాల అంతం సాధ్యమేనా...?
### ఎందుకీ వికటాట్టహాసం ....?

మావోయిస్టు భావజాలాన్ని అంతం చేయడం సాధ్యమేనా...? ప్రధానితో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్ షా పదేపదే ప్రకటిస్తున్నట్లు 2026మార్చి నాటికి మావోయిస్టుపార్టీ అంతం చేయడమన్నది సాధ్యమవుతుందా? అంటే సాయుధ పోరాటం బలహీనపడవచ్చు కానీ మావోయిస్టు భావజాలాన్ని అంతం చేయడం అంత సాధ్యమయ్యే పని కాదన్నది వాస్తవం. ప్రజల ఆలోచన సరళిలో వచ్చిన మార్పులు ఇతరత్రా కారణాలు పెరిగిన ప్రపంచీకరణ ప్రభావంతో మావోయిస్టు భావజాలం తగ్గిన మాట వాస్తవమే. కానీ అర్ధశతాబ్దానికి పైగ సాగుతున్న మావోయిస్టు ఉద్యమం కేవలం ఛత్తీస్‌ఘఢ్‌కో, కర్రెగుట్టలకో పరిమితం కాలేదు. సాయుధ బలగాల ప్రమాదం ఉన్నంతవరకు ఉద్యమం నివురుగప్పిన నిప్పులా ఉండే అవకాశం ఉంది. అన్నింటికి మించి ఆదివాసీల మనుగడ కూడా ప్రశ్నార్థకం కావచ్చు. గతంలో అభివృద్ధి పేరుతో జరిగిన కార్యక్రమా ల సందర్భంగా తెగలు అంతమైన సంగతి విధితమే. భవిష్యత్తులో ఛత్తీస్‌ఘఢ్‌లోనూ అదే పరిస్థితి ఎదురు కావచ్చు. అడవి నుంచి బయటకు వస్తే ఆదివాసీల పరిస్థితి నీటి ఒడ్డున పడిన చేప చందమే. అడవుల నుంచి అభివృద్ధి పేరుతో ఆదివాసీలను తరిమేస్తే మనుగడ కోసం మరల పోరాడే తత్వానికి అలవాటుపడవచ్చు. గతంలో పలుమార్లు ఇదే జరిగింది. సాయుధ సైనిక బలగాల అణిచివేతతో ఒక భావజాల వ్యాప్తిని ఆపవచ్చునేమో కానీ అంతం చేయడం సాధ్యం కాదు ఇది చరిత్ర చెప్పిన సత్యం.



# జనరల్
STATE & REGIONAL NEWS

## తక్షణం ఎన్‌కౌంటర్లు ఆపి చర్చలు జరపండి

సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో విజ్ఞప్తి

**న్యూఢిల్లీ :** ఛత్తీస్‌గఢ్‌లో కేంద్ర బలగాలు చేసిన ఆపరేషన్ కగార్ ఎన్‌కౌంటర్ చర్యను సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో తీవ్రంగా ఖండించింది. మావోయిస్టుల రాజకీయాలను తాము వ్యతికించినప్పటికీ వారు కోరినవిధంగా వెంటనే చర్చలకు పిలవాలని, కాల్పుల చర్య నిలిపివేయాలని కోరింది. చర్చలు జరిపి సమస్య పరిష్కరించడానికి బదులుగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర బిజెపి ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం అమానుషమైన విధానం అవలంబించాయని, మావోయిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతోపాటు 27 మంది మావోయిస్టులను ఎన్‌కౌంటర్‌లో చంపేశారని పొలిట్‌బ్యూరో గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో విమర్శించింది. చర్చలు జరపాలని పదే పదే మావోయిస్టులు విజ్ఞప్తి చేసినాగానీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకుండా వారిని హతమార్చి పూర్తిగా నిర్మూలించాలనే విధానం పాటించిందని విమర్శించింది. మావోయిస్టులను నిర్మూలినకు తుది గడువు నిర్దేశిస్తూ కేంద్ర హోంమంత్రి పదేపదే పునరుద్ఘాటనలు చేశారని, మావోయిస్టులను చర్చలకు పిలవాలని అడిగినా స్పందించలేదని విమర్శించింది.



## డిజిపి కార్యాలయంలో భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలో గురువారం ప్రముఖ సామాజిక సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు అధికారిక కార్యక్రమంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని ఆయన సేవలను స్మరించుకున్నారు. ఎఐజి రమణకుమార్ పాల్గొని భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ 'భాగ్యరెడ్డి వర్మ సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల శ్రేయస్సు కోసం జీవితాంతం పోరాడారు. ఆయన సేవలు, సిద్ధాంతాలు నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. పోలీసు శాఖలో పని చేసే ప్రతి ఒక్కరూ భాగ్యరెడ్డి వర్మ ఆశయాలను కొనసాగించేలా పనిచేయాలి అని అన్నారు. భాగ్యరెడ్డి వర్మ ఆధునిక తెలంగాణకు సామాజిక న్యాయం పునాది వేసిన మహనీయుల్లో ఒకరుగా గుర్తించబడ్డారనీ , మహిళల విద్యా హక్కులు, బాల్య వివాహాల నిర్మూలన, హక్కుల సాధన కోసం చేపట్టిన ఉద్యమాలు భారతదేశ సామాజిక చరిత్రలో నిలిచి పోయాయన్నారు.

## కవిత రాసిన లేఖతో బిఆర్‌ఎస్ పార్టీలో ముసలం

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్‌కు ఆయన కూతురు ఎంఎల్‌సి కవిత రాసిన లేఖతో బిఆర్‌ఎస్ పార్టీలో ముసలం తారాస్థాయికి చేరుకుందని, లుకలుకలు బట్టబయలు అయ్యాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బిజెపితో బిఆర్‌ఎస్ కలిసి పనిచేస్తుందని తాము ఎప్పటి నుంచో చెబుతున్నామని, దీనిని కవిత స్వయంగా సమర్థించారన్నారు. హైదరాబాద్‌లో ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ బిజెపితో పొత్తు పెట్టుకోవడానికి కెసిఆర్ సిద్ధమతున్నారని లేఖ ద్వారా కవిత చెప్పకనే చెప్పారన్నారు. భవిష్యత్తులో బిఆర్‌ఎస్, బిజెపిలు పొత్తు పెట్టుకోబోతున్నాయని, బిఆర్‌ఎస్ బలహీనపడటం వల్లనే పొత్తుకు ప్రయత్నిస్తున్నట్లు కవిత అంగీకరించారన్నారు. తాము చెబుతున్న మాటలన్ని పచ్చి నిజాలని కవిత లేఖ ద్వారా స్పష్టమైందని తెలిపారు. బిఆర్‌ఎస్ పార్టీలో కెసిఆర్ నియంత్రత్వ వైఖరిపై ఆయన కూతురు కవితే తప్పు పడుతున్నారని, ఇక ప్రజలకు వారు ఏమి సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. సిఎం రేవంత్‌రెడ్డిపై ఒంటికాలిపైలేస్తున్న కెటిఆర్ ముందు తన చెల్లెలికిసమాధానం చెప్పాలని ఆదిశ్రీనివాస్ డిమాండ్ చేశారు.

## 'దోస్త్' మొదటి విడతలో 89,572 మంది విద్యార్థుల నమోదు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు నిర్వహించే దోస్త్ మొదటి విడతలో 89,572 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. ఇందులో 80,701 మంది విద్యార్థులు దరఖాస్తు ఫీజును కూడా చెల్లించారు. ఇందులో 72,543 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు 63,613 మంది విద్యార్థులు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ పూర్తి చేశారు. ఈ నెల 29న మొదటి విడత సీట్ల కేటాయింపు పూర్తవ్వగా, సీట్లు పొందిన విద్యార్థులు మే 30 నుంచి జూన్ 6 మధ్యలో సెల్ఫ్ రిపోర్టింగ్ ఇవ్వాల్సి ఉంటుంది.

## పాలమూరు–రంగారెడ్డిపై కెటిఆర్ ఏ విచారణ కావాలో సిఎంను అడగాలి

టిపిసిసి మహేష్‌కుమార్

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై న్యాయస్థానం తీర్పు బిఆర్‌ఎస్‌కు అనుకూలంగా ఇచ్చినట్లు, వారంతా నీతిమంతులైనట్లు చెప్పేందుకు బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రయత్నిస్తున్నారని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌మార్ గౌడ్ విమర్శించారు. పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై కోర్టు ఇచ్చిన తీర్పుపై కెటిఆర్ చేసిన వ్యాఖ్యలకు మహేష్‌కుమార్ గౌడ్ స్పందిస్తూ పాలమూరు– రంగారెడ్డిపై సిఎం రేవంత్ రెడ్డికి బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ లేఖ రాసి ఏ విచారణ కావాలో అడగాలని, ధైర్యం ఉంటే సిబిఐ విచారణ కావాలా, జుడిషియల్ విచారణ కావాలా అనేది స్పష్టం చేస్తూ ప్రభుత్వానికి రాయాలని ఆయన కోరారు. తద్వారా అవినీతి ఏ విధంగా జరిగిందో బట్టబయలవుతుందని, నిజాయతీని నిరూపించుకునేందుకు కెటిఆర్ ముందుకు రావాలన్నారు. నాడు కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాగం జనార్ధన్‌రెడ్డి ఈ పథకంపై ఆనాడు కోర్టులో పూర్తి ఆధారాలతో కేసు వేశారని, ఆయనను బిఆర్‌ఎస్ పార్టీలో చేర్చుకుని ఆ కేసును నీరుగార్చేవిధంగా, వీగిపోయే విధంగా వ్యవహరించారన్నారు. బిఆర్‌ఎస్ పార్టీలో ఉన్న నాయకుడు బిఆర్‌ఎస్ పార్టీ అధినేత కెసిఆర్‌పై ఎలా కొట్లాడతారని ఆయన ప్రశ్నించారు. దీంతో వారంతా నీతిమంతులని, చేసిన అవినీతి మాయమైనట్లు కెటిఆర్ మాట్లాడుతున్నారన్నారు.

## కులగణనపై నిపుణుల కమిటీ గణాంక, డేటా పూర్తి

ప్రజాపక్షం/హైదరాబాద్ : కుటుంబాలకు సంబంధించిన వ్యక్తిగత నిర్దిష్ట సమాచారాన్ని బహిర్గతం చేయకుండా ''సామాజిక, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, కుల''(ఎస్ఇఇఇపిసి) గణాంకాలను 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్''ను ఉపయోగించి ప్రజలకు అందుబాటులో ఉంచడంతో పాటు దీనిని పరిశోధకులు మరింత విశ్లేషించేందుకు అవకాశాన్ని కల్పించాలని రిటైర్డ్ జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన ఏర్పడిన నిపుణుల కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి సమగ్ర నివేదికను త్వరలోనే రూపొందించి, ఒక నెలలోపు ప్రభుత్వానికి నివేదికను సమర్పించాలని కమిటీ బావిస్తున్నది. నిపుణుల కమిటీ నాల్గవ సమావేశం న్యూఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్ లో గురువారం జరిగింది. రాష్ట్రంలో 243 ఉప కులాల వెనుకబటుతనాన్ని అంచనా వేయడానికి కుల గణాంకాల ఆధారంగా 'సమగ్ర వెనుకబడిన సూచిక (సిబిఐ) రూపొందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన నిపుణుల కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఎస్ఇఇఇపిసి సర్వేలో సేకరించిన డేటాను అధ్యయనం చేసి, వాటిని విశ్లేషించి,ఒక నివేదికను రూపొందించేందుకు కమిటీ కృషి చేస్తుంది. రాష్ట్రంలో 243 ఉప కులాలు ఉంటే, ఇందులో 73 ఉపకులాలకు చెందిన వారే రాష్ట్ర జనాభాలో 96 శాతం మంది ఉన్నారు. కాగా షెడ్యూల్ కులాలకు చెందిన పది ఉప కులాలు, షెడ్యూల్ తెగలకు చెందిన ఏడు ఉప కులాలు, వెనుకబడిన తరగతులకు చెందిన 45 ఉపకులాలు,ఇతర కులాలకు చెందిన పదకొండు ఉప కులాలు ఉన్నాయి. వీరి ఆర్థిక, సామాజిక,వెనుకబాటు తనం ఆధారంగా ఆయా ఉప కులాలకు నిపుణుల కమిటీ ర్యాంకింగ్‌ను నిర్ధారించనున్నారు.

## రాజీవ్ యువ వికాస పథకాన్ని రాష్ట్ర స్థాయి నోడల్ అధికారిని నియమించండి

సామాజిక బాధ్యతను నెరవేర్చే క్రమంలో బ్యాంకర్లు ముందంజలో ఉండాలి

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాస పథకం కింద 5 లక్షల మంది యువతకు మంజూరు పత్రాలను జూన్ 2వ తేదీ నాటికి పంపిణీ చేయాలనే లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రత్యేక నోడల్ అధికారిని నియమించాలని ఎస్‌ఎల్‌బిసి కన్వీనర్‌కు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి బ్యాంకర్లు సహకరించాలని కోరారు. ఈ పథకాన్ని క్షేత్రస్థాయిలో అన్ని బ్యాంకులతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్ర స్థాయి నోడల్ అధికారి పర్యవేక్షించాలన్నారు. హైదరాబాద్‌లో గురువారం జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్‌ఎల్‌బిసి) సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ఎస్‌సి దెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎన్.శ్రీధర్, గిరిజన సంక్షేమశాఖ సెక్రెటరీ శరత్, బిసి వెల్ఫేర్ సెక్రెటరీ శ్రీధర్, ఆర్‌బిఐ రీజినల్ డైరెక్టర్ చిన్మోయ్ కుమార్, నాబార్డ్ సిజిఎం ఉదయ్ భాస్కర్, ఎస్‌బిఐ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్‌కుమార్, ఎస్‌ఎల్‌బిసి కన్వీనర్ ప్రకాష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, ఇందులోనూ ఉద్యానవన పంటలకు ప్రాధాన్యత ఇస్తూ ఆయిల్ పామ్ పంటలకు రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకులు ఉదారంగా వ్యవహరించాలని డిప్యూటీ సిఎం కోరారు. రాష్ట్ర అభివృద్ధిలో బ్యాంకర్లు భాగస్వామ్యం కావాలని డిప్యూటీ సిఎం ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. 2025–26 వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. సామాజిక బాధ్యతను నెరవేర్చే క్రమంలో బ్యాంకర్లు ముందంజలో ఉండాలని సూచించారు. ప్రభుత్వాలు బ్యాంకింగ్ రంగం రెండు కలిసి సామాజిక బాధ్యతను నెరవేర్చడానికి ముందుకు వెళితే సమాజంలో అశాంతి లేకుండా ఉంటుందన్నారు. సమాజం శాంతియుతంగా ఉంటేనే అభివృద్ధి ముందుకు వెళ్తుందని అన్నారు. విద్యాబుద్దులు నేర్చిన మానవ వనరులు ఖాళీగా ఉండటం వల్ల లాభం కంటే, సమాజానికి నష్టమే ఎక్కువగా ఉంటుందని, ఆ నష్టం జరగకుండా ఉండాలని వారి మేధస్సును ఉత్పత్తి రంగంలో వినియోగించి జిడిపికి పెద్దఎత్తున ఉపయోగం ఉండే విధంగా రాజీవ్ యువ వికాస పథకం తీసుకువచ్చామని వివరించారు. గతంలో యువతకు స్వయం ఉపాధి కింద రుణాలు ఇచ్చే సమయంలో 70 శాతం రుణం, 30 శాతం సబ్సిడీ ఉండేదని ఇప్పుడు ఇది రివర్స్‌గా ఉందనే విషయాన్ని బ్యాంకర్లు గ్రహించాలన్నారు. రూ.8 లక్షల కోట్ల పైబడి లక్ష్యంగా పెట్టుకున్న వార్షిక రుణ ప్రణాళికలో రాజీవ్ యువ వికాస పథకం కోసం బ్యాంకర్లు 0.2 శాతం మాత్రమే వెచ్చించాల్సి ఉంటుందన్నారు. చదువుకునే ప్రతి విద్యార్థికి ఫీజు రీయింబర్‌మెంట్ ఇచ్చి ప్రజాప్రభుత్వం బాగా చదివిస్తున్నారని, తద్వారా విద్యలో నైపుణ్యం కలిగిన యువత ఒక వైపు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు పొందుతున్నారని చెప్పారు. ఉద్యోగ అవకాశాలు రాని వారి మేధస్సును కూడా ఈ సమాజానికి ఉపయోగించాలని, వారి మేధస్సును వ్యాపారంలో కానీ ఉత్పత్తి రంగంలో వాడితే ఆ సమాజానికి మంచి మేలు జరుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, యావత్ మంత్రిమండలి ఆలోచన చేసి యువత కోసం ఈ పథకం తీసుకొచ్చామని వివరించారు.

అడవిలో అనాదిగా ఇబ్బందులు పడుతున్న అడవి బిడ్డల జీవన ప్రమాణాలు పెంచడానికి లక్ష్యంగా పెట్టుకుని ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం ప్రారంభించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని అటవీ ప్రాంతాల్లో ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు పొందిన 6.70 లక్షల ఎకరాలను సౌర విద్యుత్తు ద్వారా సాగులోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.12,600 కోట్లను కేటాయించామని వెల్లడించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఈ ఏడాది వడ్డీ లేకుండా రూ.20 వేల కోట్లకుపైగా రుణాలు ఇచ్చామని, రానున్న నాలుగు సంవత్సరాల్లో లక్ష కోట్ల రూపాయలు రుణాలు ఇచ్చే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.




## విక్టోరియా హోమ్‌లో ప్రపంచ సుందరీమణుల సందడి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లో జరుగుతున్న మిస్‌వరల్డ్ పోటీలకు వివిధ దేశాల నంచి వచ్చిన సుందరిమణులు గురువారం సరూర్‌నగర్‌లోని విక్టోరియా హోమ్‌లో సందడి చేశారు. విక్టోరియా హోమ్‌లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులలో మిస్ వరల్డ్ కాంటెస్టర్లు కలిసి వారితో ముచ్చటించారు. తమ లక్ష్యాలు సాధించే దిశగా ఆత్మవిశ్వాసాన్ని వసతి గృహం విద్యార్థులలో కలిగించారు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొంటున్న 107 మంది కాంటెస్టర్లు, ప్రస్తుత మిస్ వరల్డ్ క్రిస్టినా జేకొవా తోకలసి సరూర్‌నగర్ లోని విక్టోరియా హోమ్ సందర్శించి ఇక్కడి ప్రభుత్వ హాస్టల్లో ఉంటున్న విద్యార్థులచే కలిసి వారితో సంభాషించారు. కష్టపడే తత్వం విజ్ఞాన సముపార్జనతో పాటు విద్యలో రాణిస్తేనే శక్తివంతంగా మారతారని పేర్కొన్నారు. ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్న పటిష్టమైన కలలు ఉంటేనే తమ లక్ష్యాలను చేరుకుంటారని కంటెస్టర్లు విద్యార్థులతో అన్నారు. ఈ సందర్భంగా విక్టోరియా హోమ్ విద్యార్థినిలకు పలు బహుమతులను, వారికి నిత్య జీవితంలో ఉపయోగపడే వస్తువులను మిస్‌వరల్డ్ ప్రతినిధులు బహుకరించారు . ఈ సందర్భంగా విక్టోరియా హోమ్ విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలతో మిస్ వరల్డ్ కాంటెస్టర్లు కలిసి ఆడారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను వారు ప్రారంభించారు. 122 సంవత్సరాల పురాతన విక్టోరియా హోమ్ భవన నిర్మాణాన్ని చూసి అబ్బురపడ్డారు. ఈ కార్యక్రమంలో మిస్ వరల్డ్ చైర్మన్ మోర్లే పర్యాటకశాఖ డైరెక్టర్ హనుమంతు, రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు. ఎస్‌సి వెల్ఫేర్ అడిషనల్ డైరెక్టర్ ఉమాదేవి శ్రీనివాస్ రెడ్డి, జిహెచ్‌ఎంసి జోనల్ కమిషనర్‌లతోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు ..

**ఇది బజార్ కాదు.. శక్తి కేంద్రం : సుందరీమణులు**

తెలంగాణ మహిళల శక్తిని నింపుకొని సాధికారత, సామాజిక మార్పు సందేశాన్ని ప్రపంచ దేశాల్లో ప్రచారం చేయాలని మిస్ వరల్డ్ పోటీదారులను మంత్రి దనసరి అనసూయ సీతక్క కోరారు. మాదాపూర్‌లోని శిల్పారామంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో ప్రపంచ అందాల రాణులు మిస్ వరల్ పోటీదారులు సందడి చేశారు. ఇది మహిళా శక్తికి, ఆత్మవిశ్వాసానికి, ఆర్థిక సాధికారతకు చిహ్నం అని వారు ఈ సందర్భంగా కొనియాడారు. ఈ సందర్భంగా, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క పోటీదారులను ఉద్దేశించి ప్రసంగించారు. 'ఇది కేవలం బజార్ కాదు..ఇది శక్తి కేంద్రం, మార్పునకు చిహ్నం. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేసే దిశగా పనిచేస్తోంది. మహిళలకు ఆర్థిక స్వేచ్ఛే నిజమైన స్వాతంత్ర్యం. ఇందిరా మహిళా శక్తి బజార్ ఆ స్వాతంత్ర్యాన్ని బలపరుస్తోంది' అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. పురాతన నాగరికతల కాలంలో మాతృస్వామ్య వ్యవస్థ ఉండేదని గుర్తు చేసిన ఆమె, కాలక్రమంలో మహిళలు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కోల్పోయినప్పటికీ, ఇప్పుడు తిరిగి అన్ని రంగాల్లో రాణిస్తుండటం ఎంతో గర్వకారణం అన్నారు.



## మణిపూర్‌లో 48గంటల బంద్ సక్సెస్

ఇంఫాల్ లోయలో స్తంభించిన సాధారణ జనజీవనం

ప్రభుత్వ బస్సులకు రాష్ట్రంపేరును తొలగించడాన్ని నిరసిస్తూ మెయితీ సంస్థ 'కొకొమి' బంద్ పిలుపు

**గువహతి :** ప్రభుత్వ బస్సుల నుంచి రాష్ట్రం పేరును తొలగించడాన్ని నిరసిస్తూ మణిపూర్ సమగ్రతపై కోఆర్డినేటింగ్ కమిటీ (కొకొమి) ఇచ్చిన బంద్ పిలుపునకు ఇంఫాల్ లోయలో సాధారణ జనజీవన ం స్తంభించింది. మెయితీ సంస్థ ఈ 48 గంటల బంద్ పిలుపును ఇచ్చింది. ముఖ్యంగా గురువారం నాడు ఇంఫాల్ లోయ వ్యాప్తంగా ఐదు జిల్లాలలో సాధారణ జనజీవనం పై ప్రభావం చూపించింది. అన్ని వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు మూసివేయబడ్డాయి. రహదారులపై బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. ఇంఫాల్ తూర్పు జిల్లాలోని వాంగ్‌ఖేయి, ఖురయ్, కోంగ్బా, ఇంఫాల్ పశ్చిమ జిల్లాలోని క్వకీయిథెల్, నవొరెమ్‌థాంగ్‌లలో బంద్ మద్దతుదారులు రోడ్డపైకి వచ్చి దుకాణాలను మూసివేయించారు. ఇళ్లనుంచి బయటకు వచ్చిన వ్యక్తులను తిరిగి ఇంటికి వెళ్లిపోవాలని ఆదేశించారు. బుధవారం అర్ధరాత్రి నుంచే బంద్ ప్రారంభమైంది. బంద్ మద్దతుదారులు మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లోని నవొరెమ్‌థాంగ్, క్వకీయిథెల్‌లలోని రోడ్లపై టైర్లను తగులబెట్టారు. బంద్ పిలుపు నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఇంఫాల్ వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. రాజ్‌భవన్‌కు వెళ్లే అన్ని దారులలో, వ్యూహాత్మక ప్రదేశాలలో కేంద్ర బలగాలు మోహరించాయి. షిరుయి లిల్లీ ఫెస్టివల్‌కు జర్నలిస్టులను తీసుకెళుతున్న బస్సులకు రాష్ట్ర పేరును కవర్ చేసేలా భద్రతా సిబ్బంది బలవంతం చేశారన్న ఆరోపణలపై మణిపూర్ ప్రభుత్వం బుధవారం దర్యాప్తునకు ఆదేశించింది. దీనిపై దర్యాప్తు చేసేందుకు ప్రభుత్వం ఇద్దరు సభ్యులతో కూడిన దర్యాప్తు కమిటీని ఏర్పాటు చేసింది.

## ఆన్‌లైన్ గేమింగ్ స్కామ్‌లో వ్యాపారవేత్తకు రూ.2.74కోట్లు ఛీటింగ్

కేసు నమోదు చేసిన నవీ ముంబయి పోలీసులు

థానే : ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లో చేరాలని ఓ 42 ఏళ్ల వ్యాపారవేత్తను ఒప్పించిన సైబర్ నేరగాళ్లు రూ.2.74కోట్లు మోసగించారు.గురువారం ఈ విషయాన్ని నవీ ముంబయి పోలీసులు చెప్పారు. మే 20న ఈ మోసానికి సంబంధించిన కేసును నమోదు చేసినట్లు సైబర్ సెల్ అధికారి ఒకరు తెలియజేశారు. కొపర్‌ఖైరేన్ ఏరియాలో నివసిస్తున్న ఫిర్యాదుదారు మోసానికి పాల్పడ్డ వ్యక్తులు తనను రూ.3కోట్ల 214లక్షల, 84వేల,526 మొత్తాన్ని డిపాజిట్ చేయాలంటూ ఒత్తిడి చేసిఆన్‌లైన్ గేమ్‌లో పాల్గొనేలా చేస్తామని, ఆకర్షణీయ బహుమతులను పొందే అవకాశం కల్పిస్తామని వాగ్దానం చేశారని పోలీసులకు తెలియజేశాడు. వివిధ బ్యాంక్ ఖాతాలలో డబ్బు జమచేయాలని వారు అతడిని కోరారు. వాగ్దానం చేసిన ప్రైజ్‌మనీ గెలవకపోవడంతో అతడు తనాఉ మోసపోయినట్లు గ్రహించాడు. అతడు రూ.50లక్షలు మాత్రమే డ్రా చేయగలిగాడని, అయితే మిగతా డబ్బు ఆగిపోయిందని అధికారి తెలిపారు. బాధిత వ్యాపారస్తుడు గేమింగ్ అప్లికేషన్ కంపెనీతో కూడా టచ్‌లో ఉన్నాడని, తదుపరి విచారణ కొనసాగుతున్నదని అధికారి చెప్పారు.

## లొట్టపీసు కేసులతో అయ్యేదేమీ లేదు

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : లొట్ట పీసు కేసులతో అయ్యేదేమీ లేదని, సిఎం రేవంత్ రెడ్డి కథ ముగిసిందని, అందుకే ఆయన దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలన్నట్టు పైసల సంపాదనపైన పడ్డారని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ఆగ్రహం ఉన్న మాట నిజమేనని, కానీ బిఆర్‌ఎస్ కార్యకర్తలు కష్టపడి పని చేయకుంటే అనుకున్న ఫలితాలు రావు అని చెప్పారు. జూన్,జులైలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్మల్ జిల్లా బిఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ మేడిగడ్డ పిల్లర్‌కు చిన్న పర్రె పడితే దానిని దాచి పెట్టి, మొత్తం ప్రాజెక్టే కూలిందని కాంగ్రెస్, ఎన్‌డిఎస్‌ఎ నివేదికతో కాళేశ్వరం ప్రాజెక్ట్‌పైన బిజెపి చేస్తున్న దుష్ప్రచారాన్ని చూస్తుంటే తమకు ఉన్న అనుమానం మరింత బలపడుతుందని చెప్పారు.

**పార్టీ పరంగా కొన్ని లోపాలు ఉన్నాయ్ :** కెసిఆర్ అనేక మంచి పనులు చేసినప్పటికీ అనుకున్న ఫలితం రాలేదని, అందుకు పార్టీ పరంగా కొన్ని లోపాలు ఉన్నాయని కెటిఆర్ అన్నారు. నలుగురు కుటుంబ సభ్యులు ఉన్న ఇంట్లోనే కొన్ని విషయాలల్లో అభిప్రాయ భేదాలు వస్తాయని, అలాంటిది లక్షల మంది కార్యకర్తలు ఉన్న రాజకీయ పార్టీలో అభిప్రాయ భేదాలు ఉండడం సహజమేనని అన్నారు.

## గాజాలో యుద్ధం విస్తరిస్తున్న ఇజ్రాయెల్‌కు ఇది హెచ్చరిక?

**వాషింగ్టన్ :** గాజాలో యుద్ధాన్ని భారీస్థాయిలో విస్తరిస్తున్న సంక్లిష్ట తరుణంలో ఇజ్రాయెల్‌కు ఒక తీవ్ర హెచ్చరికగా ఆ దేశ దౌత్యవేత్తలు అమెరికాలో హత్యకు గురయ్యారు. నిజంగా ఇది ఆ దేశానికి ఒక పెద్ద సవాలు. చాలా మంది ఇజ్రాయెల్ అనుకూలవాదులు ఈ చర్యలను యూదు వ్యతిరేకతగా అభివర్ణిస్తుండగా, ఇటీవల ఇజ్రాయెల్ అనుసరిస్తున్న ధోరణే దీనికి కారణమని మరికొంతమంది వాదిస్తున్నారు. ఈ ఘటన తర్వాత బహుశా మధ్యప్రాచ్యంలో వ్యవహారాలలో భారీ మార్పులు కూడా సంభవించే అవకాశాలున్నాయి. రెండు వారాలుగా ఇజ్రాయెల్ గాజాలో భీకర దాడులు చేస్తున్నది. ఖాన్ యూనిస్ సహా పలు ప్రాంతాలలో ప్రజలు ఇళ్ళు వదలివెళ్ళిపోవాలని అమానుషమైన హెచ్చరికలు జారీ చేస్తూ విచక్షణారహితంగా గగనతల దాడులతో సామూహిక హత్యాకాండ చర్యలు వేగిరపరచిన దశలో దౌత్యవేత్తలహత్య జరిగింది. ఇరాన్ అణు మౌలికస్థావరాలపై దాడులు చేసేందుకు ఇజ్రాయెల్ సన్నాహాలు చేస్తోందని అమెరికా గూఢచారి విభాగం నివేదిక వెలువడిన రెండు రోజుల వ్యవధిలోనే ఈ ఘటన జరిగింది. పైగా ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధ విస్తరణ చర్యలను ప్రపంచదేశాలు తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నాయి. అదేవిధంగా మార్చి రెండో తేదీ నుండి గాజాలో అమలు చేస్తున్న ఆహార సరఫరాల ఆంక్షలను తక్షణం ఉపసంహరించాలని ఐక్యరాజ్యసమితిలోని వివిధ విభాగాలతోపాటు ముఖ్యంగా యూరప్ దేశాలు డిమాండ్ చేస్తున్నాయి. గాజాలో ఆహార ఆంక్షలు ఎత్తివేస్తున్నట్లు నేతన్యాహూ ప్రకటించి 48 గంటలు గడచిన తర్వాత కూడా కేవలం 90 ఆహార ట్రక్కులను మాత్రమే గాజాలోకి అనుమతించడాన్ని కూడా ఐక్యరాజ్యసమితి తీవ్రంగా తప్పుపట్టింది.

## 20మంది బందీలు ఖచ్చితంగా బతికే ఉన్నారు

నేతన్యాహూ

**వాషింగ్టన్ :** అదేవిధంగా చాలా అరుదుగా పత్రికాగోష్ఠులు నిర్వహించే బెంజిమన్ నేతన్యాహూ మీడియా ముందుకు వచ్చి దౌత్యవేత్తల హత్యఘటనను తీవ్రంగా ఖండించారు. 2023 అక్టోబరు ఏడో తేదీన మారణహోమం సృష్టించిన హమాస్ ఉగ్రవాదులు 251 మందిని బందీలుగా తీసుకుపోయారు. వీరిలో కొందరు మరణించారు. కొందరిని విడుదల చేశారు. ఐతే ఇంకా 59 మంది ఇజ్రాయెలీ బందీలు గాజాలో ఉండిపోయారు. కానీ వీరిలో 20 మంది బందీలు ఖచ్చితంగా బ్రతికే ఉంటారని విశ్వసిస్తున్నట్లు నేతన్యాహూ చెప్పారు. బందీలను విడుదల చేస్తే తమ యుద్ధ వ్యూహంలో మార్పులు చేస్తామన్నారు. కీలక మిత్రదేశాల ఖండన చర్యలను ఆయన తిరస్కరించారు.

## వరల్డ్‌క్లాస్ స్థాయిలో తెలంగాణ జూపార్కులు నడపాలి

మంత్రి కొండా సురేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రపంచ స్థాయి విధానాలను అవలంభించి రాష్ట్రంలోని జూపార్కులను నడపాలని తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. రాష్ట్రంలోని జూ పార్కుల్లో జంతువుల పరిరక్షణకి ప్రత్యేక చర్యలు అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. తెలంగాణలోని అన్ని జూ పార్కులతో పాటు, అర్బన్ ఫారెస్ట్ పార్కులను మెరుగైర సౌకర్యాలతో తీర్చిదిద్దాలని మంత్రి సురేఖ చెప్పారు. జూలలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే... సందర్శకులు పెద్ద సంఖ్యలో వస్తారని అన్నారు. రాష్ట్ర సచివాలయం కాన్ఫరెన్స్ హాలులో గురువారం మంత్రి కొండా సురేఖ నేతృత్వంలో జూస్ అండ్ పారక్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (జపాట్) 14వ గవర్నింగ్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పిసిసిఎఫ్ డాక్టర్ సువర్ణ (హెచ్‌ఓఎఫ్‌ఎఫ్), చీఫ్ వైల్ లైఫ్ వార్డెన్ ఏలుసింగ్ మేరు, సిసిఎఫ్ లు ప్రియాంక వర్గీస్, రామలింగం, డైరక్టర్ జూ పారక్స్ సునీల్ ఎస్. హేరామత్, పలువురు డిఎఫ్‌ఓలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, సందర్శకుల అభిరుచుల మేరకు, పర్యావరణానికి ఏమాత్రం ఇబ్బంది కలగకుండా, అటవీశాఖకు ఆదాయం సమకూరే విధంగా పకడ్బందీ ప్రణాళికలతో జూస్ అండ్ పారక్స్ అథారిటీ ఆఫ్ ఇండియా పనిచేయాలని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా జూ పార్కుల్లో అవలంబిస్తున్న విధానాలను అమలు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సందర్శకులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని చెప్పారు. అదనపు సౌకర్యాలపై దృష్టి సారించాలని, అందుకు సంబంధించిన అంశాలపై మంత్రి, శాఖ ఉన్నతాధికారులకు పలు సూచనలు చేశారు. కాగా, గత ఏడాది జూ పార్కుల తాలుకూ నిర్వహణ బడ్జెట్ అనుమతులను మంత్రి నుంచి అధికారులు తీసుకున్నారు.



## భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

మంత్రి పొంగులేటి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా, భూ విస్తీర్ణం, లావాదేవీల ఆధారంగా లైసెన్స్డ్ సర్వేయర్లను నియమిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. శిక్షణ పూర్తయిన వెంటనే ఆయా మండలాల్లో భూవిస్తీర్ణం, భూ లావాదేవీల ఆధారంగా ఆరు నుంచి ఎనిమిది మంది సర్వేయర్లను నియమిస్తామన్నారు. నక్షా లేని గ్రామాలు, లైసెన్స్డ్ సర్వేయర్ల శిక్షణపై మంత్రి పొంగులేటి గురువారం నాడు అధికారులతో సమీక్షించారు. తొలివిడతలో ఐదువేల మంది లైసెన్స్డ్ సర్వేయర్లను తీసుకోబోతున్నామని, వారికి ఈనెల 26వ తేదీ నుంచి ఆయా జిల్లా కేంద్రాల్లోనే రెండు నెలల పాటు శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. దరఖాస్తుదారులు ఈనెల 26న ఆయా జిల్లా సర్వే అధికారులను సంప్రదించాలని సూచించారు. రాబోయే రోజుల్లో ప్రతిగ్రామం,మండలంలో రెవెన్యూ డివిజన్‌లలో పట్టణ ప్రాంతాల్లో భూములకు సంబంధించిన అనేక పంచాయితీలను ఈ సర్వేయర్ల ద్వారా శాశ్వత భూ పరిష్కారం చూపుతామని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ సమయంలో తహసిల్దార్లు, సబ్ రిజిస్ట్రార్ దగ్గర భూములకు సంబంధించిన డాక్యుమెంట్లతో పాటు సర్వే పత్రాన్ని కూడా జత పరచాలని భూభారతి చట్టంలో పొందుపర్చిన విషయాన్ని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. దీనికి అనుగుణంగానే సర్వే విభాగాన్ని పూర్తి స్థాయిలో బలోపేతం చేస్తున్నామన్నారు.

**నెలరోజుల్లో సర్వే ప్రక్రియ పూర్తి :** రాష్ట్రంలో నిజాం కాలం నుంచి సర్వే జరగని ,ఇప్పటి వరకు సర్వే రికార్డులు లేని 413 నక్షా గ్రామాలలో రీ సర్వే చేపడుతున్నామని, నెలరోజుల్లో సర్వే ప్రక్రియను పూర్తిచేయాలని అధికారులను మంత్రి పొంగులేటి ఆదేశించారు. ప్రయోగాత్మకంగా మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్‌నగర్ , జగిత్యాల్ జిల్లా భీర్పూర్ మండలం కొమ్మనాపల్లి ( కొత్తది) గ్రామం, ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడ , ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగురు, సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం షాహిద్ నగర్ గ్రామాలను ఎంపిక చేసినట్లు వివరించారు.

## ముగిసిన ధాన్యం కొనుగోళ్లు



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి, పెండ్లి పాకుల వద్ద ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోళ్లు గురువారంతో ముగిసినట్లు పిఏసిఎస్ సిఈవో పల్లా తిరుపతిరెడ్డి తెలిపారు. చిన్నఅడిశర్లపల్లి వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్ద 37,870 క్వింటాళ్లు, పెండ్లిపాకుల వద్ద ఏర్పాటు చేసిన కొనుగోళు కేంద్రం ద్వారా 56,103 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో కొనుగోళ్లకు సహకరించిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్, పిఏసిఎస్ చైర్మన్ డా. వేణుధర్‌రెడ్డి, డిఎస్‌వో, డిసివో, డిఎం, తహశీల్దార్ నరేందర్, డిటిసిఎస్ హన్మంత్ శ్రీనివాస్‌గౌడ్, ఏఈవో జానకిరాములు, పిఏసిఎస్ సిబ్బంది, లారీ అసోసియేషన్, హమాలీ కార్మికులకు ఈసందర్భంగా తిరుపతిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రతి పేదవాడికీ ఇందిరమ్మ ఇళ్లు

**ప్రజాపక్షం/చందంపేట:** నల్లగొండ జిల్లా చందంపేట మండలం ప్రతి పేద వాడికి ఇందిరమ్మ ఇళ్లు అందించడమే ప్రజా పాలన లక్ష్యం అని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రూ. 5లక్షలు అందిస్తున్న ఏకైన రాష్ట్రం తెలంగాణ ప్రభుత్వం అని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం నేరేడుగొమ్ము మండల కేంద్రం మరియు తిమ్మాపురం, కొత్త పల్లి, పెద్దమునిగల్ గ్రామాలలో రూ. 97లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో పాటు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ శంకుస్థాపన చేశారు. నేరేడుగొమ్ము మండల కేంద్రంలో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ బాలునాయక్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని అన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టిందని, పైలట్ ప్రాజెక్టు గ్రామాలలో ఇప్పటికే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగంగా చురుగ్గా సాగుతున్నాయని అన్నారు.



## రాజీవ్ యువవికాసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట:** రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రీయ ఈనెల 25వ తేదీ క ల్లా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను అదేశించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి,ఎస్సీ కార్పోరేషన్, బిసి కార్పోరేషన్, మైనార్టీ కార్పోరేషన్, మండల అభివృద్ధి అధికారులతో రాజీవ్ యువ వికాసం పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను పరిశీలించి పూర్తి చేయాలని కేటగిరి వైజ్‌గా రిజర్వేషన్ నిష్పత్తిని అనుసరించి జూన్ 25 వరకు మండల స్థాయి కమిటిలతో ఎంపిక పూర్తి చేసి జిల్లా స్థాయికి లబ్ధిదారుల జాబితాను అందజేయాలని కోరారు. బ్యాంకు లింకేజి ఉన్న దరఖాస్తులలు అర్హులైన జాబితాను కూడా పూర్తి చేసి జూన్ 2 నాటికి లబ్ధిదారులకు మంజూరు చేసి ఉత్తర్వులు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈడి ఎస్‌సి కార్పోరేషన్ శ్రీనివాస్‌నాయక్, పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీధర్‌రెడ్డి, ఎల్డీఎం బాపూజీ, డిప్యూటి సిఇవో శిరీష, మెప్మా పిడి రేణుక, మత్స్యశాఖ అధికారి గురవయ్య, డిడబ్ల్యూవో నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్‌పాత్ పండ్ల విక్రయదారుల ఆందోళన



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని సాగర్‌రోడ్డు, నల్లగొండ రోడ్డు, కోదాడ రోడ్డులలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన పలు దుకాణాలను పట్టణ పోలీసులు తొలగించడంతో వీధి విక్రయదారులు గురువారం సాగర్‌రోడ్డులో ఆందోళన నిర్వహించారు. గత వారం రోజులుగా పట్టణ పోలీసులు సాగర్‌రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న పలువురు వీధి విక్రయదారులను ముందస్తుగానే హెచ్చరించి ఇతర ప్రాంతాల్లో విక్రయాలు జరుపుకోవాలని సూచించారు. పోలీసుల ఆదేశాలను విస్మరించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ విక్రయాలు జరుపుతూ ఉండడంతో వీధి విక్రయదారులకు చెందిన బండ్లను అక్కడ నుంచి తొలగించారు. దీంతో విక్రయదారులు సాగర్‌రోడ్డుపై రాస్తారోకో నిర్వహించి ఆందోళన చేపట్టారు. కాగా వీధి విక్రయదారులతో గతంలోనే సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, డీఎస్పీ రాజశేఖర్ రాజు, మున్సిపల్ అధికారులు సమావేశం నిర్వహించి సాగర్‌రోడ్డుపై ఫుట్‌పాత్‌లను ఆక్రమించి విక్రయాలు జరపవద్దని, వారికి కేటాయించిన స్థలాల్లో పండ్లు, కూరగాయల విక్రయాలు జరుపుకోవాలని సూచించారు. విక్రయదారులకు అనుకూలంగా ఉండే స్థలాలను కేటాయిస్తామని చెప్పడంతో విక్రయదారులు ఆందోళన విరమించారు.

## మహిళలు సంఘటితం కావాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మహిళలు వంటింటికే పరిమితం కాకుండా మహిళలపై జరుగుతున్న దాడులను ఎదిరించేందుకు పోరాట మార్గాన్ని ఎంచుకోవాలని భారతీయ మహిళా సమైక్య నియోజకవర్గ అధ్యక్షురాలు దాసర్ల దుర్గమ్మ, ప్రధాన కార్యదర్శి ఎర్రబోతు పద్మలు అన్నారు. గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నియోజకవర్గ మహిళా సమైక్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా సీపీఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను బేషరతుగా అమలు చేయాలని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళల పట్ల అనేక దాడులు చేస్తూ అత్యాచారాలకు గురి చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. అదేవిధంగా నియోజకవర్గ అధ్యక్షురాలు దాసర్ల దుర్గమ్మ, ప్రధాన కార్యదర్శి ఎర్రబోతు పద్మలు మాట్లాడుతూ భారతీయ మహిళా సమైక్య గ్రామగ్రామాన మహిళలను చైతన్యం చేసేందుకు కృషి చేస్తుందన్నారు. 75 ఏండ్ల స్వతంత్ర్య భారతదేశంలో స్త్రీ జాతిని ఇంకా అవమానాలకు గురి చేస్తూ దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. మహిళలు తలుచుకుంటే ప్రభుత్వాలు కూలిపోవడం ఖాయమన్నారు. గ్రామాల్లోనే మహిళలు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఎస్‌కె.షమీం, సహాయ కార్యదర్శి ఎర్రమాద సులోచన, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ గుమ్మకొండ అంజమ్మ, కార్యవర్గ నాయకురాలు మచ్చ శైలజ, దామరచర్ల సీపీఐ సహాయ కార్యదర్శి పోలేపల్లి ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అధిక ఫీజులు వసూలు చేస్తున్న కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** అధిక ఫీజులు వసూలు చేస్తున్న కాలేజీలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ వాదులు ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ భువనగిరి శ్రీనివాస్ నేత అన్నారు. పేద మధ్యతరగతి అణగారిన పిల్లలకు ఉన్నత విద్యాని అందివ్వడం కోసం లక్షలలో డొనేషన్ ఫీజు అడుగుతున్న యజమానులపై చర్యలు తీసుకోవాలని అసలు తెలంగాణ వాదులు ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ డాక్టర్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తంని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న వందల కాలేజీలు అన్ని ఫీజు రియంబర్స్ కోసమేనని అన్ని కాలేజీలలో అస్సలు స్టాపే లేదని చెప్పారు. ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ డాక్టర్ ఇటిక్యాల పురుషోత్తంకి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసలు మాజీ సర్పంచ్ మండల్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు చుక్క స్వామి, ముదిరాజ్ సంఘం రాష్ట్ర సభ్యులు ముల్కలసత్యనారాయణ ముదిరాజ్, తుమ్మల బిక్షపతి ముదిరాజ్, పిన్నం సుధాకర్ పాల్గొన్నారు.

## చేయూత పింఛన్ల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత పథకం కింద పంపిణీ చేస్తున్న పింఛన్ల పంపిణీలో ఎలాంటి అక్రమాలు చోటు చేసుకున్నట్లయితే అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. గురువారం పట్టణంలోని కళాభారతిలో చేయూత పథకంపై నిర్వహించిన డివిజన్ స్థాయి సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ వివిధ రకాల పెన్షన్లకు సంబంధించి ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శుల లాగిన్లలో ఉన్న వివరాలను డివిజన్ స్థాయి సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ వివిధ రకాల పెన్షన్లకు సంబంధించి ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శుల లాగిన్లలో ఉన్న వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. అనారోగ్యం కారణంగా మంచానికి పరిమితమైన వారు, వివిధ కారణాలతో బయోమెట్రిక్ పడని వారికి మాత్రమే పంచాయతీ కార్యదర్శులు వారి బయోమెట్రిక్ ద్వారా పెన్షన్లు చెల్లించాలని, శాశ్వతంగా వలస వెళ్లినవారు, ఇతరుల పెన్షన్లను పంచాయతీ సెక్రటరీల బయోమెట్రిక్ ద్వారా పెన్షన్లను డ్రా చేసినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే చనిపోయినవారు, ఇతర కేసులకు సంబంధించిన పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. ప్రత్యేకించి వృద్ధాప్య పెన్షన్లలో చనిపోయిన వారి పేర్లను ఒకట్రెండు సార్లు పరిశీలించి ఆన్‌లైన్‌లో జాబితా నుంచి తొలగించాలని, ఒకవేళా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు ఉంటే స్పష్టంగా పేర్కొనాలని ఆదేశించారు. జిల్లాలో సుమారు 29వేల పెన్షన్లు శాశ్వతంగా వలస వెళ్లిన వారి జాబితాలో ఉన్నాయని, వాటన్నింటిని గత నెల నుంచి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి చనిపోయిన, వలస వెళ్లిన వారి పేర్లను తొలగించడం, చనిపోయిన వారి స్థానంలో వారి భార్య లేదా భర్తకు పెన్షన్ ఇవ్వడం వంటివి చేసిన తరువాత ఈ సంఖ్య 2వేలకు వచ్చిందని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా రానున్న మూడు రోజుల్లో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, రానున్న సీజన్‌లో వన మహోత్సవం కింద మొక్కలను నాటేందుకు స్థలాలను గుర్తించడంతో పాటు మొక్కలను పెంచాలని, ఇందుకు సం బంధించి 202526 సంవత్సరానికి గాను కార్యాచరణ, ప్రణాళిక రూపొందించి సమర్పించాలని ఆదేశించారు. నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లకు టాయ్‌లెట్స్ మంజూరు చేయడం జరుగుతుందని, అలాగే ప్రతి ఇంట్లో, ప్రతి ప్రభుత్వ సంస్థలో సోక్‌పిట్ నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, రాష్ట్ర సెర్ఫ్ కార్యాలయ సోషల్ సెక్యూరిటి పెన్షన్ల పంపిణి సంచాలకులు గోపాలరావు, ఇన్‌చార్జి జడ్పీ సీఈవో శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.



## భావితరాలకు మహనీయుల త్యాగాలు, చరిత్ర

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** మహనీయుల త్యాగాలను, చరిత్రను భావితరాలకు తెలపాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో షెడ్యూల్ కులముల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భాగ్యరెడ్డి వర్మ 137వ జయంతి వేడుకల్లో షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి దయానందరాణి వివిధ కుల సంఘాల నాయకులతో కలిసి భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యతోనే సమాజ మార్పు జరుగుతుందని భావించిన భాగ్యరెడ్డి వర్మ అభివృద్ధి కోసం, మండలి ఏర్పాటు కోసం నిరంతరం కృషి చేస్తున్నాడని అన్నారు. సమాజంలో దళితుల చైతన్యం కోసం విశేష కృషి చేసిన మానవుడుని అన్నారు. దేశ అభివృద్ధికి, ప్రజా సంక్షేమ కోసం ఉద్యమించిన వారి చరిత్ర, త్యాగాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరికి బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపివో కిషన్ నాయక్, డిటిడివో శంకర్, డిఎంహెచ్‌వో కోటచలం, బిడబ్ల్యూవో నర్సింహరావు, జగదీశ్వర్ రెడ్డి, మత్స్యశాఖ అధికారి నాగుల్‌నాయక్, డివైఎస్‌వో రామచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో పై ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేసుకోవాలి

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** వర్షాకాలంలో పై ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేసుకోవాలని జడ్పీ సీఈవో శోభారాణి అన్నారు. గురువారం భువనగిరి మండలంలోని బండ సోమవారం గ్రామంలో ఇల్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దశలవారీగా ఇళ్ల నిర్మాణంను పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ దినాకర్, పంచాయతీ కార్యదర్శి మంజుల, ఫీల్డ్ అసిస్టెంట్ బలరాం, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు నానం కృష్ణ గౌడ్, ఐలయ్య, జంగయ్య పాల్గొన్నారు.

## వేగవంతంగా ధాన్యం కొనుగోళ్లు

**ప్రజాపక్షం/డిండి:** ప్రభుత్వ ధాన్యపు కొనుగోలు కేంద్రాల్లో రైతుల ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని సిపిఐ డిండి మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి అధికారులను కోరారు. గురువారం సిపిఐ డిండి గ్రామశాఖ సమావేశం సిపిఐ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి హాజరైన కనకాచారి మాట్లాడుతూ వర్షాల కారణంగా రైతుల ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో లారీల సంఖ్యను పెంచి త్వరితగతిన కొనుగోళ్లు చేయాలని, తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేయాలని అన్నారు. సిపిఐ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, స్థానిక సంస్థల నేపథ్యంలో బరిలో నిలిచేలా క్యాడర్ సమాయాత్తం కావాలని సూచించారు. ఈ సమావేశంలో శాఖ కార్యదర్శి దుబ్బ లక్ష్మారెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు హనుమాండ్ల కేశవులు, వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు సలీం, లింగమయ్య, శాఖ సహాయ కార్యదర్శులు గోవర్ధన్, సైదులు, సాగర్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



## త్వరతగతిన రాజీవ్ యువ వికాస దరఖాస్తుల పరిశీలన

### అదనపు కలెక్టర్ వీరారెడ్డి ఆదేశం



**ప్రజాపక్షం/యాదాద్రి :** అర్హులైన లబ్ధిదారులు అందించిన దరఖాస్తులను రాజీవ్ యువ వికాస పథకంకు ఎంపిక త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని అదనపు కలెక్టర్ తన ఛాంబర్‌లో రాజీవ్ యువ వికాస పథకానికి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా ఏ యూనిట్ ఏ శాఖ పరిధిలోకి వస్తున్నది అన్నది నిర్ధారించుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు యూనిట్ కాస్టును అంచనా వేయాలని ఆయా ప్రాంతంలోని డిమాండ్‌కు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలన్నారు. మరికొన్ని యూ నిట్ల స్థాపనకు ఆయా గ్రామాల గ్రామపంచాయతీ అనుమతులు పట్టణంలో అయితే మునిసిపాలిటీ అనుమతులు తప్పనిసరిగా పొందాలన్నారు. మత్స్య, పశుసంవర్ధక, వైద్య ఆరోగ్య, వ్యవసాయ, ఉద్యాన, డిఆర్‌డిఏ, తదితర విభాగాల కింద వచ్చే ప్రతి యూనిటును క్షుణ్ణంగా సమీక్షించారు. అంతేకాకుండా ఉపాధిలో భాగంగా వివిధ రకాల వ్యాపారాలు, వాహనాల కొనుగోళ్లపై సమీక్షిస్తూ ఆయా కుటుంబాల స్థితిగతులను పరిగణలోకి తీసుకోవాలని ఇతరత్రా కార్యక్రమాల ద్వారా అవసరమైతే శిక్షణ కార్యక్రమాలు ఇప్పించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత వ్యవధి లోగా సాధించేందుకు అధికారులు అంకిత భావంతో పని చేయాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో జడ్పీసీఈఓ శోభారాణి డిఆర్డిఏ పిడి నాగిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి శ్యాంసుందర్, ఫిషరీస్ ఏడి రాజారామ్, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ మోతిలాల్, బీసీ సంక్షేమ అధికారి యాదయ్య, వ్యవసాయ శాఖ అధికారి గోపాల్, ఉద్యాన శాఖ అధికారి సుభాషిని, వైద్యశాఖ అధికారి డాక్టర్ మనోహర్, పరిశ్రమల శాఖ ఏడి విజయకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** ఇంటర్ సప్లమెంటరీ పరీక్ష వాతావరణంలో మొదలయ్యాయని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు.గురవారం సూర్యాపేట పట్టణంలోని ప్రతిభ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ మొదటి సంవత్సరం సప్లమెంటరీ పరీక్షను జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు ఎలాంటి మాల్ ప్రాక్టిస్ జరగకుండా పకడ్బందిగా పరీక్షలు నిర్వహించాలని కోరారు. మే 25న జరిగే జిపివో పరీక్ష నిర్వాహణలో భాగంగా గురువారం సూర్యాపేట పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందిగా ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తూ ఎలక్ట్రిసిటి, తాగునీరు తదితర మౌళిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. నిర్వాహణపై సంబధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఎక్కడ మాస్ కాపియింగ్‌కు ఆస్కారం లేకుండా పకడ్బందిగా చర్యలు తీసుకోవాలని అదేశించారు. ఆయన వెంట ఎవో సుదర్శన్‌రెడ్డి, మున్సిపల్ కమిషన్ శ్రీనివాస్, సంబంధితశాఖ అధికారులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యం మెరుగుకు వెంటనే చర్యలు



**ప్రజాపక్షం/యాదాద్రి :** పల్లెలు పచ్చదనంతో వెలసిల్లెందుకు గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అదనపు కలెక్టర్ రెవెన్యూ వీరారెడ్డి తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో పారిశుధ్యం మెరుగుకు చేపట్టవలసిన పలు అంశాలను సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వ్యక్తిగత మరుగుదొడ్లకు, వ్యక్తిగత సోక్ పిట్స్, కమ్యూనిటీ సోకు ఫిట్స్, డ్రైనేజ్ సోక్ పిట్స్ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని 428 గ్రామపంచాయతీల్లో కమ్యూనిటీ సోక్ పిట్స్ తప్పని సరిగా నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, ఇప్పటి వరకు 11 మంజూరు చేసినందున ఈ మాసంలో పూర్తిచేయాలన్నారు. జిల్లాలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లకు కూడా వ్యక్తిగత సోక్ పిట్‌లను మంజూరు చేయాలన్నారు. 4997 సోక్ పిట్‌లను మంజూరు చేయగా 112 మాత్రమే మంజూరు కావడం జరిగిందన్నారు. స్వచ్ భారత్ మిషన్ క్రింద 12 కమ్యూనిటీ టాయిలెట్ కాంప్లెక్స్ మంజూరు చేశామని సత్వరమే పూర్తి చేయించాలన్నారు. ఎంపిడిఓలు పంచాయతీ సెక్రటరీలతో నిర్మాణ పనులపై సమీక్షిస్తూ ప్రగతి సాధించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో జడ్పీ సీఈవో శోభారాణి, డిఆర్డిఓ నాగిరెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ

### అధికారులకు జిల్లా కలెక్టర్ సంతోష్ ఆదేశం



**ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధి:** వరిధాన్యం కొనుగోలు చేసిన వెంటనే మిల్లులకు తరలించాలని, వర్షాల నుంచి ధాన్యం తడవకుండా టార్పాలిన్లతో భద్రపరచాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం గద్వాల మండలంలోని చెనుగొనిపవల్లి, గుంటిపల్లి గ్రామంలోని ఐ.కే.పీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రా న్ని అదనపు కలెక్టర్ నర్సింగ రావుతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి, తేమ శాతం, లారీ లోడింగ్, ఓపియంఎస్ లో డేటా ఎంట్రీ తదితర అంశాలను పరిశీలించారు. వర్షాలు పడే అవకాశం ఉన్నందున, ధాన్యం తడిపోయే ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అదికారులను ఆదేశించారు. ధాన్యంలో తేమ శాతం 17%కు చేరగానే వెంటనే సంచుల్లో నింపి, లారీలలో లోడ్ చేసి మిల్లులకు తరలించాలని, వర్షాలు వచ్చినప్పుడు వాహనాలు వచ్చే వరకు సంచులకు టార్పాలిన్లతో కప్పి సురక్షితంగా ఉంచాలని ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడి, కేంద్రంలో అందుతున్న సౌకర్యాలు, వసతుల గురించి తెలుసుకున్నారు. రైతులు తమ అభిప్రాయాలను కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ విమల, అడిషనల్ డి.ఆర్.డి.ఓ నర్సింహులు పాల్గొన్నారు.

## ఇంగ్లీష్ భాషకు ప్రాధాన్యత తగ్గించేలా ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డిగ్రీ కళాశాలలో ప్రస్తుతం బోధించ బడుతున్న ఇంగ్లీషు భాషకు కేటాయించిన 20 క్రెడిట్స్ ను 12 క్రెడిట్లను తగ్గించే ప్రతిపాదనను విరమించుకుని, యదావిధిగా ఇంగ్లీష్ భాషకు ఉన్న క్రెడిట్ లను కొనసాగించేలా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నిర్ణయం తీసుకోవాలని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఇంగ్లీష్ విభాగం విజ్ఞప్తి చేసింది.ఈ సందర్భంగా మహాత్మాగాంధీ విశ్వ విద్యాలయంలో ఇంగ్లీష్ విభాగం అధిపతి కె అరుణప్రియ అధ్యక్షతన జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇంగ్లీష్ అధ్యాపకులతో అత్యవసర సమావేశం నిర్వహించి, ఈ అనాలోచిత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని చేసిన తీర్మానాన్ని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్,డీన్ ప్రొఫసర్ కే అంజిరెడ్డి కి అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన విద్యా విధానం ప్రకారం యూజీసీ సూచనల మేరకు తీసుకునే ఈ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డిగ్రీ కళాశాలలో చదువుతున్న గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తీవ్రమైన నష్టం జరిగేటటువంటి అవకాశం ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల ఇంగ్లీషు అధ్యాపకులు రాంరెడ్డి, చైతన్య సుధా,సుధాకర్, హరికృష్ణ, వెంకట్, ప్రభాకర్, రేణుక పాల్గొన్నారు.

## రైతులకు న్యాయం చేకూరుస్తాం

**ప్రజాపక్షం/యాదాద్రి :** తుర్కపల్లి మండలం గంధ మల్ల రిజర్వాయర్ కొరకు తీసుకుంటున్న భూములకు రైతులకు ఆమోదితమైన సరైన ధర చెల్లించేందుకు ప్రభుత్వం తప్పక నిర్ణయం తీసుకుంటుందని రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆందోళన చెందరాదని అదనపు కలెక్టర్ వీరారెడ్డి తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ భువనగిరి ఆర్టీవో కృష్ణారెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో తుర్కపల్లి మండల రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 14 మంది రైతులు తమ ప్రజాభిప్రాయాలను తెలియజేశారు. ఎంతోకాలంగా భూమిని నమ్ముకుని బతుకుతున్నామని వ్యవసాయ పనులు తప్ప తమకు వేరే పనులు తెలియవని, తాము రిజర్వాయర్ నిర్మాణానికి ఏమాత్రం వ్యతిరేకులం కాదని, అధికారులు ప్రజాప్రతినిధులు తమకు అండగా నిలిచి న్యాయం చేకూర్చాలన్నదే తమ అభిప్రాయం అన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతులు అధైర్య పడవద్దని ప్రభుత్వం తప్పకుండా న్యాయం చేస్తుందన్నారు. రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఈ సమావేశంలో తుర్కపల్లి మండల అధికారులు ప్రజాప్రతినిధులు రైతులు పాల్గొన్నారు.



## విత్తన పరిశీలన సేకరణ



ప్రజాపక్షం/బిజినేపల్లి : మండలకేంద్రంలో గురువారం విత్తన పరిశీలనసేకరణ మండల వ్యవసాయ అధికారిణి నీతిరెడ్డియంగ్‌ఫార్మర్స్‌రూరల్ డెవలప్‌మెంట్ సొసైటి సాయిట్రేడర్స్, శ్రీగౌతమిట్రేడర్స్ బిటిపత్తి విత్తనాలు 8 నమూనాలు ట్రేడర్స్‌ద్వారా సేకరించి పరీక్షా నాణ్యతనిమిత్తంకోసం విత్తన పరీక్ష ల్యాబ్లేటరీ రాజేంద్రనగర్‌కు పంపించామని ఆమె తెలిపారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు : వ్యవసాయ అధికారి

ప్రజాపక్షం / పెబ్బేరు : పెబ్బేరు మండలంలోని ప్రతి రైతు కేంద్ర ప్రభుత్వ పథకాలకు అర్హత సంపాదించాలంటే ప్రతి ఒక్కరు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారుల దగ్గర ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఐడి కోసం దరఖాస్తు చేసుకోవాలని , దీనికి నెల 30వ తేదీకు ఆఖిరి తేదీగా నిర్ణయించారని, కేంద్ర ప్రభుత్వ పథకాలైన పిఎం కిసాన్ , ఫసల్ బీమా , లాంటికేంద్ర ప్రభుత్వ పథకాలకు అర్హత పొందాలంటే ప్రతి ఒక్క రైతు ఈ కేవైసీ పూర్తి చేయాల్సి ఉంటుందని మండల వ్యవసాయ అధికారి షేక్ మున్న రైతులకు అవగాహన కల్పించారు. గురువారం పెబ్బేరు మండల పరిధిలోని రాంపూర్ గ్రామ రైతులకు వ్యవసాయ అధికారి దీనిపై విస్తృత అవగాహన కల్పించారు. మొత్తం పెబ్బే రు మండలంలో 15216 మంది రైతులకు కేవలం 36 మంది మాత్రమే న మోదు చేసుకున్నారని మిగతా రైతులందరూ ఫార్మర్ ఐడి రిజిస్ట్రేషన్ కోసం తప్పనిసరిగా వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని ఆయన అన్నారు.

## యూరియా వాడకాన్ని తగ్గించాలి



ప్రజాపక్షం/బిజినేపల్లి : యూరియా ఎక్కువ వాడకాన్ని తగ్గించినట్లయితే నాణ్యతతో కూడిన దిగుబడులు పొందవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ బిఎస్‌సి కళాశాల డాక్టర్ శ్రీరామ్ అన్నారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా తెలకపల్లి మండలంలోని లక్నారం గ్రామంలో గురువారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రైతన్నలు విరివిగా మోతాదుకుమించి రసాయన ఎరువులను వాడటం వలన దిగుబడిలపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతన్నలకు వివరించారు. భూమిసారవంతం కోల్పోవడంతోపాటు ఆమ్లతత్వం క్షారతత్వంతో సమస్యాత్మక నేలగా తయారయ్యే అవకాశం ఉందని తెలిపారు. కావున శాస్త్రవేత్తలు వ్యవసాయ అధికారులు సూచించినమేరకే రసాయన ఎరువులను వాడాలని రైతులను కోరారు. డాక్టర్ రాజిరెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకోసం ప్రతి ఒక్కరు మొక్కలు పెంచడంకోసం నడుంకట్టాలని పిలుపునిచ్చారు. మొక్కల పెంపకంద్వారా నేల సారవంతం పెరగడంతోపాటు నేలకోతకు గురికాకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఓ నర్మద, పిఎసిఎస్‌డైరెక్టర్ రాజమహేందర్‌రెడ్డి, ఏఈఓ శ్రావ్య, మాజీసర్పంచ్ ఉషన్న పాల్గొన్నారు.

## పోక్సోయాక్ట్ , సంబంధిత చట్టాలపై గ్రామస్థులకు అవగాహన కార్యక్రమం



ప్రజాపక్షం/ మక్తల్ : మక్తల్ మండలంలోని భూత్పూర్ గ్రామంలో జిల్లా బాలల రక్షణ విభాగం ఆధ్వర్యంలో గ్రామ స్థాయి బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేయబడింది. ఈ సమావేశంలో బాలల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతగా తీర్మానం చేయడం జరిగింది. చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ జి.నరసింహులు మాట్లాడుతూ. గ్రామం బాల్య వివాహాలు, బాల కార్మికులు లేని గ్రామంగా మారటానికి గ్రామ ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. పిల్లలు ఎటువంటి సమస్యలకై గురవుతుంటే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఎప్పుడైనా సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ హెల్ప్ లైన్ 24/7 అందుబాటులో ఉంటుందని తెలిపారు. లీగల్ అడ్వకేట్ కవిత మాట్లాడుతూ. చిన్న వయసులో పిల్లలకు పెళ్లిళ్లు చేయడం నిషిద్ధమని, ఇటువంటి పెళ్లిళ్లు జరిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇటీవల మక్తల్ మండల పరిధిలో నాలుగు బాల్యవివాహాల కేసులు నమోదు అయినట్లు తెలిపారు. అలాగే పోక్సో యాక్ట్, సంబంధిత చట్టాల పై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు, మహిళా సంఘ సభ్యులు, ఆశ వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శి, జిల్లా బాలల పరిరక్షణ విభాగ సిబ్బంది, ఎంపీటీసీ గ్రామ సభ్యులు పాల్గొన్నారు.

## జిపిఓ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



ప్రజాపక్షం/ నారాయణపేట్ : ఈనెల 25న జరిగే గ్రామ పాలన అధికారులు జిపిఓ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీ సంచిత్ గంగ్వార్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిపిఓ పరీక్షలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 25న ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు జరిగే జిపిఓ పరీక్షల్లో 109 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. నారాయణపేటలోని శ్రీవేద సరస్వతి జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్లు అభ్యర్థులు హాల్ టికెట్లపై హెచ్‌ఓడి అటెస్ట్ చేయించాలన్నారు. అలాగే ఐడి ప్రూఫ్ తీసుకొని పరీక్షకు హాజరుకావాలని హెల్ప్ లైన్ నెంబర్ 9154283913 ఉంటుందని తెలిపారు. ఇట్టి పరీక్షా కేంద్రంలో జిల్లా ఎస్‌పి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహిస్తారని తెలిపారు. డీఐఈఓసిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. నోడల్ అధికారులు అభ్యర్థుల హాజరు, గుర్తింపు చేయాలన్నారు. డిఎంహెచ్ఓ పరీక్ష కేంద్రాల వద్ద ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ శాఖ వారు విద్యుత్ సరఫరా చేయాలని మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో శానిటైజేషన్ తదితర పనులు చేయాలన్నారు. ఈ సమావేశంలో డిటిఓ హరిప్రసాద్, ఎఓ జయసుధ ,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఉపాధ్యాయుడు బోధనా నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి

### రాష్ట్రవిద్యాశాఖ అదనపు డైరెక్టర్ లింగయ్య

ప్రజాపక్షం/కల్వకుర్తి : ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగేలా ప్రతి ఉపాధ్యాయుడు తమ బోధన పద్ధతులను కాలానికి అనుగుణంగా మెరుగుపర్చుకొని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా అవసరం ఉందని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అదనపు సంచాలకులు లింగయ్య ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు లీడర్‌షిప్‌క్వాలిటి కంటిన్యూఎస్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్‌పై కొనసాగుతున్న శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఆలోచనలకు అనుగుణంగా ఉపాధ్యాయులందరూ ఐదురోజుల శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపర్చాలని పిలుపునిచ్చారు. టీచర్లందరూ ఈశిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతిగదిలో అమలు చేసి తెలంగాణరాష్ట్రాన్ని విద్యా ప్రమాణాలపరంగా ముందువరుసలో నిలబెడతారనే నమ్మకం, విశ్వాసం తనకు ఉందన్నారు. ఈశిక్షణ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి బరపటివెంకటయ్య, టెస్టుబుక్‌మేనేజర్ మానపాడు నర్సింహ్మా, వంగూరుమండల ఎంఈఓ మురళి, మనోహరచారి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# మొలకెత్తిన ధాన్యానికి నిప్పంటించి రైతులు నిరసన

ప్రజాపక్షం / వీపనగండ్ల : వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ధాన్యం కొనుగోలు సరిగ్గా లేక, కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను వెంటనే గోదాములకు తరలించాలని, తడిచిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని కోరుతూ మండల పరిధిలోని కల్వరాలలో గురువారం రైతులు 3 గంటల సేపు రాస్తారోకో నిర్వహించారు. దీంతో వనపర్తి , కొల్లాపూర్ వెళ్లే వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఆరుకాలం కష్టపడి పంటలను పండిస్తే ధాన్యాన్ని అమ్ముకోవడం కష్టతరంగా మారిందని రైతులు వాపోత్నునారు. ప్రతి రోజు ధాన్యం కొనుగోలు చేపట్టి ఎప్పటి కప్పుడు రైస్ మిల్లర్లకు గోదాములకు తరలిస్తే ఇబ్బందులు తప్పుతాయని రైతులు అంటున్నారు. ఐకెపి సిబ్బంది నిర్వాకంతో కొనుగోళ్లు వేగవంతంగా లేకపోవడం, కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను కూడా తరలించకపోవడంతో రైతులు కొనుగోలు కేంద్రాల వద్దనే రాత్రింబవళ్లు కాపలాకాయాల్సి వస్తుందని రైతులు వాపోత్నునారు. కురుస్తున్న భారీ వర్షాల వల్ల కొనుగోలు కేంద్రాల వద్ద పోసిన ధాన్యం, కొనుగోలు చేసి నిలువ ఉంచిన వడ్ల బస్తాలు తడిచి వడ్లు మొలకెత్తాయని రైతులు అంటున్నారు. తడిచి మొలకెత్తిన ధాన్యాన్ని రైతులు రోడ్డుపై పోసి పెట్రోల్ పోసి



నిప్పంటించి నిరసన వ్యక్తం చేశారు. గతంలో కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చిన వెంటనే తేమ శాతాన్ని పరిశీలించి ధాన్యాన్ని కొనుగోలు చేసి ఎప్పటికప్పుడు గోదాములకు తరలించే వారిని, ఈ ప్రభుత్వంలో కొనుగోలు సరిగ్గా కాక తమకు కష్టాలు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. గతంలో 40 కేజీల సంచికి ఒక కేజీ వడ్లు తరుగు తీస్తుండగా ఈమారు అందుకు విరుద్ధంగా రైస్ మిల్లర్లు వడ్లల్లో తాళ్లు ఎక్కువగా ఉందంటూ 40 కేజీల సంచికి మూడు నుంచి నాలుగు కేజీల వరకు తరుగుతీస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు పండించిన ధాన్యంలో ఇప్పటి వరకు 30 శాతం కూడా కొనుగోలు చేయలేదని ఇంకా సుమారు 60 నుండి 70 లారీల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ఉన్నాయని వాపోయారు. ఈ విషయంపై జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిలువ ఉంచిన బస్తాలను వెంటనే తరలించడం జరుగుతుందని, ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తామని హామీనివ్వటంతో రైతులు రాస్తారోకో విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు మాజీ సర్పంచ్ రఘునాథ్ రెడ్డి, నర్సింహారెడ్డి, బాలకృష్ణ, దయాకర్ రెడ్డి, శివయాదవ్ , ఈలకత్తి రాజు, గోపాల్ , సత్యనారాయణగౌడ్ , శాంతయ్య తదితర రైతులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాపక్షం/ధన్వాడ : మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్ల ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ ముజీబ్ తెలిపారు. కళాశాలలో విద్యార్థులకి ఎంపిసి, బైపిసి తెలుగు, ఇంగ్లీష్ మీడియం, సిఇసి,హెచ్ఇసి తెలుగు మీడియంతో పాటు ఇటీవలే తెలంగాణ ఇంటర్మిడియట్ విద్యా శాఖ నూతనంగా ఎంఇసి గ్రూపుకు అనుమతులు ఇవ్వటం జరిగింది. కావున ఈ సువర్ణ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోగలరని కళాశాల ప్రిన్సిపాల్ తెలియజేశారు. అడ్మిషన్ల కోసం సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు +91 9494266258,+91 8247028307, +91 9493006263,+919492581621 సంప్రదించండి.

## మహేష్ పిరమిడ్ క్షేత్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి: మహబూబ్‌నగర్ నియోజకవర్గం హన్వాడ మండలంలోని దాచక్ పల్లి గ్రామంలో గల మహేష పిరమిడ్ క్షేత్రాన్ని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహేష్ పిరమిడ క్షేత్ర ప్రాంగణంలో అహ్లాదకరమైన వాతావరణం ఉందని ఆయన చెప్పారు. అందరూ ధ్యానం చేయడం అలవర్చుకోవాలి అని ఆయన చెప్పారు. ఎన్ని ఒత్తిడులు ఉన్నా ధ్యానం చేయడం ద్వారా సులభంగా ఉపశమనం కలుగుతుంది అని ఆయన అన్నారు. అంతకుముందు మహేష్ పిరమిడ్ క్షేత్ర సభ్యులు ఎమ్మెల్యే ఘనంగా స్వాగతం పలికారు. పిరమిడ్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేయనున్న వంటశాల నిర్మాణానికి తనవంతుగా సహకరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్ పి వెంకటేష్ మారేపల్లి సురేందర్ రెడ్డి, డిసిసి కార్యదర్శి కృష్ణయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వరిధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలి

### జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : జిల్లాలో వరిధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియోకాన్ఫరెన్స్‌హాల్లో వరిధాన్యం కొనుగోలుపై జిల్లా అదనపు కలెక్టర్ అమరేందర్, వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, జిల్లా పౌరసరఫరాశాఖ అధికారులు హైదర్‌అలీ, రాజేందర్, డిఆర్‌డిఓపిడి చిన్న ఓబులేసు, డిసిఓ రఘునాథరావు సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వర్షాలు కురుస్తున్న సందర్భంగా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగంగాపూర్తి చేయాలని



సంబంధిత అధికారులను ఆదేశించారు. రానున్న రెండు రోజుల్లో వర్షాలుపడే సూచన ఉన్నందున రైతులు తగు చర్యలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులకుకావాల్సిన అన్ని సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులకు అవసరమైన సదుపాయాలను అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యం తడవకుండా ఉండేలా టార్పాలిన్లు, పాలిథిన్‌షీట్లు వంటి రక్షణ సామాగ్రిని అందుబాటులో ఉంచాలని, పొలాల్లో ఆరబెట్టిన ధాన్యాన్నివెంటనే సురక్షిత ప్రదేశాలకు తరలించాలని, టార్పాలిన్‌కవర్లతో పూర్తిగా కప్పి ఉంచాలన్నారు. వరిధాన్యం కొనుగోలు విషయంపై తహసీల్దార్‌లతో పర్యవేక్షణ చేయించాలని అధికారులకు సూచించారు. మిల్లర్ల పూర్తిసహాయ సహకారాలు తీసుకోవాలని, లారీ ఓనర్ అసోసియేషన్ సహకారంతో అధిక సంఖ్యలో లారీలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా అవసరమైన సిబ్బందిని పూర్తిగా అందుబాటులో ఉంచాలని, స్థానిక వ్యవసాయ అధికారులు, కేంద్రాల నిర్వాహకులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ పూర్తిచేయాలి

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి: పాలమూరు రంగారెడ్డి , కల్వకుర్తి ఎత్తిపోతల ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి మిగిలిపోయిన భూసేకరణ పనులు వేగవంతం చేయాలని ఉమ్మడిజిల్లా ప్రత్యేక అధికారి జి.రవినాయక్, జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ ఆదేశించారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్లో జిల్లా అదనపు కలెక్టర్ అమరేందర్, జిల్లాసాగునీటి పారుదల అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, ఆర్‌డిఓలు, తహసీల్దార్, సర్వేల్యాండ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల పెండింగ్ పనులు పూర్తిచేయాలన్న కృతనిశ్చయంతో ఉందని, సంబంధితశాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ పూర్తిస్థాయిలో పనులను చేపట్టాలని, నీటిపారుదలశాఖ, రెవెన్యూ, సర్వే అధికారులు పూర్తి సమన్వయంతో పనులను



వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలోని వివిధ ప్యాకేజీలలో జరుగుతున్న పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూసేకరణలో సమస్యలు ఉన్న ప్రాంతాల్లో రెవెన్యూ, నీటిపారుదల అధికారులు సందర్శించి ప్రజలకు గల సందేహాలను నివృత్తిచేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో చేపట్టిన మహాత్మాగాంధీ కల్వకుర్తి, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మార్కండేయ, అచ్చంపేట కర్నేతండా, డిండి ప్రాజెక్టులకోసం అవసరమైన భూసేకరణను జి ల్లాలో ఆయా సాగు నీటి ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు చివరిదశకు అవసరమైన భూసేకరణను వేగవంతం చేయాలని తెలిపారు. భూసేకరణ ప్ర క్రియను తక్షణమే వేగవంతంచేసి, ప్రతిప్రాజెక్టు పురోగతికి ఆటంకంలేకుండా చూడాలని సూచించారు. భూసేకరణలో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను తక్షణమే ఉన్నతాధికారులకు నివేదించాలని, అన్నిశాఖలు పరస్పరం కలిసి పనిచేసి భూసేకరణ ప్రక్రియను సమర్థవంతంగా పూ ర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఈసమీ క్ష సమావేశంలో నీటిపారుదల అధికారులు సిఈ విజయభాస్కర్, ఎస్ఎన్ రెడ్డి, ఈఈలు శ్రీకాంత్, మురళి, ఆర్‌డిఓలు మాధవి, బన్సిలాల్, సురేష్, శ్రీనివాసులు, సర్వే అధికారి సరిత, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

### మండలంలో ఇళ్లు పరిశీలించిన కలెక్టర్ ఆదర్శ్ సురభి



ప్రజాపక్షం / శ్రీరంగాపురం : అర్హత లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లయితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో కింది స్థాయి ఉద్యోగులు పారదర్శకంగా విధులు నిర్వహించాలని, అర్హత కలిగిన వారికి మాత్రమే ఇల్లు మంజూరుకు సిఫారసు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం ఉదయం ఇందిరమ్మ ఇళ్ల జాబితా ప్రకారం క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు శ్రీరంగాపూర్ మండలంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ముందుగా శ్రీరంగాపూర్ మండలంలోని కంభాళాపూర్ గ్రామంలో వడ్ల భారతమ్మ, శైలజ ఇళ్లను పరిశీలించారు. అప్లోడ్ చేసే సమయంలో ప్రస్తుతం ఉంటున్న ఇంటి ఫోటోలు కాకుండా ప్లాట్ వద్ద దిగిన ఫోటోలు ఉండటంతో అనుమానం వచ్చిన కలెక్టర్ ఇల్ల వద్దకు వెళ్లి స్వయంగా పరిశీలించారు. ఉన్న ఇల్లు శిథిలావస్థలో ఉండటంతో భారతమ్మ ఇల్లు కూలగొట్టుకోవడం చూసిన కలెక్టర్ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. శైలజ సైతం ఇందిరమ్మ ఇంటికి అర్హురాలిగా నిర్ధారించారు. అనంతరం శ్రీరంగాపూర్ గ్రామంలో ఇందిరమ్మ నమూనా ఇంటిని పరిశీలించారు. ఉద్యోగులు పారదర్శకంగా పని చేయాలని, క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాక ప్రతిపాదనలు సిఫారసు చేయాలని లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇంచార్జీ యాదయ్య, హౌసింగ్ డిఈ విటోబా, తహసీల్దార్ మురళి, ఎంపీడీఓ రవినారాయణ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు

### అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు



ప్రజాపక్షం / వీపనగండ్ల : ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి వీపనగండ్ల మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ గోదాంలో ధాన్యం బస్తాలను నిల్వ ఉంచుతున్నట్లు అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ గోదాంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు వేగవంతం చేయడం జరిగిందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వకుండా ధాన్యం బస్తాలను ఎప్పటికప్పుడు గోదాంకు తరలించి నిల్వ చేస్తున్నట్లు తెలిపారు. రైతులు ధాన్యాన్ని విక్రయించేటప్పుడు వడ్లలో 14 తేమశాతం , తాళ్లు, మట్టిలేకుండా చూడాలని సూచించారు. తరుగు పేరుతో మిల్లర్లు వేదిస్తున్నారని 40 కేజీల బస్తాకు మూడు నుంచి నాలుగు కేజీల వరకు తాళ్ల పేరుతో తరుగు తీస్తున్నారని, రైతులు ఒప్పుకోకుంటే మిల్లర్లు ధాన్యం బస్తాలను దించుకోవడం లేదని రైతులు అదనపు కలెక్టర్‌తో మొరపెట్టుకున్నారు. భారీ వర్షాలు కురుస్తుండటంతో ధాన్యం తడిసి రై తులు ఇబ్బంది పడుతున్నారని కొనుగోలు వేగవంతం కావాలంటే పక్క గ్రామాల హమాలీలను తీసుకువచ్చి వేగంగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి జగన్మోహన్ , తహసీల్దార్ వరలక్ష్మి , ఆర్ఐ కురుమయ్య, బుచ్చన్న తదితరులు ఉన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో అందరికీ సంక్షేమ ఫలాలు



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : ప్రజా ప్రభుత్వంలో అందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ అర్బన్ మండలానికి 73 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ , షాది ముబారక్ చెక్కులను క్యాంపు కార్యాలయంలో అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో పాటు రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇచ్చామని, సన్న వడ్లు పండించిన రైతులకు బోనస్ ఇచ్చామని ఆయన గుర్తు చేశారు. ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని ఆయన చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి సంవత్సరం 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయి అని తెలిపారు. రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ప్రజా ప్రభుత్వానికి అండగా ఉండాలని, కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టి పిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మ ణ్ యాదవ్, మార్కెట్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన షబ్బీర్ అహ్మద్, పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వహక అధ్యక్షులు అజ్మత్ అలి . అవేజ్, సంజీవ రెడ్డి, ప్రవీణ్ కుమార్, అబ్దుల్ హక్, తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో విపత్తునైనా ఎదుర్కోవాలి : కలెక్టర్ సిక్తా పట్నాయక్

ప్రజాపక్షం/ నారాయణపేట్ : వర్షాకాలంలో ఎలాంటి నష్టం జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్ ఛాంబర్ హాల్లో ఎస్పీ యోగేష్ గౌతమ్‌తో కలిసి వర్షాకాలంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో రోడ్డు కల్వర్టులు వాటి పటిష్టతపై రిపోర్ట్ ఇవ్వాలన్నారు. ఎలాంటి నష్టం రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ శాఖకు సంబంధించి విద్యుత్ స్తంభాలు వైర్లు తదితర వాటిపై సమీక్షించుకోవాలన్నారు. డిపిఓ గ్రామపంచాయతీ పరిధిలో ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు పాత ఇళ్ళను గుర్తించి ప్రత్యామ్నాయం చూపాలన్నారు. వ్యవసాయ శాఖ సంబంధిత పంటలపై నివేదికలు తయారు చేయాలన్నారు. ఎస్‌పి యోగేస్ గౌతమ్ మాట్లాడుతూ గత సంవత్స రం మద్దూరు మరికల్లో వర్షాలు అధికంగా నమోదు కావడం వల్ల వెంటనే స్పందించి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకున్నామని తెలిపారు. అందరు అధికారులు అలెర్ట్ గా ఉండాలి, అందరు అధికారులు హెడ్ క్వార్టర్ మెయింటైన్ చేయాలి అని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు జడ్‌పిసిఇఒసిపిఓ ఇరిగేషన్ అధికారులు, పిఆర్. అధికారులు, ఆర్‌అండ్ బి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## తొలి సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ 137వ జయంతి

### జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

ప్రజాపక్షం/ నారాయణపేట్ : అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన గొప్ప సంఘసంస్కర్త భాగ్య రెడ్డి వర్మ అని నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం కలెక్టరేట్ ప్రజావాణిలో భాగ్యరెడ్డి వర్మ 137 జయంతి ఉత్సవంలో పాల్గొని భాగ్య రెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్, లోకల్‌బాడీ సంచిత్ గంగ్వర్, ఆర్డీవో రామచందర్, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి ఉమాపతి, ఎస్‌సి.కార్పొరేషన్ ఇడి. అబ్దుల్ ఖలీల్, డిపిఆర్ఓ రషీద్, ఏవో జయసుధ, వెంకటేష్ సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.



మహబూబ్ నగర్ ప్రతినిధి :గురువారం జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో భాగ్యరెడ్డి చిత్రపటానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహ న్ రావులు పూలమాలలు వేసి నివాళులుఅర్పించారు.

ఫోకస్

# వ్యవసాయం



# కొండ ప్రాంతాల్లో పంటలు

## స్థూలంగా భారత వ్యవసాయ రంగం..

భారత వ్యవసాయ రంగాన్ని పరిశీలిస్తే, కొన్ని విశేషాలు కనిపిస్తాయి. మనది ప్రపంచంలో రెండవ అతిపెద్ద వ్యవసాయ దేశం. చైనా తర్వాత భారత్ వ్యవసాయ ఉత్పత్తుల పరంగా ప్రపంచంలో రెండవ స్థానంలో ఉంది. భారత జనాభాలో 50 శాతం మంది రైతులే. సుమారు 50 శాతం మంది ప్రజలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వ్యవసాయం మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, గోదావరి నది తీరాలను 'రైస్ బౌల్ ఆఫ్ ఇండియా'గా పిలుస్తారు. దేశానికి బియ్యాన్ని సమకూర్చే ముఖ్యమైన ప్రదేశాలు ఇవే. భారతదేశం ప్రపంచంలో అత్యధికంగా ఉత్పత్తి చేసే పంటల్లో



పప్పు దినుసులు, జౌళి, మామిడి పండ్లు, అరటి పండ్లు వంటివి ఉన్నాయి. వరి, గోధుమ దేశవ్యాప్తంగా ఎక్కువగా పండించే పంటలు. దేశంలో వ్యవసాయ ప్రాధాన్యత గల రాష్ట్రాల విషయానికి వస్తే, గోధుమ ఉత్పత్తిలో పంజాబ్ నెంబర్ వన్‌గా ఉంది. బియ్యం ఉత్పత్తిలో పశ్చిమ బెంగాల్ అగ్రగామి. పత్తి, కంది ఉత్పత్తిలో మహారాష్ట్ర ముందంజలో ఉంది. డాక్టర్ ఎం.ఎ. స్వామినాథన్ నడిపిన గ్రీన్ రెవల్యూషన్ (హరిత విప్లవం) ఉద్యమం, 1960 దశకాల్లో భారత వ్యవసాయ ఉత్పత్తిని విపరీతంగా పెంచింది. చైనా తర్వాత, అత్యధికంగా రసాయన ఎరువులు వినియోగించే దేశం భారత్. ఈ విఃయంలో మనది రెండో స్థానం. భారతదేశంలో సుమారు 60 శాతం వ్యవసాయం వర్షపాతంపై ఆధారపడినదే. సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులే ఇప్పటికీ అనుసరించడం కూడా కనిపిస్తుంది. చాలా మంది రైతులు పూర్వీకుల నుంచి వచ్చిన పద్ధతులు, అనుభవాలపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. ఇది శాస్త్రీయ పద్ధతుల నిర్వహణలో అవరోధంగా మారుతున్నది. కిసాన్ క్రెడిట్ కార్డు (కెసిసి): రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన చిత్తశుద్ధి చర్య. భారతదేశం ప్రపంచంలోని అతిపెద్ద ఆర్గానిక్ ఉత్పత్తిదారులలో ఒకటి. ముఖ్యంగా మిల్లెట్స్, స్పైసెస్, టీ విభాగాల్లో మన దేశం ప్రముఖ స్థానాన్ని ఆక్రమించింది. భారత వ్యవసాయ రాష్ట్రపాలనలో ప్రధాన భాగంగా ఉండటంతో, ఇది సమాఖ్య విధానంలో రాష్ట్రాల బాధ్యత కిందకు వస్తుంది.



దేశ వ్యాప్తంగా కొండ ప్రాంతాల్లో వ్యవసాయం అనేది ప్రత్యేక భౌగోళిక, వాతావరణ పరిస్థితుల మధ్య సాగుతున్నది. ఇది సమతల ప్రాంతాల వ్యవసాయంతో పోలిస్తే భిన్నంగా ఉంటుంది. కొండ ప్రాంతాల్లో వ్యవసాయానికి ప్రత్యేక విధానాలు అవలంబిస్తారు. టెర్రేస్ ఫార్మింగ్ (అవతల గట్ల పద్ధతి) అనేది వీటిలో ఒకటి. కొండల కింద భాగాల్లో మెట్లలా నేలని మలచి వ్యవసాయం చేస్తారు. ఇది మట్టిని వర్షపు నీటితో పోయిపోకుండా కాపాడుతుంది. ముఖ్యంగా హిమాలయ ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాలు, దక్షిణ భారత కొండ ప్రాంతాల్లో చరిత్రాత్మకంగా వినియోగంలో ఉంది. రెండోది జూమ్ సాగు లేదా షిఫ్టింగ్ కల్టివేషన్. ఇది ప్రత్యేకించి ఉత్తరతూర్పు రాష్ట్రాల్లో (ఉదా: నాగాలాండ్ మిజోరాం) ప్రాముఖ్యం పొందిన పద్ధతి. అడవి భాగాన్ని కత్తిరించి, అచ్చుదాన్ని తగలబెట్టి అక్కడ పంటలు సాగిస్తారు. కొన్ని సంవత్సరాల తర్వాత ఆ భూమిని వదిలి, మరో ప్రాంతానికి మారుతారు. కొండ ప్రాంతాల్లో వాతావరణం చల్లగా ఉండటం వల్ల తక్కువ ఉష్ణోగ్రతలను తట్టుకునే పంటలు పండిస్తారు. ముఖ్యంగా చిరు ధాన్యాలు (జొన్నలు, సజ్జలు), జవిటిల్, బార్లీ, మక్కజొన్న, ఆపిల్, అంగూర్లు, పీచెస్ వంటి శీతలప్రియ పండ్లు, టీ, కాఫీ, ఎల్లాచీ, మిరియాలు వంటి తోటల సాగు. కొండ ప్రాంతాల వ్యవసాయానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ వ్యవసాయం ప్రత్యేకంగా ఉత్పత్తి అయ్యే ఆర్గానిక్ పద్ధతులకు అనుకూలంగా ఉంటుంది. అందుకే దీనిని ఎకోఫ్రెండ్లీ వ్యవసాయానికి నిలయంగా పేర్కొంటారు. ఆవాస జీవజాలం, అరణ్య సంపదపై ఆధారపడే జీవన విధానం. అయితే, ఈ తరహా వ్యవసాయం కొన్ని సవాళ్లు ఎదుర్కొంటున్నది. నేల ఎరువు లేకపోవడం అతిపెద్ద సమస్య. కొండ ప్రాంతాల్లో మట్టికి పోషక విలువలు తక్కువగా ఉంటాయి. పైన భాగాలలో నీటి నిల్వకలేకపోవడం వల్ల నీటి కొరత తప్పదు. పంట ఉత్పత్తులను మార్కెట్లకు సరఫరా చేయడం కూడా చాలా కష్టం. రవాణా సమస్య తలెత్తుతుంది. వాతావరణ మార్పుల ప్రభావం కూడా ఈ వ్యవసాయంపై ఎక్కువగా ఉంటుంది. గాలి తాకిడి, వర్షపు వేగం వల్ల నేల కొరత, మట్టి క్షయం తప్పవు. పారంపర్య విధులపై ఆధారపడటం ఫలసాయం తగ్గడలకు కారణమవుతున్నది. శాస్త్రీయ పద్ధతులకి మారడం నెమ్మదిగా జరుగుతోంది. వివిధ రాష్ట్రాలు/ ప్రాంతాలను పరిశీలిస్తే, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లో, ఆపిల్, కాఫీ. నాగాలాండ్, మిజోరాం, మేఘాలయలో వివిధ రకాల పండ్లు, అరుణాచల్ ప్రదేశ్‌లో మిరియాలు, ఆర్గానిక్ పండ్లు, తమిళనాడులోని ఊటీ, కొడైకెనాల్‌లో టీ, స్ట్రాబెర్రీలు ఎక్కువగా పండుతాయి. ఆంధ్రప్రదేశ్‌లోని శేషాచలం వంటి అరణ్య పర్వత ప్రాంతాల్లో మిరియాలు, కాఫీ పంటలు ఎక్కువ. కొండ ప్రాంత వ్యవసాయం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కొన్ని చర్యలు అత్యవసరం. వర్షం నీటిని ఒడిసిపట్టడం అందులో ఒకటి. రైన్ వాటర్ హార్వెస్టింగ్‌కు ఇటీవల కాలంలో ప్రాధాన్యం పెరిగింది. అదే విధంగా డ్రిప్ వంటి మైక్రో ఇరిగేషన్ పద్ధతులు ఉపయుక్తంగా ఉంటాయి. సౌరశక్తిని ఆధారంగా తీసుకున్న వ్యవసాయ పరికరాలు వాడడం మంచిది. సమర్థమైన మార్కెటింగ్ వల్ల గ్రామీణ రైతులకు మార్కెట్ కనెక్టివిటీ ఏర్పడుతుంది.



### రాష్ట్రాల వారీగా ప్రధాన పంటలు..

**బియ్యం (ధాన్యం)..**
పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, బీహార్ రాష్ట్రాలు బియ్యం ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్నాయి.
**సాగు విస్తీర్ణం:** దేశవ్యాప్తంగా సుమారు 4345 మిలియన్ హెక్టార్లలో సాగు జరుగుతుంది.
**దిగుబడి:** సగటున హెక్టార్‌కు 2.5 టన్నుల నుంచి 3.5 టన్నుల మధ్య దిగుబడి వస్తోంది. పంజాబ్ వంటి రాష్ట్రాల్లో ఇది 4 టన్నుల వరకు ఉంటుంది.

**గోధుమ**
ఉత్పత్తిలో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయి.
**సాగు విస్తీర్ణం:** సుమారు 30మిలియన్ హెక్టార్లలో సాగు.
**దిగుబడి:** హెక్టార్‌కు 3 టన్నుల నుండి 4 టన్నుల వరకు ఉంటుంది. హర్యానాలో ఇది 4 టన్నులకు పైగా ఉంటుంది.

**పత్తి**
పత్తి ఎక్కువగా ఉత్పత్తి చేసే రాష్ట్రాలు గుజరాత్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్
**సాగు విస్తీర్ణం:** సుమారు 12 మిలియన్ హెక్టార్లు.
**దిగుబడి:** సగటున హెక్టార్‌కు 500 నుంచి 600 కిలోల పత్తి వస్తుంది. గుజరాత్‌లో ఇది ఎక్కువ.

**పప్పుధాన్యాలు (శెనగ, మినుము, తూర్దాల్ మొదలైనవి)**
**ఉత్పత్తి రాష్ట్రాలు:** మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ
**సాగు విస్తీర్ణం:** 25 మిలియన్ హెక్టార్ల వరకు.
**దిగుబడి:** సాధారణంగా హెక్టార్‌కు 700 కిలోల నుండి 1000 కిలోల వరకు.



### వర్షపాతం కీలకం ...



ఉత్తరభారత రాష్ట్రాల్లో రబీ పంటలు వర్షంపై తక్కువగా ఆధారపడతాయి – కాలువల ద్వారా సాగు.
మధ్య, దక్షిణ భారత రాష్ట్రాలు ఖరీఫ్ పంటలకు వర్షపాతంపై ఎక్కువగా ఆధారపడతాయి.
**ఉదాహరణకు:**
తెలంగాణలో సగటు వర్షపాతం 900–1100 మిమీ.
పంజాబ్‌లో 600 మిమీ వద్ద సాగునీటి ఆధారంగా సాగు.
కేరళలో 3000 మిమీ వరకు అధిక వర్షపాతం.

### ఉత్పత్తుల ఎగుమతి..



**బియ్యం ఎగుమతులు :**
ప్రతి సంవత్సరం సుమారు 18 మిలియన్ మెట్రిక్ టన్నుల వరకు బియ్యం ఇతర దేశాలకు ఎగుమతి అవుతుంది.
**పప్పుదాన్యాలు:**
దేశీయ వినియోగం ఎక్కువగా ఉండడంతో దిగుమతులు కూడా ఉంటాయి.
**మసాలా ఉత్పత్తులు:**
మిరప, ఇంగువ, ధనియాల వంటివి ముఖ్యంగా USA, మిడిల్ ఈస్ట్ దేశాలకు ఎగుమతి అవుతుంటాయి.

### సాగు పద్ధతుల మార్పు..



సేంద్రియ వ్యవసాయానికి సంబంధించిన గణాంకాల ప్రకారం, ఉత్తరాఖండ సిక్కిం రాష్ట్రాలు ఈ తరహా సాగులో ముందున్నాయి. సిక్కిం పూర్తిగా సేంద్రియ వ్యవసాయ రాష్ట్రంగా ప్రకటించుకుంది. మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో డ్రిప్ ఇరిగేషన్, మైక్రో ఇరిగేషన్ వినియోగం పెరుగుతోంది. దీని వల్ల హెక్టార్‌కు నీటి వినయోగం 40 నుంచి 50 శాతం వరకూ తగ్గే అవకాశం ఉంది.

---

## 'ఆపరేషన్ కగార్'పై సమగ్ర న్యాయ విచారణ చేపట్టాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



**ప్రజాపక్షం/షాబాద్ :** ఆపరేషన్ కగార్‌పై సమగ్ర న్యాయ విచారణ చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. గురువారం చేవేళ్ల మండల కేంద్రంలో జనసేవదళ్ గోడ పత్రికను నియోజకవర్గ సిపిఐ నాయకులతో కలసి అవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ నెల 26 నుండి 31 వరకు చేవెళ్ల పట్టణ కేంద్రంలో జనసేవదళ్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని సిపిఐ నాయకులు, కార్యకర్తలు తప్పని సరిగా రావాలని పేర్కొన్నారు. దేశంలో మతోన్మాదులు చేస్తున్న అరాచకాలను అంతం చేసేందుకు దేశ ప్రజలందరూ ఐక్యత కావాలని చెప్పారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదులను అంతం చేసి దేశ రక్షణకు కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, సిపిఐ కార్యదర్శులు సత్తి రెడ్డి, నక్కల జంగయ్య, సుధీర్, శ్రీనివాస్, జిల్లా నాయకులు మక్భూల్, సిపిఐ జిల్లా మహిళ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, రైతు సంఘం రాష్ట నాయకులు సుధాకర్ గౌడ్, ఏఐటీయూసీ మండల నాయకులు శివ జిల్లా కార్యవర్గ సభ్యులు గోపాల్ రెడ్డి, మోహినోధిన్ తదితరులు ఉన్నారు.

## బూటకపు ఎన్‌కౌంటర్లను ఆపాలి

మావోయిస్టులను శాంతి చర్చలకు పిలవాలి: పి.సుధాకర్

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** కార్పొరేట్ శక్తులకు ఖనిజ సంపద దోచి పెట్టడానికి కగార్ అని, బూటకపు ఎన్‌కౌంటర్లు ఆపి శాంతి చర్చలకు పిలవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుదాకర్ అన్నారు. గురువారం సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో మావోయిస్టులను, వామపక్ష భావజాలాన్ని అంతం చేయడమే లక్ష్యంగా కేంద్రంలో మోడీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం, ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షా, ఆపరేషన్ కగార్ చేపట్టి బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారన్నారు. దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడానికి మావోయిస్టులు చర్చలకు సిద్ధమని కేంద్రప్రభుత్వానికి బహిరంగంగానే తెలిపినప్పటికి కార్పొరేట్ శక్తులకు సహజ సంపదను, అడవుల్లోని ఖనిజ సంపదను దోచిపెట్టడానికి దుర్మార్గపు వైఖరిని ప్రదర్శిస్తున్నారన్నారు. కగార్ పేరుతో మావోయిస్టులతోపాటు ఆదివాసులపై బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎన్నుకున్న మార్గాన్ని పక్కనపెట్టి, చర్చలకు సిద్ధమైన మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. చత్తీస్‌గఢ్ ప్రజలకు సంఘీభావంగా నిలబడాల్సిన అవసరమున్నదని ఆపరేషన్ కగార్‌పై స్వతంత్ర న్యాయవిచారణ జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా నాయకులు ముత్యాలు, హనుమాండ్లు, రంజిత్, ఫిరోజ్ అలీ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ భూములను దళితులకు పంచాలి

ఎన్‌కౌంటర్‌లన్నీ ప్రభుత్వ హత్యలే
సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** ప్రభుత్వ మిగులు భూములను దళితులకు పంచాలి. దేశ వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలను అరికట్టాలని, దళితుల హక్కుల కోసం పటిష్ఠంగా తీసుకువచ్చిన అనేక చట్టాలు అమలు కాకుండా దళితుల జీవితాలు దుబ్బరంగా ఉన్నాయని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రెండవ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం సమావేశం శివనగర్ తమ్మెర భవనంలో సంగి ఎలేందర్ అధ్యక్షతన సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్నికల సందర్భంగా దళితులకు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో దళితులకు సాగుభూమి నివాసయోగ్యమైన భూములను ఇస్తామని వాగ్ధానం చేసింది. దాని అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆయన కోరారు. బాబా సాహెబ్ అంబేద్కర్ అందించిన హక్కులు, ఆవకాశాలను బిక్షగా కాకుండా హక్కుగా ప్రభుత్వాలు, అధికారులు అమలు చేసే విధంగా డిహెచ్‌పిఎస్ కార్యకర్తలు అంకిత భావంతో పనిచేయాలన్నారు. చట్ట ప్రకారం మావోయిస్టులను అరెస్టు చేసిన వారిని న్యాయస్థానంలో ప్రవేశపెట్టకుండా చట్టాన్ని చేతులకు తీసుకొని అతి ఘోరంగా హత్య చేస్తున్నారని విమర్శించారు. మావోయిస్టులు ఒక వైపు బేషరత్తుగా చర్చలకు సిద్ధమని చెబుతున్న మోదీ కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను అందించడానికి మావోయిస్టుల పైన తీవ్రమైన నిర్బంధాన్ని పెంచుతుందన్నారు. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ దళిత హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర రెండవ మహాసభలు జులై 7, 8 తేదీల్లో వరంగల్ నగరంలో నిర్వహిస్తామని, ఈ మహాసభల విజయవంతం కోసం అశేష ప్రజానీకం సహాయ సహకార అందించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి భాష్మియా , పనస ప్రసాద్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, రాష్ట్ర అధ్యక్షులు ఏసురత్నం, వర్కింగ్ ప్రెసిడెంట్ తళ్లపల్లి లక్ష్మ ణ్, జాతీయ సమితి సభ్యులు సలిగంటి శ్రీనివాస్, బోయిని అశోక్, పొన్నగంటి లావణ్య, రాష్ట్ర సమితి సభ్యులు ధనలక్ష్మి , జిల్లా కార్యదర్శి జన్నురవి తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మాటికీ అవి ప్రభుత్వ హత్యలే

శాంతి చర్చలపై ఎందుకు స్పందించరు
ఎన్‌కౌటర్లపై న్యాయ విచారణ జరిపించాలి
రాజకీయ ప్రజా, హక్కుల సంఘాల డిమాండ్



**ప్రజాపక్షం/ఖమ్మం :** దండకారుణ్యంలో ఎన్‌కౌంటర్ల పేరుతో చేస్తున్న హత్యలన్ని ముమ్మాటికి ప్రభుత్వ హత్యలేనని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, హక్కుల సంఘాల బాధ్యులు ఆరోపించారు. ప్రభుత్వం ఎన్‌కౌంటర్ల పేరుతో రాజ్యహింస కొనసాగిస్తుందని పట్టుకొచ్చి కాల్చి చంపుతున్నారని వారు తెలిపారు. గురువారం స్థానిక మంచికంటి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాజకీయ, వివిధ సంఘాల బాధ్యులు మాట్లాడుతూ నంబాల కేశవరావు అలియాస్ బసవ రాజుతో పాటు 27 మంది మరణించిన ఘటనకు సంబంధించి సుప్రీం కోర్టు న్యాయమూర్తితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మూడు నెలలుగా మావోయిస్టు పార్టీ శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటిస్తుంటే కేంద్రం ఎందుకు స్పందించడం లేదని వారు ప్రశ్నించారు. గతంలో నాగాలాండ్, మిజోరాం తదితర ప్రాంతాల తీవ్రవాద గ్రూపులతో చర్చించిన ప్రభుత్వం ఇప్పుడు ఎందుకు స్పందించడం లేదని దీని వెనుక అపారమైన అటవీ, ఖనిజ సంపదను గుజరాత్ కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్ర దాగి ఉందని వారు తెలిపారు. మేము కాల్పుల విరమణ ప్రకటించాం చర్చలకు సిద్ధంగా ఉన్నామని చెప్పినా కేంద్ర ప్రభుత్వం ఎందుకు అంతర్గత యుద్ధానికి పాల్పడుతుందో చెప్పాల్సి ఉందన్నారు. మధ్య భారతంలో ఒక తెగను అంతం చేసే కుట్రకు మోడీ, అమిత్‌షా తెర లేపారని అందుకే సరిహద్దుల్లో యుద్ధం చేయాల్సిన సైన్యం ఆదివాసీ ప్రజలతో అంతర్గత యుద్ధం చేస్తుందని వారు తెలిపారు. నంబాల కేశవరావును హత్య చేయడం అతి పెద్ద సంబురంగా కేంద్ర ప్రభుత్వం భావిస్తుందని ఇది సరైన వైఖరి కాదని ఈ వికట్టాహాసం నర హంతకులు, నియంతల మాదిరి ఉందని వారు తెలిపారు. ప్రజలు, ప్రజా సంఘాలు మరింత చైతన్య వంతులై ప్రభుత్వ తీరుకు నిరసనగా ఉద్యమించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, ఎన్డీ కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్, సిసిపి నాయకులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## బునాదిగాని కాలువ పనులు పూర్తి చేసి సాగునీరు అందించాలి


యాదాద్రి జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు



**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** పెండింగ్‌లో ఉన్న బునాది కాలువ పనులను ప్రారంభించి రైతులకు సాగునీరు అందించాలని సిపిఐ పార్టీ కౌన్సిల్ సమావేశం లో జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొంతకాలంగా పనులు జరిగిన పూర్తిస్థాయిలో జరుగక సాగునీరు అందించకపోవడంతో ఈ ప్రాంత రైతులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని, బడ్జె ట్లో నిధులు కేటాయించిన పనులు ప్రారంభించడం లేదని, వెంటనే పనులను పూర్తి చేసి సాగునీరు అందించాలని ఆయన కోరారు. గ్రామాలలో పార్టీని బలోపేతం చేయాలని పార్టీ నాయకులకు సూచించారు. అంబోజు రాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుల ముత్యాలు, మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం, మండల పార్టీ నాయకులు యాస బుచ్చిరెడ్డి, జల్ది రాములు, పాశికంటి లక్ష్మి నరసయ్య, చెక్క దయాకర్ రెడ్డి, గుర్రం రాజమణి, సుల్తాన్ పురుషోత్తం, సోలిపురం లింగారెడ్డి, ఎండి నయీమ్, బత్తిని లింగయ్య పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ఎర్రజెండా ముందు

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి



**ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి:** ప్రజా సమస్యలు పరిష్కారానికి ఎర్రజెండా ఎల్లప్పుడు ముందుండి పోరాడుతుందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని మునావత్ తండాలో నూతన సిపిఐ గ్రామ శాఖను ఏర్పాటు చేసిన సందర్భంగా సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్రజెండా అధికారంలో ఉన్న లేకున్నా ప్రజల పక్షాన నిలబడిన ఎర్రజెండా వంద సంవత్సరాల ప్రస్థానంలో ప్రజల గుండెల్లో నిలిచిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు.నియోజవర్గంలోని పలు మండలాల్లో గల లిఫ్ లను ప్రభుత్వం త్వరగతిన పూర్తి చేసి ఈ ప్రాంత ప్రజలకు సాగునీరు అందించాలని కోరారు.అనంతరం నూతన గ్రామ శాఖను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది కార్యదర్శిగా యంమోహన్ సహాయ కార్యదర్శిగా రాంజీ తో పాటు మరో పద కొండు మందితో ఎన్నుకోవడం జరిగింది.ఈ సమావేశంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామావత్ అంజయ్య నాయక్,మండల కార్యదర్శి కుంభం జయరాములు గౌడ్,మండల కార్యవర్గ సభ్యుడు అలుగుబెల్లి భాస్కర్ రెడ్డి,నాయకులు రాచమల్ల గోవిందు రాజ,కాంతారావు,మునావత్ శక్రు హనుమంతు,రవి,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### అక్కంపల్లి లో సిపిఐ గ్రామ శాఖ సమావేశం

మండలంలోని అక్కంపల్లి సిపిఐ గ్రామ శాఖ సమావేశం మాధవరెడ్డి కాలనీలో గురువారం నిర్వహించారు.ఈ సమావేశంలో మండల కార్యదర్శి కుంభం జయరాములు గౌడ్ గ్రామ కార్యదర్శి ఎం.వెంకటయ్య ,బాసిపాక వెంకటయ్య, ఎం.హనుమంతు ఎం.దేవయ్య,ఎం.రామచంద్రం ఎం.యేసు బి. అంజయ్య ఎం.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ప్రజల పక్షాన నిలబడితే.. అరెస్టులా : కార్పొరేటర్ శ్రీవాణి



**ప్రజాపక్షం/సరూర్‌నగర్:** ప్రజల పక్షాన నిలబడి పోరాడితే అక్రమ అరెస్ట్ చేయడం సరికాదని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి ప్రభుత్వాన్ని తీరుపై మండిపడ్డారు. గురువారం కొత్తపేట విజయ హోంలో నిర్వహించబోయే మిస్ వరల్డ్ కాంటెస్టెంట్స్ పర్యటన నేపథ్యంలో సరూర్‌నగర్ కార్పోరేటర్ శ్రీవాణిని సరూర్‌నగర్ పోలీసులు ముందస్తు ఆరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేటర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్‌లో జరుగుతున్న కార్యక్రమానికి నన్ను ఆహ్వానించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయించిందని ఆరోపించారు. ఇది ప్రజల ప్రభుత్వం కాదని, ప్రశ్నలకే భయపడే ప్రభుత్వం అని అన్నారు.

## శిల్పారామాన్ని సందర్శించిన అందాల భామలు



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** ప్రపంచ అందాల పోటీలలో పాల్గొంటున్న సుందరిమణులు గురువారం ఉదయం మాదాపూర్‌లోని శిల్పారామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ప్రపంచ సుందరీమణులకు శిల్పారామం ప్రధాన ద్వారం వద్ద స్వాగతం పలికారు. బంజారా నృత్యాలతో, మొక్కలతో అందాల భామలకు స్వాగతం పలికారు. అనంతరం సుందరిమణులు మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఆ తరువాత శిల్పారామంలోని ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తిలకించి నృత్య ప్రదర్శనలతో కోలాహలంగా ఆటలు ఆడారు. మహిళా శక్తి బజారులో స్టాల్స్‌ను రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కతో కలిసి తిలకించారు. మహిళా శక్తి గురించి, మహిళ గ్రూప్ ల గురించి వారు సాధిస్తున్న విజయాల గురించి సెర్ప్ సిఇఒ దివ్య వారికి వివరించారు. శిల్పారామంలో కుండలు తయారు చేసే విధానాన్ని ఆసక్తిగా పరిశీలించారు. కార్యక్రమంలో శిల్పారామం ఇంచార్జ్, అధికారులు పాల్గొన్నారు.

## వర్షాకాలం నేపద్యంలో జాగ్రత్తలు పాటించాలి : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/సరూర్‌నగర్:** ప్రస్తుత వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు కూడా తమవంతు విధిగా జాగ్రత్తలు పాటిస్తూ ఉండాలని ఎల్‌బినగర్ నియోజక వర్గం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. గురువారం గడ్డిఅన్నారం, చంపాపేట డివిజన్ పరిధిలలో బుధవారం కురిసిన భారీ వర్షాల కారణంగా ముంపు గురైన న్యూ గడ్డిఅన్నారం ప్రాంతాలను మాజీ కార్పోరేటర్ భవాని ప్రవీణ్‌కుమార్ తో పలువురు నాయకులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ న్యూ గడ్డిఅన్నారం ప్రాంతంలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవడం జరిగిందన్నారు. డ్రైన్స్ నందు పేరుకుపోయిన సిల్ట్ తీయించడంతో పాటు డ్రైన్స్ లింకప్ పనులు కూడా చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గద్దగంటి రమేష్‌ముదిరాజ్, ప్రధీప్‌గౌడ్ డివిజన్ అధ్యక్షులు జక్కుల శ్రీశైలం యాదవ్, ఎలిగేటి కృష్ణ, ప్రదీప్‌గౌడ్ పాల్గొన్నారు.

## రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుంది



**ప్రజాపక్షం/కొందుర్గు:** రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కట్టుబడి పని చేస్తుందని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటి ఉపాధ్యక్షుడు తుమ్మలపల్లి జితేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని రేగడి చిల్కమర్రి గ్రామంలో లోవోల్టేజీ సమస్యను తీర్చేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ రేగడిచిల్కమర్రి గ్రామంలో విద్యుత్ లోవోల్టేజీ సమస్యతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మీద ఎక్కువ లోడు పడుతుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి దృష్టికి తీసుకువెళ్ళినట్లు తెలిపారు. ఇందుకు యుద్ధ ప్రాతిపదికన లోవోల్టేజీ సమస్యను నియంత్రించేందుకు తక్షణమే నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించడంతోపాటు బిగించి రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పురుషోత్తంరెడ్డి, రైతులు రవీందర్‌రెడ్డి, అంజిరెడ్డి, శ్రీనివాస్, బాల్‌రెడ్డి, రమేష్, శివకుమార్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, మహేందర్ అనంతయ్య, శాంతమ్మ, కృష్ణయ్య, నర్సింలు, గిరయ్య, మల్లయ్య, పోషయ్యలు పాల్గొన్నారు

## రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తున్న ఘనత కాంగ్రెస్‌దే

కొందుర్గు సింగిల్ విండో చైర్మన్ చిట్టెం దామోదర్‌రెడ్డి



**ప్రజాపక్షం/కొందుర్గు:** రైతులు పండించిన పంటలను గిట్టుబాటు ధర కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కొందుర్గు సింగిల్ విండో చైర్మన్ చిట్టెం దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని ముట్పూర్ గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మెన్ దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరిధాన్యం గ్రామంలోనే విక్రయించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని వివరించారు. ముట్పూర్ నుండి మండల కేంద్రానికి, షాద్‌నగర్‌కు తీసుకువెళ్ళాలంటే రవాణా ఖర్చులు పెరిగిపోతాయని, రైతు శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని గ్రామంలోనే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. మధ్య వర్తులకు, దళారీలకు విక్రయించకుండా నేరుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే విక్రయించి మద్దతు ధరతోపాటు బోనస్‌ను పొందాలని సూచించారు. కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, తూంపల్లి రాచంద్రయ్య, ఎంపిటిసి తనయుడు అంజిరెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షుడు బోరిగే నరేందర్, నాగులపల్లి శివకుమార్, రవి, నేతలు నర్సింలు, గోపాల్, అంతిరెడ్డి, రాజు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో విగ్రహాల తరలింపు

రాంనగర్ - బాగ్‌లింగంపల్లి మల్టీలెవల్ ఫ్లైఓవర్ నిర్మాణం విరమణ

స్థాయిసంఘం సమావేశంలో కీలక నిర్ణయాలు ఆమోదించిన సభ్యులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జాతీయ నేతలు మహాత్మా గాంధీ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాలతో పాటు మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను ఇతర ప్రదేశాలలో ఏర్పాటు చేయాలని జిహెచ్ఎంసి స్థాయిసంఘం సమావేశం నిర్ణయించింది. ఆస్థలంలో ఫౌంటెన్ నిర్మించాలనే ప్రతిపాదనకు సమావేశం ఆమోదం తెలిపింది. 2010లో బండ కార్తీకరెడ్డి మేయర్‌గా ఉన్నప్పుడు వైఎస్ఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అందుకు పోటీగా అప్పటి టిడిపి కార్పొరేటర్లు మహాత్మా గాంధీ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అయితే విగ్రహాల ఏర్పాటు అంశం వివాదస్పందం కావడంతో ఆవిష్కరణకు నోచుకోలేదు. అప్పటి నుంచి విగ్రహాలు ముసుగులతోనే దర్శనమిస్తున్నాయి. తాజాగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం జరిగిన స్థాయిసంఘం సమావేశంలో విగ్రహాలను ఇతర ప్రదేశాలకు తరలించాలనే ప్రతిపాదన తీర్మానాన్ని ఆమోదించారు. సమావేశంలో14 అంశాలు, 3 అంశాలకు సభ్యులు ఆమోదించినట్లు మేయర్‌తెలిపారు.

**రాంనగర్-బాగ్‌లింగంపల్లి ఫ్లైఓవర్ నిర్మాణంపై వెనక్కు?** రాంనగర్ బాగ్‌లింగంపల్లి మధ్యలో నిర్మించాలని తలపెట్టిన మల్టీలెవల్ ఫ్లైఓవర్ నిర్మాణాన్ని జిహెచ్ఎంసి విరమించుకుంది. ఈ ఫ్లైఓవర్ కోసం పరిపాలనా అనుమతులు జారీ చేసిన నిధులు రూ.426 కోట్లను, ఇందిరా పార్కు నుంచి బాగ్‌లింగంపల్లి చౌరస్తా(విఎస్‌టి కూడలి) వరకు చేపట్టిన స్టీల్ బ్రిడ్జీ నిర్మాణానికి అయిన అదనపు ఖర్చుగా రూ. 426 కోట్లు చెల్లించాలని జిహెచ్ఎంసి నిర్ణయించింది. ఈ అంశాలకు స్థాయిసంఘం సమావేశం ఆమోదించింది. వాస్తవానికి ఇందిరా పార్కు నుంచి బాగ్‌లింగంపల్లి కూడలి వరకు స్టీల్ బ్రిడ్జీ నిర్మాణంతో పాటు రాంనగర్ నుంచి బాగ్‌లింగంపల్లి వైపు మల్టీలెవల్ ఫ్లైఓవర్‌ను నిర్మించాలని ప్రణాళికలు రూపొందించారు. ఈ రెండు ఫ్లైఓవర్‌లకు ఒకేసారి శంకుస్థాపన చేశారు. ఇందిరాపార్కు నుంచి బాగ్‌లింగంపల్లి చౌరస్తా వరకు స్టీల్ బ్రిడ్జీని నిర్మించిన విషయం తెల్సిందే. కానీ రాంనగర్ నుంచి బాగ్‌లింగంపల్లి వరకు చేపట్టాల్సిన మల్టీలెవల్ ఫ్లైఓవర్ నిర్మాణాన్ని విరమించుకున్నారు.

**సిఎస్ఆర్‌లో గార్డెన్‌ల అభివృద్ధి...** గ్రేటర్ పరిధిలోని పార్కులు, గార్డెన్‌లు, చెరువుల అభివృద్ధి, నిర్వహణను చేపట్టే బాధ్యతలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. 2023లో క్రీడలు నిర్వహించిన సందర్భంలో సరఫరా చేసిన క్రీడా వస్తువులకు సంబంధించిన బిల్లులు చెల్లించేందుకు ఆమోదించారు. సమావేశంలో కమిషనర్ ఆర్‌వి.కర్ణన్, సభ్యులు బొంతు శ్రీదేవి, బానోతు సుజాత, సయ్యద్ మిన్హాజుద్దీన్, సమీనా బేగం, అబ్దుల్ వాహెబ్, డా.ఆయేషా హుమేరా, మహమ్మద్ సలీం, మహాలక్ష్మి రామన్ గౌడ్, మహమ్మద్ గౌస్ ఉద్దీన్, సిఎన్‌రెడ్డి, ఎండి బాబాఫసియుద్దీన్, వి.జగదీశ్వర్‌గౌడ్, బూరుగడ్డ పుష్ప, చీఫ్ సిటీప్లానర్ శ్రీనివాస్, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, హేమంత్ కేశవ్ పాటిల్, హేమంత్ సహదేవ్ రావు, అపూర్వ్ చౌహాన్, ఎన్.రవికిరణ్, వెంకన్న, అదనపు కమిషనర్లు స్నేహ శబరిష్, వేణుగోపాల్, యాదగిరిరావు, కార్యదర్శి సత్యనారాయణ, గీతారాధిక, నళిని పద్మావతి, వేణుగోపాల్‌రెడ్డి, చీఫ్ ఇంజనీర్లు రత్నాకర్, సహదేవ్‌రావు, భాస్కర్‌రెడ్డి, కోటేశ్వరరావు, భూసేకరణస్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్‌నాయక్, అకౌంట్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్ఇలు రోహిణి, మోహన్‌రెడ్డి, ఈఈలు రాధిక, మమత పాల్గొన్నారు.

## సరూర్‌నగర్ విక్టోరియా హోంలో మిస్‌వరల్డ్ కంటెస్టెంట్ల సందడి



**ప్రజాపక్షం/సరూర్‌నగర్:** సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ హోమ్‌ను 107 మంది ప్రపంచ సుందరీమణులుగురువారం సందర్శించి సందడి చేశారు. మిస్ వరల్డ్ కంటెస్టెట్ల సందడిలో భాగంగా ఈ రెసిడెన్షియల్ హోమ్‌లో ఉండే పిల్లలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్ ను కంటెస్టెంట్లు ప్రారంబించారు.యూరుప్‌కు చెందిన 33 దేశాల పోటీ దారులు, అమెరికా 20, కరీబియన్ 9, ఆఫ్రికా 23, ఆసియా 22 మంది పోటీదారులు విక్టోరియా హోమ్‌ను సందర్శించారు. ఈ మేరకు విక్టోరియా హోమ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. 122 సంవత్సరాల పురాతన భవన నిర్మాణాన్ని చూసిన అందాల బామలు అబ్బురపడ్డారు. చిన్నారులతో కలిసి సందడి చేశారు.

# బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

సమన్వయ సమావేశంలో కమిషనర్ సివి.ఆనంద్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్ అన్నారు. రాబోయే బక్రీద్ పండుగను పురస్కరించుకుని హైదరాబాద్ నగరంలో శాంతియుత వాతావరణంలో, నగరాన్ని పరిశుభ్రంగా పెడుతూ పండుగను జరుపుకోవడానికి సివి ఆనంద్ అధ్యక్షతన బషీర్‌బాగ్ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి. కర్ణన్, జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ సి రమేష్, హెల్త్ అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్, అడిషనల్ కమిషనర్ సానిషన్ డాక్టర్ సిహెచ్ మల్లేశ్వరి, డిసిపిలు, ఎసిపిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా. ఆనంద్ మాట్లాడుతూ, సరైన వెటర్నరీ సర్టిఫికెట్లు లేని వధకు సిద్ధంగా లేని పశువులను అక్రమంగా తరలించడాన్ని నిరోధించడానికి హైదరాబాద్ నగర కమిషనరేట్ చుట్టూ చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలను స్వాధీనం చేసుకుని, జిహెచ్ఎంసీ నిర్దేశించిన పశువుల హోల్డింగ్ పాయింట్లు లేదా గోశాలలకు తక్షణమే పంపించాలని ఆదేశించారు. పశువులను తీసుకెళ్లే వాహనాలను ఆపడం లేదా తనిఖీ చేయడం ప్రభుత్వ అధికారులు మరియు చట్టం అమలు చేసే సంస్థలు మాత్రమే చేయాలని, ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకూడదని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. జిహెచ్ఎంసి అధికారులకు బక్రీద్‌కు ముందు వీధి కుక్కలను పట్టుకోవడానికి అన్ని ప్రాంతాల్లో డాగ్ క్యాచింగ్ స్క్వాడ్లను మోహరించాలని, పశువుల కళేబరాల పారవేయడం కోసం ప్రతి ఇంటికి డిస్పోజల్ కవర్లను సరఫరా చేయాలని, పండుగ రోజున చెత్త, కళేబరాల సేకరణ కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించాలని సూచించారు. పశువుల వ్యర్థాలను సమర్థవంతంగా సేకరించడం మరియు పారవేయడం కోసం తగినన్ని వాహనాలు, టిప్పర్లు మరియు జేసీబీలను సమకూర్చాలని, బక్రీద్ సందర్భంగా ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను తొలగించడానికి సరిపడే సిబ్బందిని నియమించాలని కోరారు.జిహెచ్ఎంసి కమిషనర్ మాట్లాడుతూ, వార్డులు, మసీదుల సమీపంలో అదనపు పారిశుధ్య బృందాలు, చెత్త సేకరణ వాహనాలను మోహరించడంతో సహా అమలు చేస్తున్న విస్తృతమైన పారిశుధ్య చర్యలను వివరించారు. చెత్త సంచులు సిద్ధంగా ఉంటాయని, జిహెచ్ఎంసి అధికారులు చురుకుగా విధులు నిర్వర్తిస్తారని ఆయన తెలిపారు.

## రాజ్యాంగాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తున్న కేంద్రం

సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి



**ప్రజాపక్షం/కొత్తూరు:** రాజ్యాంగాన్ని ప్రమాదంలోకి నెట్టి వేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని, దాన్ని తిప్పికొట్టేందుకు ప్రజలందరు సిద్ధం కావాల్సిన అవసరం ఉందని సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. గురువారం నందిగామ మండల పరిధిలోని నర్సప్పగూడ, అంతిరెడ్డిగూడ, జంగోనిగూడ గ్రామాల్లో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్ ఆశయాలను బ్రతికించుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రామ గ్రామాన ప్రజలను చైతన్యం చేసేందుకు జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేశారని, వారు చూపించిన మార్గంలోనే నేడు గ్రామాల్లో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగం ప్రమాదంలో ఉందని గుర్తించిని రాహుల్‌గాంధీ సమాజాన్ని, దేశాన్ని రక్షించేందుకు కంకణం కట్టుకున్నారని పేర్కొన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తున్న బిజెపి ప్రభుత్వ చర్యలను గ్రామ గ్రామాన ప్రజలను చైతన్య పరుస్తూ ప్రజా మద్దతు కూడగడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జంగ నర్సింహ్మా, మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, మార్కెట్ కమిటి చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, నేతలు కృష్ణ యాదవ్, రవీందర్, రఘునాయక్, మహ్మద్ ఇబ్రహీం, శ్రీనునాయక్, వెంకట్‌రాంరెడ్డి, అందె మోహన్, రాజేష్ గౌడ్, ఖదీర్, శ్రీకాంత్‌రెడ్డి, సుదర్శన్ గౌడ్, వీరేశం, రాజు, కృష్ణారెడ్డి, హరినాథ్‌రెడ్డి, జగదీశ్వర్ అప్ప, బాల్‌రాజ్ గౌడ్, సీతారాములు, రాయికల్ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

## శ్మశానవాటికను కబ్జా చెర విడిపించిన హైడ్రా

హర్షం వ్యక్తం చేసిన స్థానిక ప్రజలు



**ప్రజాపక్షం/హైదరాబాద్/బోడుప్పల్ :** కబ్జాల చెరలో ఉన్న శ్మశాన వాటికను హైడ్రా విడిపించింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండలం, ఫిర్జాదిగూడ మున్సిపాలిటీ పరిధిలోని కంచ పర్వతాపూర్ గ్రామం శ్మశాన వాటికలో వెలిసిన అక్రమ లేఔట్‌ను, కట్టడాలను హైడ్రా గురువారం తొలగించింది. ప్రభుత్వ భూమిలో 40 ఏళ్లకు పైగా సాగుతున్న శ్మశానవాటికను కబ్జా చేసి ప్లాట్లుగా మార్చి విక్రయాలు జరుపుతున్నారనే ఫిర్యాదుల మేరకు హైడ్రా ఈ చర్యలు తీసుకుంది. 3షాపులతో పాటు 15 ప్లాట్లకు వేసిన పునాదులు, రెండు మీటర్ల ఎత్తులో నిర్మించిన ప్రహరీల ను, అందులో వేసిన షెడ్డులను హైడ్రా తొలగించింది.

**ఫిర్యాదు అందిన వెంటనే చర్యలు..**ఫిర్జాదిగూడ మున్సిపాలిటీలోని కంచ పర్వతాపూర్ గ్రామంలో మైనారిటీలకు సంబంధించిన శ్మశానవాటికలు రెండు ఉన్నాయి. వీటిని కబ్జా చేసి ప్లాట్లుగా విక్రయాలు జరిపారని హైడ్రా ప్రజావాణిలో అక్కడి శ్మశాన పరిరక్షక ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. సుఖేందర్ రెడ్డికి సర్వే నెంబర్ 12లో సొంత భూమి ఉంది. తనకి ఉన్న ప్రైవేట్ భూమికి పక్కనే సర్వే నెంబరు 1లో ప్రభుత్వ భూమి ఉంది. ఈ ప్రభుత్వభూమిలో ఉన్న శ్మశాన వాటికల స్థలాన్ని కూడా కబ్జా చేసి లేఔట్ వేశారు. అప్పటికే ఉన్న సమాధులపై మట్టి పోసి అవి కనిపించకుండా చేశారు. ఫిర్జాదీగూడ మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు జగదీశ్వర్ రెడ్డితో కుమ్మక్కైన సుఖేందర్ రెడ్డి ఈ కబ్జాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి. కరోనా సమయంలో ఇదంతా జరిగింది.

**తప్పుడు కేసు వివరాలతో..**

ప్రభుత్వ భూమిలో ఉన్న శ్మశానవాటికలను కబ్జా చేయడమే కాకుండా, ఆ లేఔట్‌లోకి వెళ్లకుండా కోర్టు కేసులున్నాయని కబ్జాదారులు నమ్మబలికారు. 15 ప్లాట్ల ప్రహరీలమీద, తప్పుడు రిట్ పిటిషన్ నెంబర్‌లను రాయించారు. అటువైపు తాము వెళ్లకుండా అడ్డుకోవడానికే ఇలా చేశారని ప్రజావాణిలో ఫిర్యాదు దారులు పేర్కొన్నారు. ఇదంతా కొవిడ్ సమయంలో జరిగింది. తన సొంత భూమికి చెందిన సర్వే నెంబర్ చూపించి తప్పుడు అనుమతులు తీసుకోవడం, అక్రమ కట్టడాలు చేపట్టడం జరిగిపోయింది. మాజీ మేయర్, కోఆప్షన్ మెంబరు సహకారంతో ఈ కబ్జాల పర్వం జరిగిపోయింది. తప్పుడు సర్వే నెంబరు జోడించి అనుమతులు రావడంలో అప్పటి మున్సిపల్ మేయర్, కో ఆప్షన్ సభ్యులు సహకరించారని ఫిర్యాదుదారులు ఆరోపించారు. సర్వే చేయించుకుని హద్దులు, నిర్ధారించుకోవడం, కోర్టు ద్వారా హక్కులు పొందకుండా భుజబలంతో సొంతంగా నిర్ణయించుకున్నారని ఫిర్యాదుదారులు వాపోయారు.

**హైడ్రా చర్యలు ఇలా..**గురువారం ఉదయం హైడ్రా అధికారులు ఆక్రమణలను తొలగించారు. ఇక్కడ మూడు షాపులలో సామాన్లను తరలించడానికి కొంత సమయం కావాలని అడగగా, వారికి హైడ్రా సహకరించింది. సామాన్లు మొత్తం తరలించిడంలోనూ హైడ్రా సిబ్బంది సహాయం చేశారు. మొత్తం సామాన్లు వాహనాలోకి ఎక్కించిన తర్వాత ఆషాపులను హైడ్రా తొలగించింది. 200 ల గజాల ప్లాట్‌లో ఉన్న 3 దుకాణాలతో పాటు పునాదులు వేసి 2 మీటర్ల ఎత్తులో నిర్మించిన 15 ప్లాట్ల ప్రహరీలను హైడ్రా తొలగించింది. ఈ అంశంపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న దుష్ప్రచారాన్ని హైడ్రా తీవ్రంగా ఖండించింది. ఎకరాకుపైగా ఉన్న శ్మశాన వాటికల భూమి కాపాడుకోగలిగామని స్థానికులు హర్షంవ్యక్తం చేశారు.

## చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే పూజలు



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** శ్రీ ఆంజనేయ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని వేడుకున్నట్లు శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ తెలిపారు. గురువారం షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలో ఉన్న చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దంపతులు హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సతీమణి అనురాధలను ఆలయ పూజరాలు అశీర్వధించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మాణిక్యంతోపాటు కార్యకర్తలు ఉన్నారు.

**షాద్‌నగర్ ఏసిపి రంగస్వామిని అభినంధించిన ఎమ్మెల్యే**

ఉద్యోగ పరంలో బదిలీలో సర్వ సాధారణమని, ఎక్కడ విధులు నిర్వహించినా నిబద్ధతతో నిజాయితీగా ఉండాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న ఏసిపి రంగస్వామిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేకంగా సన్మానించి అభినంధించారు. రెండేళ్లకు పైగా షాద్‌నగర్‌లో విధులు నిర్వహించిన నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉన్న ఏసిపి రంగస్వామిని పూలమాలలు, శాలువాలతో సత్కరించి వీడ్కొలు ఫలికారు. భవిష్యత్‌లో ఉన్నతాధికారులుగా పదోన్నతులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యుడు వెంకట్‌రెడ్డి, కొందుర్గు మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నేతలు మహ్మద్ ఇబ్రహీం, రాయికల్ శ్రీనివాస్, ముబారక్‌లు పాల్గొన్నారు.

## నేడు యాచారం మండలానికి ఎంఎల్ఎ రాక

**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండలానికి నేడు ఇబ్రహింపట్నం శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి రానున్నారని మండల ఇన్‌చార్జి ఎంపిడిఒ శైలజా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యాచారం మండలంలోని 24 గ్రామాలకు గాను 227 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసిడింగ్ అందజేయనున్నట్లు తెలిపారు. అర్హులైన లబ్దిదారులతో బాటు వివిధ శాఖల అధికారులు, పంచాయతి కార్యదర్శులు హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు.



రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో గురువారం రాత్రి జరిగిన సిపిఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎంఎల్ఎ, విశాఖ కోఆపరేటివ్ బ్యాంకు వ్యవస్థాపక చైర్మన్ మానవ ఆంజనేయులు మనువడు రాజకోటి, నవ్యశ్రీ వివాహ విందుకు హాజరై శుభాకాంక్షలు తెలిపిన సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాప రెడ్డి, ఉజ్జిని రత్నాకర్‌రావు, విశాలాంధ్ర సంపాదకులు ఆర్‌వి.రామారావు, సురవరం విజయలక్ష్మి, చెన్నకేశవరావు, డాక్టర్ రజిని తదితరులు .

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు : ఎంఇఒ వెంకట్



**ప్రజాపక్షం/దోమ:** పరిగి నియోజకవర్గంలోని దోమ మండల కేంద్రంలో ఎంఈఒ వెంకట్ ఆధ్వర్యంలో కేజిబివిలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు మండల స్థాయి, శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా స్థాయి సబ్జెక్టు అబ్జర్వర్‌లు నాగరాజు, నర్సింహ రాజు పరిశీలించడం జరిగింది. ఉపాధ్యాయులు నేర్చుకున్న విషయాలను విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించి విద్యాఅభివృద్ధికి కృషి చేయాలని ఉపాధ్యాయులందరు అంకిత భావంతో పనిచేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటచారి, శ్రీనివాస్, రవి, సంతోష్, రాకేష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**ప్రజాపక్షం/అల్వాల్ :** ప్రభుత్వ పాలిటెక్నిక్ మాసబ్ ట్యాంక్ హైదరాబాద్ విద్యార్థులు 1977లో చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకచోటచేరి గత అనుభవాలు నెమరు వేసుకున్నారు. 48సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారంతా ఒక్కొక్కరు పలకరించుకొని వారి జీవనస్థితి గతులు పంచుకొని రోజంతా ఆనందంగా ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా చైర్మన్ కె.వి నాగమయ్య, శర్మ, హరిందర్ నాగేశ్వరరావు, మహాదేవ్ రమేష్ విజయ్ కుమార్, రాజమౌళి రాఘవేందర్ జగన్మోహన్ చంద్రయ్య సుధాకర్ ప్రభాకర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## అంటు వ్యాధులు సోకకుండా అప్రమత్తత అవసరం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** అకాలవర్షాలతో పాటు రానున్న వర్షాకాలం దృష్ట్యా అంటు వ్యాధులు సోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దీని కోసం తమ సమీప ప్రాంతాల్లో చెత్తా చెదారం నిలువ లేకుండా చూసుకోవాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్ కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్ సూచించారు. అదే విధంగా ఈ విషయంలో జిహెచ్ఎంసి విభాగ అధికారులు సైతం ఫాగింగ్ క్రమం తప్పకుండా చేయాలన్నారు. గురువారం ఆయన డివిజన్‌లోని పివి ఎన్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికులు తమ ఇళ్లల్లో నుండి వచ్చే చెత్తను ఉదయం ఇంటికి వచ్చే స్వచ్ఛ ఆటోల్లో మాత్రమే తరలిచే విధంగా సహకరించాలని, పరిసరాల్లోని ఖాళీ ప్రదేశాలు, రహదారి పక్కన పడేయ వద్దని, ఇంటి పరిసరాల్లో నీరు నిలువ లేకుండా చూసుకోవాలని కోరారు. ఈస్ట్ ఆనందబాగ్ డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో ఇకపై ప్రతి గురువారం ఫాగింగ్ చేస్తామని ఎంటమాలజీ విభాగ సూపర్‌వైజర్ నజీర్ తెలిపారు.



## హనుమాన్ జయంతి వేడుకల్లో ఎంపి ఈటల రాజేందర్

**ప్రజాపక్షం/శామీర్‌పేటః** తూంకుంట మున్సిపాలిటీ దేవరయాంజాల్‌లో హనుమాన్ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ విచ్చేసి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్‌టిఏ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గోల్డ్ శ్రీనివాస్, శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ చైర్మన్ లక్ష్మి నారాయణ(నాని), మాజి కౌన్సిలర్ నర్సింగరావు పాల్గొన్నారు. అనంతరం స్వామి వారి ఊరేగింపులో గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో ఆత్మహత్య

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేటలోని పెద్దమ్మ కాలనీలో నివాసం ఉండే రాచకొండ నరేందర్ (47) క్షౌరవృత్తి చేసుకుంటు జీవనం గడుపుతున్నాడు. బధవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు శామీర్‌పేట పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ మేరకు పోలీసులు శవపంచనామ నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## వైభవంగా శ్రీవిష్ణు శివ పార్వతుల కల్యాణం

**ప్రజాపక్షం/శామీర్‌పేటః** మూడుచింతలపల్లి మండలం ఉద్దెమర్రిలోని అతి పురాతణమైన శ్రీవిష్ణు శివాలయంలో బ్రహ్మోత్సవాల్లో బాగంగా శుక్రవారం హరిహరుల కల్యాణమహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటి చైర్మన్ ఆడెపు ఉమా మహేశ్వరి ఆధ్వర్యంలో మూడు రోజులపాటు బ్రహ్మోత్సవాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. కల్యాణోత్సవంలో భాగంగా ఉదయం సుప్రభాత సేవలు, వాయిద్య గోష్టి, నిత్యార్చన, వీరాంజనేయ స్వామికి సింధూరఅభిషేకం, ఆంజనేయ స్వామి ఆలయం నుంచి ఎదుర్కోలుతో శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మి వేంకటేశ్వర స్వామి, శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి వార్ల దివ్య కల్యాణోత్సవం కన్నుల పండవగా జరిగింది. శ్రీఅన్నమాచార్య సేవా ట్రస్ట్ సంస్కృతి తెలంగాణ వారి అన్నమయ్య సంకీర్తన నాట్యాంజలి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజి ఎంఎల్‌ఎ సుదీర్‌రెడ్డి, డిసిసి అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్‌లు స్వామి వారిని దర్శించుకుని తరించారు.

# పెద్దోళ్ల జోలికి వెళ్లని హైడ్రా
# పేదలపై ఇంత కక్ష సాధింపా?

* నివాసం ఉంటున్న ఇండ్లను టార్గెట్ చేసి కూల్చివేతలు * అన్ని అనుమతులు ఉన్నా కూల్చివేతలేంటని బాధితుల ఆవేదన



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** అప్పుచేసి ప్లాట్లు కొనుగోలు చేశామని,పెద్దోళ్ల జోలికి వెళ్లని హైడ్రా పేదలపై ఇంత కక్ష సాధింపు చర్యలు చెపట్టారని దీంతో నిర్వాసితులమైయామని ఇండ్ల బాధితులు అవేదన వ్యక్తం చేశారు. గురువారం బాధితులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఫీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధి సర్వే నెంబరు 12/ పార్టు,1 3 పార్టులలో 2007 సంవత్సరంలో అప్పటి జీపీ లే అవుట్ ప్రకారం రిజిస్ట్రేషన్ ప్లాట్లు కొనుగోలు చేశామని రజనీకాంత్ రెడ్డి, శ్రీకాంత్, మామిడాల సంపత్, సుధాకర్ రెడ్డి, అభినందన్ రెడ్డి, భావన, కిరణ్మయి లు అవేదన వ్యక్తం చేశారు. తాము అన్ని ప్రభుత్వ నిబంధనల మేరకే ప్లాట్లు కొనుగోలు చేశామని భూ క్రమబద్ధీకరణ పథకం ద్వారా డబ్బులు చెల్లించి ఇంటి నిర్మాణం అనుమతులు పొందామని అప్పటి నుండి ప్రతి ఏటా ఇంటి పన్నులు, విద్యుత్ చార్జీలు కడుతున్నామని తెలిపారు. అదే సమయంలో సర్వే నెంబరు 12/ పార్టులో ఉన్న శ్మశాన వాటిక ఉండగా కరోనా సమయంలో ఎవరికి ఇష్టం వచ్చినట్లు ప్రయివేటు వ్యక్తుల ప్లాట్లలో కూడా చనిపోయిన వారిని ఖననం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో చనిపోయిన వారిని ప్రయివేటు ప్లాట్లలో ఖననం చేయడమే కాకుండా అవి తమకు చెందిన శ్మశాన వాటిక స్థలమని కొందరు రాజకీయ నాయకులు బ్లాక్ మెయిల్ చేశారని వాపోయారు. గతంలో అనేక సార్లు విచారణ జరిపిన కూడా అవి ప్రయివేటు ప్లాట్లు అని తేటతెల్లం అయ్యిందని కానీ హైడ్రా వచ్చాక ఇక్కడి నాయకులు తప్పుడు సమాచారం ఇచ్చి నివాసం ఉంటున్న ఇండ్లను టార్గెట్ చేసి మరీ నేడు కూల్చివేతలు చేపట్టారని వాపోయారు. హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టిన ఇండ్లలో ఇప్పటికే నివాసం ఏర్పాటు చేసుకుని ఉంటున్నారని ఏలాంటి ముందస్తు సమాచారం లేకుండానే ఇష్టానుసారంగా ఏకపక్షంగా కూల్చివేతలు చేపట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

**అప్పుచేసి ప్లాట్లు కొనుగోలు చేశాము**

అప్పు చేసి ఇక్కడ ఇంటి స్థలం కొనుగోలు చేసి నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణం చేసుకున్నామని అన్ని అనుమతులు పొందిన కూడా ఏకపక్షంగా కూల్చివేతలు చేపట్టడం ఏంటని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దోళ్ల జోలికి వెళ్లని హైడ్రా పేదలపై ఇంత కక్ష పూరితంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. ఉన్న ఊర్లో వ్యవసాయ భూమి అమ్ముకుని ఇక్కడ ఇంటి స్థలం కొనుగోలు చేస్తే ఇది కూడా కోల్పోయి దిక్కులేని వాళ్లం అయ్యామని బాధితులు కన్నీటి పర్యంతమయ్యా రు.



**కబ్జాలపై హైడ్రా పంజా**

మేడ్చల్ మాల్కజ్ గిరి జిల్లా మేడిపల్లి మండలం పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలో హైడ్రా అధికారులు పలు అక్రమ నిర్మాణాలను గురువారం పోలిసుల బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. పీర్జాదిగూడ కార్పొరేషన్ పర్వతపూర్ రెవిన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 1లోని క్రిస్టియన్, ముస్లిం మైనారిటీలకు చెందిన స్మశాన వాటిక చేసారనే ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ బుధవారం సందర్శించిన వెంటనే గురువారం కూల్చివేతలు చేపట్టారు. తమ పూర్వికుల సమాదులను కొంతమంది కబ్జాదారులు కబ్జా చేశారని, గత కొన్నేండులుగా పోరాటం చేసిన నాడు బి ఆర్ ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని క్రిస్టియన్, మైనారిటీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హైదరా వల్ల మా సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. ఈ సందర్భంగా క్రిస్టియన్, మైనార్టీ నాయకులు ప్రభుత్వానికి, హైడ్రా అధికారికులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇటుకబట్టిలో వెట్టిచాకిరీపై విచారణకు ఆదేశం

### బాలకార్మికులను గుర్తించిన తహశీల్దార్




**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మండలం కేశవరంలోని ఓ ఇటుకబట్టిలో బాల కార్మికులు, బాండెడ్ లేబర్‌తో వెట్టిచాకిరి చేయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తహశీల్దార్ ఆర్ వెంకటనర్సింహారెడ్డి అన్నారు. ఈ సందర్బంగా తహశీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మూడుచింతలపల్లి మండలం కేశవరం రెవెన్యూ పరిధిలో జగ్గంగూడ గ్రామానికి చెందిన తోకల మాధవరెడ్డి ఇటుకబట్టిలో సుమారు 28 కుటుంబాలు పని చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇటుకబట్టి యజమాని తోకల మాధవరెడ్డి కార్మికులను వేధిస్తున్నాడని. బాలకార్మికులతో పనిచేయిస్తున్నాడని, బ్రాండెడ్ లేబర్‌లను పనిలో పెట్టుకున్నాడని బట్టిలో పనిచేసే ఓ వ్యక్తి తన సొంత రాష్ట్రమైన ఒడిస్సాకు వెళ్లి ఓ స్వచ్ఛంథ సంస్థను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. అక్కడి స్వచ్ఛంథ సంస్థ ప్రతినిధులు లేబర్ అధికారులు, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లు ఇట్టి విషయాన్ని మేడ్చల్ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసువచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక తహశీల్దార్ వెంకటనర్సింహారెడ్డి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, లేబర్ అధికారులు ఇటుకబట్టికి వెళ్లి విచారణ చేపట్టారు. మొత్తం 28 కుటుంబాలకు చెందిన సుమారు 92 మంది ఇటుకబట్టిల్లో ఉన్నారని తెలుసుకున్నారు. ఇందులో 7 గురు బాలకార్మికులు, ఇద్దరు బాండెడ్ లేబర్‌లు పనిచేస్తున్నట్లు తహశీల్దార్ గుర్తించారు.

కలెక్టర్ ఆదేశాల మేరకు ఇటుకబట్టిని సందర్శించి బాలకార్మికులను, బాండెడ్ లేబర్‌లను గుర్తించామని అన్నారు. లేబర్ అధికారులకు నివేదిక సమర్పించామని వారు ఇటుకబట్టి యజమానిపై కేసు నమోదు చేస్తారని చెప్పారు. ఇటుకబట్టిలో పనిచేస్తున్న వారందరిని వారి రాష్ట్రానికి పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆధికారి సాయికుమార్, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఇంతియాజ్, శామీర్‌పేట తహశీల్దార్ యాదగిరిరెడ్డి, సిఐ శ్రీనాథ్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## 'బాల్య వివాహ' నష్టంపై అవగాహన అవసరం



**ప్రజాపక్షం /వికారాబాద్ ప్రతినిధిః** వికారాబాద్ జిల్లాలో ఉన్న మారు మూల గ్రామాలలో ఉన్నటువంటి బాల్యవివాహాలతో వచ్చే నష్టాలపై అవగాహన కలిపిస్తు న్యాయం జరిగే లా చూడాలనే ఉద్దేశంతో బాల అదాలత్ కార్యక్రమం వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో మొట్టమొదటిసారిగా చేపట్టడం జరుగుతుంది అని రాష్ట బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ సీతా దయాకర్‌రెడ్డి అన్నారు. మహిళ శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో పిల్లల హక్కుల పరిరక్షణ సమస్యల పరిష్కరినికి కమిషన్, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పిల్లల సమస్యలు , బాల్యవివాహాలను అరికట్టేందుకు పిల్లలకు తల్లిదండ్రులకు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, రెవెన్యూ, పోలీస్, విద్య, ఆరోగ్య శాఖ సమన్వయంతో ముందుకు వెళ్లాలని అన్నారు. వికారాబాద్ జిల్లాలో బాల్య వివాహాలు ఎక్కువ అవుతున్నాయని వాటి నివారణకు సమన్వయంతో పని చేయాలని అన్నారు. జిల్లాలో అనాథ పిల్లలకు ఆరోగ్యశ్రీ కార్డులు వచ్చేలా చూడాలని కలెక్టర్‌కు కమిషన్ సభ్యులు అపర్ణ కోరారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బొంరాస్ పేట్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసామని, వైకల్యం గల పిల్లలను గుర్తించి, చికిత్సకు గుర్తించడం జరిగింది అన్నారు. ఫోక్సో, బాల్య వివాహ బాధిత బాలికలకు ప్రత్యేక గృహం, వసతి సదుపాయాలు కల్పించే విధంగా చూడాలని కోరారు. అనంతరం శశిశుగృహలను కమిషన్ సందర్శించి అక్కడి సౌకర్యలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు అపర్ణ, ప్రేమలత, అగర్వాల్, అదనపు కలెక్టర్ సుధీర్, వెంకటేశం, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గోన్నారు.

## ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధిః** వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్ , సుధీర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి దళిత మహిళల విద్యార్జన కోసం భాగ్యరెడ్డి వర్మ ఎనలేని కృషి చేశారన్నారు. హైదరాబాద్ సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి అభ్యున్నతికి గట్టి పూనదులు వేశారని ఆయన సేవలను కొనియాడారు. ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించడం ఆనందంగా ఉంది అన్నారు. భాగ్యరెడ్డి వర్మ అడుగు జాడల్లో నడుస్తు ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమల్‌కార్‌రెడ్డి, డిఆర్‌డిఓ శ్రీనివాస్, ఆర్‌డిఓ వాసుచంద్ర వివిధ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు సువర్ణావకాశం... 29న జాబ్ మేళా

**ప్రజాపక్షం/తాండూరుః** తాండూరు ఎంఎల్ఎ బుయ్యని మనోహర్ రెడ్డి ఆద్వర్యాన ఈ నెల 29న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్న ట్లు పేర్కొన్నారు. తాండూరు నియోజకవర్గంలోని నిరుద్యోగులకు సువర్ణావకాశం కల్పించారు. ఈ నెల 29న నిర్వహించే జాబ్ మేళా తాండూరు పట్టణంలోని వినాయక కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు ఇంటర్వ్యూలు కొనసాగుతాయని తెలిపారు. నిరుద్యోగులు ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, పిజి వరకు చదివిన నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ ఇంటర్వ్యూలో 50కి పైగా కంపనీలు హాజరవుతాయని, 10వేలకు పైగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.




## మేడిపల్లి మండల 4వ సిపిఐ మహాసభ

### మండల కార్యదర్శిగా రచ్చ కిషన్ ఏకగ్రీవ ఎన్నిక

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండలం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇందిరా నగర్ కాలనీ సంక్షేమ సంఘం భవనంలో సిపిఐ పార్టీ మేడిపల్లి మండల 4వ, మహాసభ నిర్వహించడం జరిగినది. ఈ మహా సభ రచ్చ కిషన్ అధ్యక్ష తన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా సహాయ కార్యదర్శి జి.దామోదర్ రెడ్డి, ఉమామహేష్, నియోజకవర్గ కార్యదర్శి తోటపల్లి శంకర్ జిల్లా కార్యవర్గ సభ్యురాలు జె.లక్ష్మి హాజరవ్వడం జరిగినది. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శిలు జి.దామోదర్ రెడ్డి, ఉమా మహేష్ లు మాట్లాడుతూ, సిపిఐ పార్టీ పేద ప్రజల ప్రక్షాను నిలబడుతూ ప్రజా పోరాటాలు నిర్వహిస్తూ కార్మికులను, కర్షకులను వారి హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న 100 సంవత్సరాలు నిండిన ఏకైక పార్టీగా భారత కమ్యూనిస్టు పార్టీ అని కొనియాడారు. నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి చేసి వేలాది ఎకరాలను పేదలకు పంచిన ఘనత చరిత్ర కమ్యూనిస్టులది అన్నారు. భగత్ సింగ్ నగర్ గుడిసెలలో పేదల ఇళ్లపై రెవెన్యూ అధికారులు వానలకు కూలిన గుడిసెలు వాటిని మరమ్మతులు చేసుకుంటే రెవెన్యూ అధికారులు వెళ్లి వారిపై చర్యలు తీసుకుంటున్నారని అలాంటి చర్యలు మానుకోవాలని హెచ్చరించారు. భూ కబ్జాదారులు చేస్తున్న కబ్జాలను చూసి చూడనట్టు వదిలేసి పేద ప్రజలు 20 సంవత్సరాల నుంచి వేసుకున్న గుడిసెలను మరమ్మత్తులు చేసుకుంటే వాటిపై చర్యలు తీసుకోవడం ఏమిటని రెవిన్యూ అధికారులను ప్రశ్నించారు.

**మేడిపల్లి మండల నూతన కమిటీ ఎన్నిక**

మేడిపల్లి సిపిఐ పార్టీ మండల కార్యదర్శిగా రచ్చ కిషన్, సహాయ కార్యదర్శిగా సిహెచ్‌మాధవి, జి.నాగరాజు ఎన్నుకోవడం జరిగింది. కౌన్సిల్ సభ్యులుగా జె. లక్ష్మి, కే ప్రమీల, మహాలక్ష్మి, దండు రమేష్, మాచర్ల కనకయ్య, భూతం ఐలయ్య, రచ్చ శ్యామ్, నర్సమ్మ, ఉప్పల కొమురయ్య, బాపరాజు, దండు మదర్, భూతం నరేష్, రమతారా, లక్ష్మమ్మ, ఎం విజయ్, నాగమణి, ఎండి అన్వర్, జ్యోతి, సోమయ్య, సైదులు, తమన్నా, మాధవ్, ఏకగ్రీవంగా ఎన్నికైయారు.



## డివిజన్లను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం

**ప్రజాపక్షం/అల్వాల్ :** అల్వాల్ డివిజన్ పెంటారెడ్డి నగర్ కాలనీలో మున్సిపల్ అధికారులతో కలిసి పలు సమస్యలపై పర్యటించారు. ముఖ్యంగా డ్రైనేజీ నీరు బయటకు వెళ్లకుండా పలు సమస్యలు ఎదురవుతున్నాయని ఎప్పుడో వేసిన డ్రైనేజీ లైన్ తీసివేసి కొత్త లైన్ వేయాలని కాలనీవాసులు కార్పొరేటర్‌కు విన్నవించారు. కాలనీలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని కాలనీవాసులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ కృష్ణమాచారి, శేఖర్, ఇమ్రాన్ కాలనీవాసులు వెంకటనారాయణ, శ్రీనివాస్, బాలరాజ్, రామకృష్ణ, సాయికుమార్, స్థానిక నాయకులు యాదగిరి గౌడ్, ప్రేమ్ కుమార్, సాజిద్, తదితరులు పాల్గొన్నారు. వెంకటాపురం డివిజన్ సత్యసాయి ఎంక్లేవ్ లోని 45 లక్షల వ్యయంతో కూడిన సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన స్థానిక కార్పొరేటర్ సబిత అనిల్ కిషోర్ గౌడ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, మౌలిక వసతులు కల్పించి వెంకటాపురం డివిజన్‌ను ఆదర్శవంతమైన డివిజన్‌గా నిలుపుట తన కర్తవమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు నరసయ్య గౌడ్, రాఘవేంద్ర, యాదయ్య, కోటిలింగం, శీలయ్య, మనోహర్ గుప్తా, సూర్యం, స్థానిక నాయకులు అనిల్ కిషోర్ గౌడ్, రాజు నాయక్, తదితరులు పాల్గొన్నారు.




## అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు అందజేస్తాం

### చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరుగుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. శుక్రవారం నవాబుపేట్ మండల పరిధిలోని ఎమ్మెల్యే సొంత గ్రామం చించల్ పేట్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పథకాలలో ఒకటి ఇందిరమ్మ ఇండ్లు అని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇండ్ల ద్వారా రూ.5 లక్షలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఇండ్లు లేని నిరుపేదలకు, అర్హులైన ప్రతి ఒక్కరూ పథకం ఉపయోగించుకోవాలని అన్నారు. గతంలో కూడా కాంగ్రెస్ హయాంలోనే ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వ డం జరిగిందన్నారు. గత పది సంవత్సరాల నుంచి నిరుపేదలకు ఇల్లు ఇవ్వకుండా మోసం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చేర్మెన్ థోడ్ గీతాసింగ్, పిఎసిఎస్ చేర్మెన్ పోలీస్ రాంరెడ్డి, ఎంపిడిఓ అనురాధ, గుడిమల్కాపూర్ మార్కెట్ డైరెక్టర్ రావు గారు వెంకట్ రెడ్డి,ఏఎంసి డైరెక్టర్‌లు, సీనియర్ నాయకులు, తాజా మాజీ సర్పంచ్ కాలే శ్రీనివాస్, అధికారులు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వెంకట్ సాయి రైస్ మిల్ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/పరిగి:** పరిగి నియోకవర్గంలోని వెంకటసాయి రైస్ మిల్‌ను జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తెచ్చిన ధాన్యంను ఎక్కువ నిలువ ఉంచకుండా మిల్లింగ్ చేసిన బియ్యంను వెంటనే ఎఫ్‌సిఐకి తరలించాలని ఆదేశించారు. పరిగిలోని ఎంఎస్‌సిఎస్ గోదామును కలెక్టర్ తనిఖీ చేశారు. మార్కెట్ గోడౌన్‌ల్లో వరి ధాన్యాన్ని నిల్వ చేయవలసిందిగా అధికారులను ఆదేశించారు. ఇంటిగ్రేటేడ్ కూరగాయల మార్కెట్ బిల్డింగ్‌ను పరిశీలించి వెంటనే నిర్మాణ పనులు పూర్తి చేయవలసిందిగా మార్కెట్ కమిటి చైర్మన్ పరుశురాంరెడ్డికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, టోక్యానాయక్, రాము, తహసీల్దార్ ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## మిచెల్ మార్ష్, నికోలస్ పూరన్ ఊచకోత



**ఐ**పిఎల్ 2025లో భాగంగా అహ్మదాబాద్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ భారీ స్కోరును సాధించింది. లక్నో బ్యాటర్లు మిచెల్ మార్ష్, నికోలస్ పూరన్ చెలరేగడంతో 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 235 పరుగులు చేయగలిగింది. మిచెల్ మార్ష్ అద్భుతమైన సెంచరీతో రెచ్చిపోయాడు. 56 బంతుల్లోనే తన సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ మ్యాచ్ లో మిచెల్ మార్ష్ 64 బంతుల్లో 10 ఫోర్లు, 8 సిక్సులతో 117 పరుగులు చేసి ఔటయ్యాడు. నికోలస్ పూరన్ తన మెరుపు అర్ధశతకంతో విరుచుకుపడ్డాడు. పూరన్ 27 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సులతో 56 పరుగులతో అజేయంగా నిలిచాడు. మార్ష్, పూరన్ రెండో వికెట్ కు 121 పరుగుల పార్టనర్షిప్ నెలకొల్పారు. గుజరాత్ బౌలర్లలో అర్షద్ ఖాన్, సాయి కిషోర్ తలో వికెట్ తీశారు.

టాస్ ఓడిపోయి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకు మిచెల్ మార్ష్, ఐడెన్ మార్క్రమ్‌లు అద్భుతమైన ఆరంభాన్ని అందించారు. మార్ష్, మార్క్రమ్ తొలి వికెట్‌కు 9.5 ఓవర్లలో 91 పరుగులు జోడించారు. మార్ష్ మరింత దూకుడుగా బ్యాటింగ్ చేస్తున్నట్లు కనిపించాడు. ఈ సమయంలో మిచెల్ మార్ష్ 32 బంతుల్లో తన అర్ధ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. తన అర్ధ సెంచరీ తర్వాత మార్ష్ తన సెంచరీని చేరుకోవడానికి కేవలం 24 బంతులను ఎదుర్కొన్నాడు. అర్షద్ ఖాన్ వేసిన 16.5 ఓవర్ కు ఫోర్ బాదిన తర్వాత బంతికి సింగిల్ తీసి మూడంకెల స్కోరును అందుకున్నాడు. 56 బంతుల్లో తన సెంచరీని పూర్తి చేశాడు. మార్ష్ తన సెంచరీని చేరుకోవడానికి 10 ఫోర్లు, 6 అద్భుతమైన సిక్సర్లతో కొట్టాడు.

## అండర్-19 ఇంగ్లాండ్ పర్యటనకు భారత జట్టు

### కెప్టెన్‌గా ఆయుష్ మాత్రే, వైభవ్‌కు చోటు



**ఇం**డియన్ ప్రీమియర్ లీగ్ 2025లో అద్భుతంగా రాణించిన యువ భారత క్రికెటర్లకు పెద్ద బహు మతి లభించింది. ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లే అండర్19 జట్టును బిసిసిఐ జూనియర్ సెలక్షన్ కమిటీ గురు వారం ప్రకటించింది. 5 వన్డే మ్యాచ్‌లు, 2 మల్టీడే మ్యా చ్‌లు ఆడేందుకు సెలక్టర్లు 16 మందితో కూడిన జట్టును ఎంపిక చేశారు. ఈ 16 మందిలో ఐపీఎల్‌లో అద్భుతంగా రాణించిన ఆటగాళ్లు కూడా ఎంపి కయ్యారు. ఈ అండర్19 జట్టుకు సీఎస్కే జట్టు తరపున అద్భుతంగా ఆడిన యువ ఆటగాడు ఆయుష్ మాత్రే జట్టుకు కెప్టెన్ కాగా.. జట్టులో వైభవ్ సూర్యవంశీ కూడా ఉన్నారు. జూన్ 24 నుంచి జులై 23 వరకు సుదీర్ఘ కాలం పాటు భారత జట్టు ఇంగ్లండ్‌లో పర్యటించనుంది.

ఆయుష్ మాత్రే కెప్టెన్ అయితే, అభిజ్ఞాన్ కుందు వైస్ కెప్టెన్, వికెట్ కీపర్‌గా ఎంపికయ్యాడు. ఈ జట్టులో రాజస్థాన్ చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీకి కూడా చోటుదక్కింది. ఈ జట్టులో విహాన్ మల్హోత్రా, మౌల్యారాజ్ సింగ్ చావ్డా, రాహుల్ కుమార్, హర్వన్ష్ సింగ్(వికెట్ కీపర్) కూడా ఉన్నారు. వారితో పాటు ఆర్ఎస్ అంబరీష్, కనిష్మ చౌహాన్, ఖిలాన్ పటేల్, హెనిల్ పటేల్, యుధజిత్ గుహా, ప్రణవ్ రాఘవేంద్ర, మహ్మద్ ఇనాన్, ఆదిత్య రానా, అన్మోల్‌జీత్ సింగ్ కూడా ఉన్నారు. కొంత మంది ఆటగాళ్లను స్టాండ్‌బైలో ఉంచారు. ఈ క్రమంలో అందరి దృష్టి ఆయుష్ మాత్రే, వైభవ్ సూర్యవంశీల ఆటతీరుపైనే ఉండనుంది. ఐపీఎల్ లో అదరగొట్టిన ఈ యువ ఆటగాళ్లు ఇంగ్లాండ్‌లో ఎలా రాణిస్తారనేది ఆసక్తికరగా మారింది. ఐపీఎల్ లో ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేసిన 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ మొత్తంగా 7 మ్యాచ్‌లు ఆడి 252 పరుగులు సాధించాడు. ఆయుష్ మాత్రే సీఎస్కే తరపున ఓపెనర్ గా బరిలోకి దిగి 6 మ్యాచ్‌లు ఆడి 206 పరుగులు పూర్తి చేసుకున్నాడు.

**ఇంగ్లాండ్ పర్యటన కోసం భారత అండర్-19 జట్టు**

ఆయుష్ మాత్రే(కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, విహాన్ మల్హోత్రా, మౌల్యారాజ్ సింగ్ చావ్డా, రాహుల్ కుమార్, అభిజ్ఞాన్ కుందు(వైస్ కెప్టెన్, వికెట్ కీపర్), హర్వన్ష్ సింగ్ (వికెట్ కీపర్), ఆర్ఎస్ అంబరీష్, కనిష్క చౌహాన్, ఖిలాన్ పటేల్, హెనిల్ పటేల్, యుధజిత్ గుహా, ప్రణవ్ రాఘవేంద్ర, మహమ్మద్ ఇనాన్, ఆదిత్య రానా, అన్మోల్జిత్ సింగ్

## చరిత్ర సృష్టించిన బుమ్రా..!



**ముం**బై ఇండియన్స్ స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధికసార్లు 3 వికెట్ల ఘనతను అందుకున్న తొలి బౌలర్‌గా నిలిచాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో బుధవారం ముంబై వేదికగా జరిగిన నాకౌట్ తరహా మ్యాచ్‌లో జస్‌ప్రీత్ బుమ్రా(3/12) మూడు వికెట్లతో ముంబై ఇండియన్స్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్‌లో బుమ్రాకు ఇది 25వ మూడు వికెట్ల ఘనత. 18 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలో బుమ్రా, చాహల్ మాత్రమే 20 సార్లకు పైగా మూడు వికెట్లు పడగొట్టారు. చాహల్ 22 సార్లు మూడు వికెట్లు తీసాడు.

ఈ జాబితాలో బుమ్రా(25), చాహల్(22), తర్వాత లసిత్ మలింగా(19), రవీంద్ర జడేజా(17), అమిత్ మిశ్రా(17), సునీల్ నరైన్(17), హర్షల్ పటేల్(17) ఉన్నారు. ఈ సీజన్ ఆరంభంలోనే బుమ్రా.. ముంబై తరపున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అతను లసిత్ మలింగా రికార్డ్‌ను అధిగమించాడు. బుమ్రా ఇప్పటి వరకు 181 వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్‌లోనే అత్యధిక వికెట్లు తీసిన జాబితాలో ఆరో స్థానంలో కొనసాగుతున్నాడు. మూడో పేసర్‌గా నిలిచాడు. ఈ సీజన్‌లో బుమ్రా 9 మ్యాచ్‌లు ఆడి 16 వికెట్లు పడగొట్టాడు.

# రీల్

## 'వీరమల్లు'లో ఐటెం సాంగ్..





**ప**వర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'హరిహర వీరమల్లు' ఇప్పటికే షూటింగ్ పనులు ముగించుకుని రిలీజ్‌కు రెడీ అయ్యింది. ఈ సినిమాను క్రిష్ జాగర్లమూడి – జ్యోతికృష్ణ డైరెక్ట్ చేశారు. ఇక ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్ ఫుల్ స్వింగ్‌తో నిర్వహిస్తున్నారు మేకర్స్. తాజాగా ఈ చిత్రం నుండి మూడో సింగిల్ సాంగ్‌గా 'అసుర హననం' అనే పాటను లాంచ్ చేశారు. ఈ సాంగ్ లాంచ్ సందర్భంగా చిత్ర యూనిట్ ప్రెస్ మీట్ నిర్వహించి చిత్రానికి సంబంధించి పలు విషయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి ఈ సినిమాలోని ఓ ఐటెం సాంగ్ గురించి మాట్లాడారు. ఈ సినిమాలో ఓ ఐటెం సాంగ్ ఉందని.. 'తార సితార' అంటూ సాగే ఈ పాటలో కొన్ని లైన్స్ అభ్యంతరకరంగా ఉన్నాయని పవన్ తెలిపాడని.. ఆయన ప్రస్తుతం బాధ్యతాయుతమైన పదవిలో ఉండటంతో ఇలాంటి లైన్స్ వాడకూడదని తెలిపాడని.. వాటిని మార్పించి ఆ తర్వాత తిరిగి సాంగ్ రికార్డింగ్ చేయించాడని కీరవాణి అన్నారు. ఇలా తన పదవి పట్ల నిబద్ధతగా ఉన్న పవన్ కళ్యాణ్ ప్రేక్షకులు ఎలాంటి సినిమా తన నుంచి ఆశిస్తారో ఆయనకు స్పష్టంగా తెలుసని కీరవాణి అన్నారు. ఇక ఈ సినిమా నుంచి నెక్స్ట్ రాబోయే పాట ఇదే కావచ్చని అభిమానులు భావిస్తున్నారు. నిధి అగర్వాల్, బాబీ డియోల్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాను ఏ.ఎం.రత్నం ప్రొడ్యూస్ చేస్తున్నారు.

## అల్లు అర్జున్-అట్లీ మూవీకి దీపిక షిఫ్ట్..?



**బా**లీవుడ్ స్టార్ బ్యూటీ దీపిక పదుకొనే తెలుగులో ప్రభాస్ నటించిన 'కల్కి 2898 ఏడి' చిత్రంతో సాలిడ్ ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమాలో ఆమె నటనకు ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ దక్కింది. ఇక ఇప్పుడు వరుసగా టాలీవుడ్ చిత్రాల్లో అవకాశం దక్కించుకుంటోంది ఈ బ్యూటీ. ఇప్పటికే ప్రభాస్, సందీప్ రెడ్డి వంగ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న 'స్పిరిట్' చిత్రంలో దీపిక సెలెక్ట్ అయ్యింది. అయితే, తాజాగా ఆమెను ఈ సినిమా నుంచి తప్పించాడట దర్శకుడు సందీప్ రెడ్డి. దీంతో ఇప్పుడు ఆమె మరో టాలీవుడ్ బిగ్ ప్రాజెక్ట్‌లోకి అడుగు పెట్టినట్లు తెలుస్తోంది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, తమిళ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న క్రేజీ ప్రాజెక్ట్ గురించి అందరికీ తెలిసిందే. పాన్ ఇండియా చిత్రంగా రాబోతున్న ఈ సినిమాలో ప్రస్తుతం నటీనటుల ఎంపిక జరుగుతోంది. అయితే, ఈ సినిమాలో దీపకను తీసుకున్నారనే టాక్ సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. ఏదేమైనా టాలీవుడ్‌లోనే దీపిక చక్కర్లు కొడుతుందని.. ఒకటి కాకపోతే మరో సినిమాలో ఆమె ఛాన్స్ దక్కించుకుంటుందని అభిమానులు కామెంట్ చేస్తున్నారు. మరి ఇందులో ఎంతవరకు నిజం ఉందనే విషయం తెలియాల్సి ఉంది.

## 'భైరవం' నుండి ఫోక్ సాంగ్..



**టా**లీవుడ్ లేటెస్ట్ మూవీ 'భైరవం' ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ సినిమాను దర్శకుడు విజయ్ కనకమేడల డైరెక్ట్ చేయగా, పూర్తి యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతోంది. ఇక ఈ సినిమాలో బెల్లంకొండ శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ హీరోలుగా నటిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రమోషనల్ కంటెంట్ ఈ సినిమాపై అంచనాలు పెంచేసింది. ఈ అంచనాలను రెట్టింపు చేసేందుకు ఈ సినిమాలోని ఓ పక్కా మాస్ అండ్ ఫోక్ సాంగ్‌ను రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ రెడీ అయ్యింది. 'గిచ్చమాకు' అంటూ సాగే ఈ ఫోక్ సాంగ్‌ను మే 23న సాయంత్రం 4.05 గంటలకు రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ రెడీ అయ్యింది ఈ పాటను బెల్లంకొండ శ్రీనివాస్, అదితి శంకర్ పై చిత్రీకరించారు.

ఇక ఈ సినిమాలో ఆనంది, దివ్య పిళ్లై, జయసుధ, అజయ్, సందీప్ రాజ్, వెన్నెల కిషోర్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు శ్రీ చరణ్ పాకాల సంగీతం అందించగా కెకె.రాధామోహన్ ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని మే 30న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ చేశారు.

## 30 మంది అదనపు ఎస్‌పిల బదిలీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో 30 మంది అదనపు ఎస్‌పిలను బదిలీ చేస్తూ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారి వివరాలు ఇలా ఉన్నాయి.

| పేరు | ప్రస్తుత పోస్టింగ్ | కొత్త పోస్టింగ్ |
|---|---|---|
| ఎ. నరేష్ కుమార్ | అదనపు డిసిపి ఖమ్మం | అదనపు ఎస్‌పి భూపాలపల్లి |
| బి. కిషన్ | అదనపు ఎస్‌పి భూపాలపల్లి | అదనపు ఎస్‌పి వరంగల్ |
| ఎన్. ఉదయ్ రెడ్డి | వెయిటింగ్ | అదనపు డిసిపి మాదాపూర్ |
| ఎస్. జయరామ్ | అదనపు డిసిపి మాదాపూర్ | అదనపు ఎస్‌పి టిజిఐసిసిసి |
| ఎండి ఫజ్లూర్ రెహమాన్ | ఎస్‌బి మేడ్చల్ | సిఐడి |
| ఎ. విశ్వ ప్రసాద్ | వెయిటింగ్ | ఎస్‌ఒటి మేడ్చల్ జోన్ |
| గొల్ల రమేష్ | వెయిటింగ్ | అడ్మిన్ నల్గొండ |
| బి. రాములు నాయక్ | అడ్మిన్ నల్గొండ | ఆపరేషన్స్ నిర్మల్ |
| యు. రవీందర్ రెడ్డి | సిసిఎస్ హైదరాబాద్ | అడ్మిన్ సూర్యాపేట |
| ఎం. నాగేశ్వర్ రావు | అడ్మిన్ సూర్యాపేట | డిజిపి కార్యాలయం |
| ఎస్. చంద్రకాంత్ | వెయిటింగ్ | సిఐడి |
| ఎ. లక్ష్మి | సిఐడి | ట్రాఫిక్ రాచకొండ |
| మహ్మద్ అష్ఫాక్ | సౌత్ వెస్ట్ జోన్ | ఎన్‌సి హైదరాబాద్ |
| బి. ఆనంద్ | సిటిసి హైదరాబాద్ | ఎన్‌సిహైదరాబాద్ |
| బి. కృష్ణ గౌడ్ | సెంట్రల్ జోన్ | ఎన్‌సి హైదరాబాద్ |
| అందే రాములు | మహబూబ్ నగర్ | డిజిపి కార్యాలయం |
| వి. రఘు | వెయిటింగ్ | ట్రాఫిక్II, హైదరాబాద్ |
| టి. గోవర్ధన్ | ఇంటెలిజెన్స్ | వెస్ట్ జోన్ హైదరాబాద్ |
| ఆర్. ప్రభాకర్ రావు | ఆసిఫాబాద్ | ట్రాఫిక్, వరంగల్ |
| కె. శ్రీకాంత్ | వెయిటింగ్ | సౌత్ ఈస్ట్ జోన్ |
| సుందరగిరి శ్రీనివాసరావు | వెయిటింగ్ | జి.ఎ.డి. |
| సి. కుశాల్కర్ | వెయిటింగ్ | అడ్మిన్ సిద్దిపేట |
| జి. నరేంద్ర | వెయిటింగ్ | ఆపరేషన్స్ కొత్తగూడెం |
| ప్రతాపగిరివెంకటరమణ | వెయిటింగ్ | అడ్మిన్ కరీంనగర్ |
| కె. పూర్ణచందర్ | వెయిటింగ్ | శంషాబాద్ |
| కె. రామ్ కుమార్ | శంషాబాద్ | డిజిపి కార్యాలయం |
| జి. హనుమంత రావు | వెయిటింగ్ | ట్రాఫిక్ సైబరాబాద్ |
| కొమ్మెర శ్రీనివాసరావు | వెయిటింగ్ | రాజేంద్రనగర్ |
| ఎం. సుదర్శన్ | వెయిటింగ్ | సిసిఎస్ హైదరాబాద్ |
| ఎన్. శ్యామ్ ప్రసాద్ రావు, | వెయిటింగ్ | సిఐడి |

## మేడ్చల్, శామీర్‌పేట్, ఫ్యూచర్ సిటీల.. మెట్రో రైల్ డిపిఆర్‌లు సిద్ధం



### రూ.19,579 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు

### 86.1 కి.మీ పొడవులో డిపిఆర్‌ల రూపకల్పన

### ఎయిర్ పోర్ట్ మెట్రో లిమిటెడ్ మెట్రోరైల్ ఎండి. ఎన్‌విఎస్.రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : మేడ్చల్, శామీర్ పేట్, ఫ్యూచర్ సిటీ మెట్రో రైల్ డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్)లు పూర్తి స్థాయిలో తయారయ్యాయని హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో లిమిటెడ్ ఎం.డి. ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు. మెట్రో రెండో దశ(బి)కి సంబంధించిన డిపిఆర్‌లు సిద్ధం చేశామని, వీటిని హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో లిమిటెడ్ బోర్డు ఈ నెల 8 వ తేదీన ఆమోదించిందని ఆయన వెల్లడించారు. ఇప్పుడు డిపిఆర్‌లు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం లభించే వరకు వీటికి సంబంధించిన కొన్ని అంశాల విషయంలో గోప్యత పాటించాల్సి ఉంటుందన్నారు. అందువల్ల పూర్తి వివరాలు అందించలేక పోతున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు జెబిఎస్‌ను ఒక అంతర్జాతీయ హబ్‌గా తీర్చిదిద్దడంతో పాటు డిపిఆర్‌లో పలు అంశాలను పొందుపరిచామని తెలిపారు. రూ.19,579 కోట్ల అంచనా వ్యయంతో 86.1 కి.మీ పొడవు గల జెబిఎస్ మేడ్చల్, జెబిఎస్ శామీర్‌పేట్, ఎయిర్ పోర్ట్ ఫ్యూచర్ సిటీ మెట్రో ఫేజ్II (బి) కారిడార్ల ప్రతిపాదనలతో డిపిఆర్‌లను పూర్తి చేయడం జరిగిందన్నారు. జెబిఎస్ స్టేషన్ మేడ్చల్ మార్గం 24.5 కిలోమీటర్లు, 18 స్టేషన్‌లతో పూర్తి ఎలివేటెడ్ కారిడార్‌గా ఉంటుందన్నారు. జెబిఎస్ స్టేషన్ శామీర్‌పేట్ మార్గం 22 కిలోమీటర్ల కారిడార్ 14 స్టేషన్‌లతో నిర్మాణం అవుతుందని చెప్పారు. ఈ మార్గం 20.35 కి. మీ ఎలివేటెడ్‌గాను, 1.65 కిలోమీటర్లు భూగర్భ మార్గంగాను ఉంటుందన్నారు. హకీంపేట విమానాశ్రయం సమీపంలో ఈ భూగర్భ మార్గం రానుందని ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు. ఆర్జీఐఏఫ్యూచర్ సిటీ (స్కిల్స్ యూనివర్సిటీ) 39.6 కిలోమీటర్లుండగా, దీనిలో ఎయిర్ పోర్ట్ నుండి 1.5 కి.మీ భూగర్భ మార్గంగాను, 21 కి. మీ ఎలివేటెడ్‌గాను, 17 కి.మీలు ఎట్ గ్రేడ్‌గాను ఉంటుందన్నారు. ఇది శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి పెద్ద గోల్కొండ, రావిర్యాల్ మీదుగా స్కిల్స్ యూనివర్సిటీ వరకు కొనసాగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, ఇతర రాష్ట్రాలలో మెట్రో రైల్ నిర్మాణ అంచనాలు, హైదరాబాద్‌లో ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని రెండవ దశ (బి) డిపిఆర్‌లను సమగ్రంగా రూపొందించి, రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించామని ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ డిపిఆర్‌లను ఆమోదించి, కేంద్రానికి సమర్పించాక పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎన్‌విఎస్ రెడ్డి చెప్పారు.

## సకాలంలో విధులకు హాజరు కాకపోతే చర్యలు

### మార్కెటింగ్ శాఖ సిబ్బందికి మంత్రి తుమ్మల హెచ్చరిక



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అధికారులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని లేకపోతే చర్యలు తప్పవని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు హెచ్చరించారు. హైదరాబాద్‌లోని మార్కెటింగ్ శాఖ ప్రధాన కార్యాలయాన్ని మంత్రి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విధులకు ఆలస్యంగా వచ్చిన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలస్యంగా వచ్చిన సిబ్బందికి వెంటనే మెమో ఇచ్చి, సంజాయిషీ తీసుకోవాల్సిందిగా మార్కెటింగ్ డైరెక్టర్‌ను ఆదేశించారు .దీంతో విధులకు ఆలస్యంగా వచ్చిన 16 మంది రెగ్యూలర్ సిబ్బందితోపాటు మరో 5 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బందికి మోమోలు జారీ చేశారు. ప్రతి ప్రధాన కార్యాలయాలలో ఫేస్ రికగనైజేషన్ తో బయో మెట్రిక్ ఏర్పాటు చేయాలని మార్కెటింగ్ డైరెక్టర్‌కు సూచించారు. ప్రతిరోజు సిబ్బంది హాజరు పట్టికను తన కార్యాలయానికి పంపాల్సిందిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్కెటింగ్ డైరెక్టర్‌ను ఆదేశించారు.

## 'అమృత్ భారత్ స్టేషన్లు'

(మొదటి పేజీ తరువాయి)

నిలబెట్టాయని అన్నారు. భారత్‌లో రక్తపుటేర్లు పారించినవాళ్ల వాళ్లకు సరైన బుద్ధి చెప్పామన్నారు. భవిష్యత్తులోనూ భారత్‌పై ఉగ్రదాడి జరిగితే, ప్రతిస్పందన ఇదే విధంగా ఉంటుందని అన్నారు. ఉగ్రవాదానికి తలవొగ్గేది లేదని అన్నారు. భారత్‌పై పాకిస్తాన్ చేస్తు న్న దుష్ప్రచారం గురించి ప్రపంచానికి తెలియచేయడానికి మన పార్లమెంటు సభ్యులు విదేశాలకు వెళ్లిన వైనాన్ని మోదీ ప్రస్తావించారు. రాజస్థాన్‌లోని ఎయిర్‌బేస్‌ను ధ్వంసం చేయాలని పాక్ ప్రయత్నించిందికానీ, పాకిస్తాన్ క్షిపణులు ఎయిర్‌బేస్‌ను తాకలేకపోయాయని అన్నారు. మన వాయుసేన పాక్‌లోని ఎయిర్‌బేస్‌లను ధ్వంసం చేసిందని ప్రధాని అన్నారు.

## తెలంగాణకు రైల్వే కనెక్టివిటీ పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించారు. వీటిలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని తెలంగాణలోని బేగంపేట, వరంగల్, కరీంనగర్ మూడు రైల్వే స్టేషన్లు ఉన్నాయి. రాజస్థాన్ రాష్ట్రంలోని దేశ్నోకి రైల్వే స్టేషన్లో ప్రత్యక్షంగా జరిగిన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాజస్థాన్ గవర్నర్ హరిభావు కిషనావ్ బగాడే, రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్లాల్ శర్మ, కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ మరియు ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.అందులో భాగంగా బేగంపేట రైల్వే స్టేషన్ ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో పాటు రైల్వే శాఖ ఉన్నతాధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. బేగం పేట తరహాలోనే నల్లగొండ, మిర్యాలగూడ రైల్వే స్టేషన్లకు ఆధునీకరించాలని ఆయన కేంద్రాన్ని కోరారు. తెలంగాణ నుంచి మరిన్ని నగరాలకు రైల్ కనెక్టివిటీ పెంచాలని అభ్యర్థించారు. గతంలో ఎంపిగా ఉన్న సమయంలో హైదరాబాద్ నుంచి యాదగిరి గుట్ట వరకు ఎంఎంటిఎస్ మార్గాన్ని పొడిగించాలని కోరినట్లు గుర్తు చేసిన ఆయన.. ప్రస్తుతం టెండర్లు పిలిచారని ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా ఎంఎంటిఎస్ సేవలు అందించాలన్నారు. ఎంఎంటిఎస్ మార్గం పొడిగింపుతో యాదగిరి గుట్టకు వచ్చే భక్తులతో పాటు ప్రతినిత్యం హైదరాబాద్ లో పని చేసుకునే చిరుద్యోగులు సహా వ్యాపారులకు తక్కువ ఖర్చుతో ప్రయాణం జరగడమే కాకుండా సమయం ఆదా అవుతుందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం మాటలకే తప్ప చేతలు చూపించలేదన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు ఏర్పాటుతో పాటు ఈ రింగ్ రైల్ నిర్మాణం కూడా ప్రారంభించాలని ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ లకు విజ్ఞప్తి చేశారు. 'రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన పెంచేందుకు కట్టుబడి ఉంది.. గతంలో హైదరాబాద్ సహా తెలంగాణ అభివృద్ధి లో కీలకపాత్ర పోషించిన రింగ్ రోడ్ తరహాలోనే ఇప్పుడు రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. తెలంగాణ అభివృద్ధిలో ఈ రీజినల్ రింగ్ రోడ్డు ప్రాధాన్య పాత్ర పోషిస్తుంది. ఈ రీజినల్ రింగ్ రోడ్ మార్గంలో హైదరాబాద్కు లాజిస్టిక్ హబ్ కనెక్టివిటీగా ప్రాంతీయ రింగ్ రైలు మార్గం ఏర్పాటు చేయాలని రైల్వేను అభ్యర్థిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో యాదగిరి గుట్ట ప్రసిద్ధ పుణ్యక్షేత్రం. భక్తులు ఎంతో మంది దర్శనార్థం చేరుకుంటారు. అంతేకాదు రోజుకు దాదాపు 50 వేలమంది హైదరాబాద్ టూ యాదగిరి గుట్ట మార్గం నుంచి చిన్నచిన్న ఉద్యోగాలు, పనుల కోసం ప్రయాణిస్తుంటారు.యాదగిరి గుట్ట, హైదరాబాద్ మార్గంలో ఎంఎంటీఎస్ పూర్తి చేయాల్సిన అవసరాన్ని నేను భువనగిరి ఎంపీగా ఉన్న సమయంలోనే రైల్వే మంత్రి గారిని అభ్యర్థించాను. ఎందరో చిరుద్యోగులు, పేదలు ప్రయాణ అవసరాలు తీర్చేలా ఎంఎంటీఎస్ మార్గాన్ని పూర్తి చేయాలని రైల్వేశాఖను కోరుతున్నట్లు వివరించారు. తెలంగాణలో గ్రామీణ ప్రాంతాలతో మరింతగా రైల్వే అనుసంధానం పెంచాల్సిందిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారిని, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విణి వైష్ణవ్ గారిని గతంలో ఎంపీగా పని చేస్తున్న సమయంలో అభ్యర్థనలు పంపానని గుర్త చేస్తూ .. గ్రామీణ అనుసంధానాన్ని పెంచడానికి 6 కొత్త రైల్వే లైన్ల ఏర్పాటు చేయాలని రైల్వే శాఖను కోరారు. ఇందుకోసం అవసరమైన భూసేకరణ సహా రాష్ట్ర ప్రభుత్వం అన్ని సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. గతంలో ఎంపీగా ఉన్న సమయంలో పలు రైల్వే ప్రతిపాదనలు పంపిన సమయంలో సానుకూలంగా స్పందించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీగారు, కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ గారికి నా మన: పూర్వక ధన్యవాదాలను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. రాజ్యసభ సభ్యులు ఎం. అనిల్ కుమార్ యాదవ్; ఆలేరు శాసనసభ సభ్యులు బీర్ల ఐలయ్య మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ వీడియో లింక్ ద్వారా పాల్గొన్నారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ స్వాగత ప్రసంగం చేశారు, సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ భరతేష్ కుమార్ జైన్, సీనియర్ రైల్వే అధికారులు కూడా పాల్గొన్నారు.

## ప్రభాకర్‌రావుకు దారులన్నీ బంద్

(మొదటి పేజీ తరువాయి)

నోరు విప్పంతే తమ జాతకాలు తారుమారవుతాయని వారిలో భయం పుట్టుకుంది. 14 నెలల క్రితం అమెరికాకు పారిపోయిన ప్రభాకర్‌రావు ఈ కేసులో నుంచి ఊరట పొందేందుకు ఎక్కనిదిగనిగడప లేదు, వేయని ఎత్తుగడలు లేవు. ఈ కేసులో కోర్టుకు హాజరు కావాల్సిందే.. ఎప్పుడు హాజరవుతారని కోర్టు ప్రశ్నించడంతో ఆయన ఆశలు ఆవిరై పోయాయి. ఇక రెపోమాపో ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర రావు హైదరాబాద్ రావాల్సిందే. తెలంగాణలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ కేసు రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద కలకలం రేపింది. ఈ కేసు 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో, అప్పటి అధికార బిఆర్ఎస్ పార్టీ పాలనలో జరిగిన అనధికారిక ఫోన్ ట్యాపింగ్ కార్యకలాపాలకు సంబంధించినది. గత ఏడాది మార్చి 10న పంజగుట్ట పోలీసు స్టేషన్‌లో ఎస్ఐబి అదనపు ఎస్‌పి డి. రమేష్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పంజాగుట్ట పోలీస్ స్టేషన్లో నమోదు చేశారు. నమోదైన ఈ కేసులో ఎస్ఐబి డిఎస్‌పి ప్రణీత్ రావుతో పాటు అదనపు ఎస్‌పిలు మెకల తిరుపతన్న, భుజంగ రావు, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి టి. రాధాకిషన్ రావులు అరెస్టై ప్రస్తుతం బెయిల్‌పై బయటికి వచ్చారు. తదుపరి విచారణలో, సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, వ్యాపా రవేత్తలు, జర్నలిస్టులు, న్యాయమూర్తులు, గవర్నర్, ఎంఎల్‌ఎ, ఎంపిలతో సహా అనేక మంది ఫోన్లు ట్యాప్ చేయబడ్డాయని వెల్లడైంది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఎస్ఐబి మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు, మారో నిందితుడు ఓ న్యూస్ ఛానల్ టివి యజమాని ఎన్.శ్రవణ్‌కుమార్‌లు అరెస్టు నుంచి తప్పించుకునేందుకు అమెరికాకు పారిపోయారు. సుప్రింకోర్టులో శ్రవణ్‌కుమార్‌కు ఊరటలభించడంతో అమెరికా నుంచి వచ్చి విచారణ అధికారుల ముందు హాజరై వివరణ ఇచ్చారు. అయితే ప్రభాకర్‌రావుకు మాత్రం ఏ కోర్టుల నుంచి ఊరట లభించకపోవడంతో ఇక అతను వచ్చి లొంగిపోక తప్పదు. ఎస్ఐబి చీఫ్ టి. ప్రభాకర్ రావు 2023 ఎన్నికల సమయంలో, అప్పటి ప్రతిపక్ష నేతలు, వ్యాపారవేత్తలు, జర్నలిస్టులు సహా 1,200 మందికి పైగా వ్యక్తుల ఫోన్లు అనధికారికంగా ట్యాప్ చే యబడ్డాయి. నిందితులు కంప్యూటర్ హార్డిస్కు లు, పత్రాలు తదితర సాక్ష్యాలను నాశనం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభాకర్‌రావుకు ఇప్పటికే రెడ్‌కార్నర్ నోటీసులు కూడా జారీ అయ్యాయి.ప్రభాకర్ రావును అమెరికా నుండి భారత్కు తీసుకురావడానికి తెలంగాణ పోలీసులు యుఎస్ అధికారులను సంప్రదించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఫోన్ ట్యాపింగ్ బాధితులలో ఒకరుగా ఉన్నారు. కాగా ఈ కేసులో నిందితుడైన శ్రవణ్ రావు ఇటీవల రూ. 6.5 కోట్ల ఐరన్ ఓర్ మోసం కేసులో సిసిఎస్ పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం ఇతను చంచల్‌గూడ జైలులో ఉన్నారు. ప్రభాకరావు రాకకోసం రాజీకయ పక్షాలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com